
Regd. No. H. 373


ఆంధ్రప్రదేశ్

సంపుటి 5 సంచిక 4


ఫిబ్రవరి 1961

మాఘం, 1882 శకము





పంచమి తీర్థ (బ్రహ్మోత్సవం) సందర్భంగా, 1960 నవంబరు 23వ తేదిన తిరుచానూరు (అలివేలు మంగాపురం) కు 25000 మందికి పైగా యాత్రికులు విచ్చేశారు. పవిత్ర పుష్కరిణిలో భక్తజనులు స్నాన, జపాదులు ఆచరిస్తున్నప్పటి దృశ్యం.



యాత్రికుల మరొక దృశ్యం.

ఆంధ్రప్రదేశ్

సంపుటి 5	ఫిబ్రవరి 1961 మాఘం, శకము 1882	సంచిక 4

విషయసూచిక

1.	గవర్నరు సందేశం	...	— —	...	3
2.	ముఖ్యమంత్రి సందేశం	...	— —	...	4
3.	మాతృపూజ	...	'విద్యాదేవ కులపతి'	...	5
4.	ప్రబంధావతారికలు-కొమఱ్ఱాజువారి వంశావళి		నిడదవోలు వేంకటరావు	...	7
5.	శ్రీ త్యాగరాజు	...	స్వర్గీయ చల్లా పిచ్చయ్యశాస్త్రి	...	14
6.	వాగ్గేయకారోజ్జ్వలమణి-త్యాగరాజు	...	బాలాంత్రపు రజనీకాంతరావు	...	17
7.	ప్రభుత్వనిర్ణయాలు	...	— —	...	19
8.	చేనేత పరిశ్రమ	...	సి. వి. సుబ్బన్న శతావధాని	...	20
9.	శ్రీకూర్మం	...	గజపతిరాయవర్మ	...	22
10.	బహుమతి పత్రాలు	...	చిట్టా దామోదరశాస్త్రి	...	24
11.	కొండపల్లి ఖిల్లా	...	అక్కల బాబురావు	...	26
12.	ప్రసన్న కవితాలోకము	...	'మసూనా'	...	28
13.	వ్యాఖ్యానమ్	...	యామిజాల పద్మనాభస్వామి	...	30
14.	నాగార్జున సాగరము	...	కన్నెకంటి వీరభద్రాచార్యులు	...	33
15.	ప్రగతి పథంలో	...	— —	...	35
16.	పంచాబ్దపు ప్రణాళికలు	...	కల్లూరి భోగేశ్వరసోమయాజులు	...	38
17.	చదువుకున్నందుకు	...	'పిరాజీ'	...	39
18.	రోగంలేని మందు	...	ముద్దంశెట్టి హనుమంతరావు	...	45
19.	ధన్యజీవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి	...	గిడుగు వేంకటసీతాపతి	...	54
20.	జనాభాగణనము	...	యస్. శ్రీనివాసాచార్య	...	56

21.	విక్రమోర్వశీయము	...	'పిపాసి'	... 58
22.	ప్రశ్నోత్తరావళి	...	— —	... 60
23.	పొదుపు పథకం	...	— —	... 62
24.	పారిశ్రామిక విశేషాలు	...	— —	... 63
25.	గ్రంథసమీక్ష	...	దివాకర్ల వేంకటావధాని	... 65
26.	సంగ్రహ ప్రకటనలు	...	— —	... 70
27.	ముఖ్యవార్తలు	...	— —	... 73

ముఖచిత్రం: "ఏకాగ్రత"-కరీంనగరంలో ఉన్ని పరిశ్రమ.

వెనుక అట్ట : అరకులోయలో నూకదొర తెగకు చెందిన ఒక వ్యక్తి - అతని పశువులు.

చందా వివరాలు

సంవత్సరానికి	—	2 రూపాయల 16 నయాపైసలు
విడి ప్రతి వెల	—	18 నయాపైసలు

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad-1

"ఉన్నత నైతిక జీవితంతో ఆదర్శప్రాయులుకండి"

1961 "రిపబ్లిక్ దినోత్సవ" సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ గవర్నరు డా. భీమసేన్ సచార్ దిగువ సందేశం ఇచ్చారు.

ఈరోజు ప్రజల దినం. నేటికి పదకొండు వసంతాలకు పూర్వం ఇదే రోజున, భారతదేశాన్నొక సర్వ స్వతంత్ర ప్రజాస్వామిక రిపబ్లికుగా రూపొందించుకొని దేశ పౌరులందరికీ రాజకీయ, సాంఘిక, ఆర్థిక న్యాయాన్ని చేకూర్చడానికి భారత ప్రజలు త్రికరణశుద్ధిగా ప్రతినబూనారు. కాబట్టి ప్రభుత్వం విషయం అటుంచి, న్యాయం బహుముఖంగా విలసిల్లటానికి ఎంతవరకు కృషి చేశామా అని ప్రజలు ఒకసారి ఆత్మపరీక్ష చేసుకోవటం సముచితం. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా తాము సక్రమంగా నిర్వహించాయని ప్రజలని సంతృప్తిపరచే బాధ్యత వాటిపై లేదనిగాదు. ప్రభుత్వాలపై బాధ్యత వున్నదనేది సువ్యక్తమే. ఐతే నేను కోరేదేమంటే, ప్రభుత్వ యంత్రాంగంలో భాగంగాకుండా వున్నవారిని ఆత్మపరీక్ష చేసుకోమని మాత్రం.

మన నిత్య జీవితంలో, విభిన్న కార్యకలాపాలలో, ఇతరులతో మెలగవలసి వచ్చినపుడు మనం న్యాయంగానూ, సుహృద్భావంతోనూ చరించవలసి ఉంది. ఐనప్పటికీ మనలో అత్యధికులు నిజాయితీపరుడినుంచి ఆశించే తగుమాత్రం నడవడికనైనా ఆచరించటంలేదని ఫిర్యాదులు విపరీతంగా వస్తున్నాయి. ఇలా చేయటం ప్రజాస్వామ్యాన్ని బలపరచటమేనంటారా? కాదు. పునాదులతోసహా పెళ్ళగించటమే అవుతుంది. అంటే ప్రజలు తమ కళ్ళముందే లేత వృక్షంగావున్న మన ప్రజాస్వామ్యపు వ్యవస్థ కూలి కూలిపోవటం ఆశిస్తున్నట్లా? నేనలా అనుకోవటం లేదు. మరి మనం న్యాయానికి భిన్నంగా ఎందుకు ప్రవర్తిస్తున్నాము? దీన్నిబట్టి మన బాధ్యతాజ్ఞానం అల్పస్వభావాల నుండి జనించిన ఎరలను అదుపులో పెట్టగలిగినంత దృఢమైనది కాదని స్పష్టమవుతున్నది. ఈ బలహీనతను అధిగమించేలా మనం పనిచేయాలి. చేతలకంటే చెప్పటం తేలిక అని నాకు తెలుసు. మనదేశం సుస్వతంత్ర ప్రజాస్వామ్య రిపబ్లికుగా సుసంపన్నం కావాలంటే మరి ప్రత్యామ్నాయ మార్గమేమిటి?

భారతమాత పిలుపు

సక్రమమైన విద్యావ్యాప్తివల్ల మనం ఉత్తమ పౌరులముగా తయారవుతాం. ఐతే యీలోగా దేశానికే ముప్పు తెచ్చిపెట్టే సాంఘిక వ్యతిరేక ధోరణులను అరికట్టేందుకు మనం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవలసి ఉంది. దుష్టశక్తులను నాశ్చు చేయటంలో ప్రభుత్వం నిస్సందేహంగా కఠినచర్యలు తీసుకోవలసిందే. కాని ప్రభుత్వ యంత్రాంగానికి అందుబాటులోలేని సాంఘిక కార్యకలాపాలు కొన్ని ఉన్నాయి. కనుక మనం ప్రభుత్వానికి యీ విషయంలో చేదోడు నివ్వాలి. ఇందుకై అన్ని మూలలనుంచి ప్రతిఒక్కరూ తమ వాటా సమర్పించవలసిందే. తమ భౌతికసంపదను అభివృద్ధి చేసుకోవటంలో అడ్డంకులుగా వున్నా, ఆదర్శప్రాయులైనవారు, నిస్వార్థ, నిజాయితీ జీవితాన్ని గడపటానికి ముందుకు రావాలి. ఇది భారతమాత పిలుపు! మన మాతృదేవి పిలుపును వినీవిననట్లు త్రోసిపుచ్చగలమా?

ఇతరులనుంచి మార్గదర్శకత్వం కోసం ఎదురుచూడటం మనలో ఏ ఒక్కరికీ తగదు. పైన పరమాత్మ లోపల అంతరాత్మలతో తక్షణం మనం ముందుకు పోవాలి. మనం జాప్యం చేసిన కొద్దీ విజయావకాశాలు సన్నగిలుతాయి. కాలహరణం ప్రమాదం. దీక్షాకంకణబద్ధులమై ముందుకు సాగుదాం. ఈ రకంగా ప్రతినబూనితే రిపబ్లిక్ దినోత్సవాన్ని మనం హృద్యంగమంగా చేసుకున్నట్లవుతుంది. మన సమిష్టిప్రతిజ్ఞ ఒకరాత్రి తిరిగేటప్పటికి మనచుట్టూ అలుముకుంటున్న కలుషిత వాతావరణాన్ని మార్చివేస్తుంది. భారీఎత్తున ఉన్నత నైతిక ప్రవర్తన కలిగి మెలిగితే, మన మిత్రులు, సహచరులు, బంధువులుకూడ మంచి నడవడికతో చరించేటట్లు ఉత్తేజితులవటమే గాకుండా, అంతకంటే మిన్నగా, సాంఘిక వ్యతిరేకశక్తులు మనటానికి వీలులేని ప్రజాభిప్రాయ వాతావరణం నెలకొంటుంది. న్యాయం విలసిల్లేలా యీ విషయంలో మనకృషికి భగవంతుడు తోడ్పడుగాక!

'ఇతర రంగాలలోకూడ ఆదర్శాలను నెలకొల్పండి'

1961 రిపబ్లిక్ దినోత్సవ సందర్భాన ముఖ్యమంత్రి
శ్రీ దామోదరం సంజీవయ్య ఈ దిగువ సందేశాన్ని ఇచ్చారు:

పదకొండు సంవత్సరాల క్రితం భారతదేశం స్వతంత్రి ప్రజాస్వామిక రాజ్యంగా ప్రకటించుకున్నది. అదేకాలంలో దేశాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి జేసుకోవాలన్న సుదృఢ ప్రయత్నం ప్రారంభమయింది. ఈ దశాబ్దంలో సాధించిన ఫలితాలను సమీక్షించినపుడు, దేశ స్థితిని విపరీతంగా మార్చామని చెప్పకపోయినప్పటికీ, దేశాన్ని ఒక నూతన వ్యవస్థలో నిర్మించడానికి బలీయమైన పునాదులను వేశామంటే ఎవరూ కాదనజాలరు. అన్ని తరగతుల ప్రజలకు వాస్తవమయిన ఆర్థిక స్వాతంత్ర్యం సమకూరేందుకై ముఖ్య చర్యలు కొన్ని తీసుకోబడినవి. ఇందుకు అన్నిటికంటె ముందు అవసరమయినది దేశ సంపదను అభివృద్ధిజేయటం. పెక్కుచోట్ల బ్రహ్మాండమయిన ప్రాజెక్టులు నిర్మాణ దశలో వున్నాయి. ఇవి పూర్తయితే దేశంలో వ్యవసాయోత్పత్తి పరిశ్రమలు ఎంతో పెరిగిపోతాయి. ఇంతకుమును పెన్నడూ కని విని ఎరుగనంత మేర విద్యావకాశాలు పెంచడానికి చర్యలు తీసుకోబడినవి.

అయితే, జాతీయాభివృద్ధికై చేసే ఇలాంటి కృషి సత్ఫలితాల నివ్వాలంటే, అన్ని స్థాయీలలో ప్రజలు తమకు తామై చొరవ తీసుకుని తమ శాయశక్తులా తమ వంతును సమర్పించవలసి వుంది. రిపబ్లిక్‌లో ఒక సుసంపన్నమైన భాగంగా తన గ్రామాన్ని పునర్నిర్మించుకోవటం సామాన్య గ్రామవాసికూడ ఆత్మ ప్రేరితమయిన విధిగా భావించాలి. ప్రజల చేతులకు అధికారాన్నిచ్చి, ఏవయినా నిర్ణయాలు తీసుకుని, అమలుపరచే బాధ్యతను వారి కప్పగించినపుడు పైన చెప్పినటువంటి భావన, చొరవ వాటంతటవే వారిలో వృద్ధిగాంచుతాయి. అప్పుడే అన్నిటికంటే తక్కువ స్థాయిలోకూడ వాస్తవమైన స్వాతంత్ర్యం ఆచరణలో వున్నట్లవుతుంది. మన దేశానికి చిరపరిచితమైన పంచాయతీరాజ్య వ్యవస్థను సమగ్రంగా పునరుద్ధరించటం అవసరం. ఈ విషయంలో మన ఆంధ్రప్రదేశ్ ముందు నిలబడటం గర్వకారణం. ఈ మధ్యనే మన రాష్ట్రంలో పర్యటించిన పార్లమెంటరీ పరిశీలక బృందం వారు మన పంచాయతీ రాజ్య కార్యాచరణ ఫలితాన్ని బ్రహ్మాండంగా శ్లాఘించారు. అలాంటి విప్లవాత్మక ప్రయోగంలో సహజంగా అనివార్యమైన స్థానిక సమస్యలు తలెత్తినప్పటికీ, మన ప్రజలు ఉత్సాహాతిశయాలతో ముందుకువచ్చి, ఇతరరాష్ట్రాలకు గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పుతున్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికవంతం జేయటం, వివిధ ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులను అతి శీఘ్రంగా ముగించటంవంటి ఇతర అభ్యుదయ పథకాల నిర్వహణ రంగాలలోకూడా అంతటి ఉత్సాహాన్ని, సహకార బుద్ధిని ప్రదర్శించినట్లయితే, పంచాయతీ రాజ్యం విషయంలోలాగే ఇతర రంగాలలోకూడ మిగతా రాష్ట్రాలకు ఆదర్శప్రాయమైనదిగా ఆంధ్రప్రదేశ్ ముందుముందు విలసిల్లుతుందని నా నమ్మకం. ఈ ఆదర్శాన్ని మనసులో వుంచుకుని, రాష్ట్రానికి ప్రతిష్ట, ఐశ్వర్యం చేకూర్చటానికి సుహృద్భావంతో ఒకరొకరితో పోటీగా పనిచేయవలసిందని ఈ సందర్భాన ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

జైహింద్!


భారత జాతీయ కాంగ్రెసు వార్షికసభల సందర్భాన భావనగర్‌లో జరిగిన ఖాదీ గ్రామోద్యోగ ప్రదర్శనంలో ఆంధ్రప్రదేశ్ శాల చాలా ఆకర్షణీయంగా వుండి ప్రశంసలు పొందింది. ప్రధాన మంత్రి, రక్షణ మంత్రి, శ్రీమతి ఇందిరాగాంధి, ఇతరనాయకులుగూడా ఆంధ్రప్రదేశ్ ప్రదర్శనశాలను చూచి ఆనందించారు.




భావనగర్ ప్రదర్శనంలో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ ప్రేక్షకులను అమితంగా ఆకర్షించింది. లోనికి ప్రవేశించడానికి పెవిలియన్ ముందు బారులు తీర్చినుంచున్న ప్రేక్షక సమూహంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పబ్లిక్‌వర్క్సు శాఖామంత్రికూడా వుండుట ఈ చిత్రంలో చూడవచ్చు.




ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ లోని ఒక దృశ్యం.



శ్రీమతి ఇందిరాగాంధి తమ అభిప్రాయం వ్రాస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పబ్లిక్‌వర్క్స్ మంత్రి ప్రదర్శనను పరిశీలిస్తున్నారు.




భారత రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమెనన్ తమ అభిప్రాయం విజిటర్స్ బుక్కులో వ్రాస్తున్నారు.



ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రదర్శనశాలను పరిశీలిస్తున్నారు.



వ్యవసాయోత్పత్తి పెరుగుదలకు తలపెట్టిన "ప్యాకేజిపథకాని" కి ఏలూరులో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు



ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు 1960 డిశెంబరు 29 వ తేదిన రాజమండ్రిలో దివంగతులైనారు. ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఇటీవల రాజమండ్రి వెళ్ళినపుడు ఆయనను కలుసుకొనిన సందర్భంలో తీసిన చిత్రం.

—(54 వ పుట చూడుడు.)

మాతృపూజ

విద్యాదేవ కులపతి

అమృతములు జాలువార్చు నీ అంతరంగ
మాలకింపదొ తల్లి! ఈ ఆర్తహృదయ
వేదనము కోటిజన్మల రోదనమ్ము
వెలుగు కనలేని జీవి నివేదనమ్ము

నిజము లోకైకమాత! మా నిండు పెదల
కేవలానంద సౌహార్దగీతి వీవు
అందములు చిందువందు నీ అంఘ్రియుగళి
అందుకొనుగాక నేడు మా వందనమ్ము

పాడుకొనుచుంటి ఈ వ్యథాభార వికృత
గానమును నేను వేలయుగాలనుంచి
అంతులేని యీ శోకకావ్యమ్ము తల్లి!
వ్రాయుచున్నాడ కోటికల్పాలనుండి

నవ్వు ఎరుగని మేనికండలను గోసి
రక్తమునుదీసి నీలిసిరాగ మార్చి
నీ స్మరణతోడ నిండిన నిండుపెదద
వ్రాసెదను తల్లి! దుఃఖప్రపంచగాథ

పగటి కలలనుగాంచు ఈ బ్రతుకుతెరల
మసకమసకగ ఏదొ మానసికతృప్తి
తోచునో తల్లి! గుండెలు దోచుకొనుచు
తృప్తి యనరానిదది దీర్ఘసుప్తి యేమొ!

ఎండనక వాననక ఆర్తి నేడ్చియేడ్చి
కన్నులివి తల్లి! కాయలు గాచిపోయె
ఎవరువిందురు మెత్తని హృదయమునుంచి
ఈ రసవిహీన దారిద్ర్య ఘోరగాథ

ఎవరితో చెప్పుకొందు నా స్వేచ్ఛలేని
జీవితముగూర్చి పెద్ద విశేషమనుచు
ఎవరు పట్టించుకొందురీ హీనదీన
మానవుని గుండెలోని కంపమ్ము తల్లి!

సృష్టి మారినదిక ఈ చరిత్రహీను
స్వీయకథ చెప్పుతరుణము చెల్లిపోయె
కట్టకడపటి చిత్రసంఘటన మేమొ
తల్లి! ఊహింపలేని వింతలు జనించె

చిత్రహింసలతో నీరసించినట్టి
నాకు జగమెల్ల అగ్నికుండముగ దోచు
ఛాపధనశక్తి దారిద్ర్యభరముచేత
అఖిలమును మాత! శాంతిశూన్యముగ తోచు

నాకు లోకాన ఒక్క అందమునులేదు
నాకు లోకాన ఒక చిరునవ్వులేదు
ఉన్నదొకటే కఠోర నిర్భిన్నహృదయ
వికలసంకల్పతీవ్రతా వికృతి-జనని!

గుండెలను చీల్చి నెత్తురు పిండుకొనెడు
జనుల దుర్భర ఘోరహింసలను చూచి
శిలలుకరుగ ఒకప్పు డేడ్చితిని గాని
నేడు జనయిత్రి! కన్నుల నీరురాదు

కఠిన కర్కశ పాషాణ కల్పమైన
వదనములు చూచి గుండెలు చెదరిపోయె
ఉక్కుపాదాల దయలేని త్రొక్కుడులకు
ఎన్నినాళ్ళని తప్పుకొ నెంతునమ్మ!

నేను వ్యథలింక భరియింపలేను తల్లి!
కష్టములుచాలు ఆశ్రిత కల్పవల్లి!
ఈ దురంతమ్ములను చూడలేదు మనసు
ఈ విషాదకథల్ వినలేవు చెవులు

దుష్టదుర్వ్యథలీ మహా దుఃఖకథలు
ఈ విచారణలేని శిక్షావిధమ్ము
లరయజాలని పావన ప్రాంతమునకు
తీసికొని వెళ్ళవమ్మ! యీ దీనజనుని—

లోకసౌఖ్యమ్ము లేవియు నాకువలదు
నాకసౌఖ్యమ్ములేనియు నాకువలదు
సుఖము దుఃఖమ్ములేని యేచోటు గలదొ
జనని! వాంఛింతు నట్టినీ చరణసీమ

వదల కెందుల కంటగట్టెదవు నాకు
ఉన్నతంబైన యీ జాతి ఉద్ధరణము
తనను తా నుద్ధరించుకో తరముగాని
వీడొక ప్రవక్తయౌట కల్పింతువేమి?

బెడద యిది వద్దనుచు నుండుబెడద నెంత
వాదులాడిన నీమాట నీదెగాని
ఇంచుకేని నా పల్కు పట్టించుకోవు
ఇష్టములులేని పనులివి యేల? జనని!

ఇష్టమున్నను లేకున్న ఏది యెట్టు
లైన నీ యాజ్ఞ మీరగాలేను తల్లి!
జీవనమునెల్ల నీ పాదసేవనమున
కంకితము చేసితిని నిరభ్యంతరముగ

సర్వమును నీకు అర్పణసలిపి జనని
నేను నిశ్చింతగానుందు నేటినుండి
చేయుమిది యన్నదానిని చేయుచుందు
లేశమును కష్టసుఖములులేవు నాకు


ఎట్టి చెడుగాని మంచిగానీ సవిత్రి!
అంటబోదు నన్ను లోకాంతరమున
నాకు స్వేచ్ఛాస్వభావ మేనాడుగూడ
కలుగకుండునుగాక నీ చలువచేత

ఏ పనిని చేయుచున్న నే నెచటనున్న
నిన్నుగాక మరొక్కటి నేనుగనను
దుష్టులెవ్వరు? జనయిత్రి! శిష్టులెవరు?
అందరును ఒక్కటే నీదు అంతికమున

భక్తితోవచ్చి నీ గృహ ప్రాంగణమున
జనని! పాపపుణ్యమ్ముల చర్చయేల?
ప్రాణికోటితో నిండిన ప్రకృతియెల్ల
నీదు సంతతిగాదొ? యీ వాదమేల?

ప్రకృతిపాలిక వీ భేదభావములకు
స్థానమొసగకు మమ్మ! యీ జనుని యెడద
నీల గగనావనుల మధ్య నీవుగాక
నన్నురక్షింప నెవ్వరున్నారు తల్లి!

నీ స్మరణలోన నిరతము నెగడువీడు
అమరనాయిక! నీకు పాదార్చకుండు
నీదు కనుసన్నల౯ భక్తినిలుచు వీడు
అఖిల జనయిత్రి! నీకు సర్వార్పకుండు.



ప్రబంధావతారికలు - కొమఱ్ఱాజువారి వంశావళి

నిడుదవోలు వెంకటరావు

మన తెలుఁగు ప్రబంధముల యందలి యవతారికలు తెలుఁగు వారి సాహితీచరిత్రకేకాక, దేశ చరిత్రకు, సాంఘిక చరిత్రకు నమూల్యములగు సామగ్రిని సమకూర్చునవి. ఈ వ్యాసమున, పందొమ్మిదవ శతాబ్దిని వెలువడిన, రెండు ప్రబంధముల యవతారికలలోని విశేషములను తెలుపఁబూనితిని — అవి 1. శివతత్త్వ సుధానిధి 2. సేతుఖండము. ఈ రెండును వరదరాజ నందికేశ్వర కవీంద్రునిచే రచితములైనవి — రెండింటిలో మొదటిది యిప్పటికి 86 ఏండ్ల క్రిందట ననగా క్రీ. శ. 1874 లో ముద్రితమైనది. అయినను, నీ కవినిగూర్చిగాని, గ్రంథములనుగూర్చిగాని వివరము లింతవఱకు వాఙ్మయచరిత్ర కెక్కలేదు. కీర్తిశేషులగు వంగూరి సుబ్బారావుగారు తమ శతకకవుల చరిత్రమున మొదటిగ్రంథము పేరు మాత్రమే సూచించిరి.

పై రెండు గ్రంథావతారికలు సుగృహీతనాములు, నవ్యాంధ్ర సాహిత్య ప్రపంచమున విజ్ఞానచంద్రికల వెలయించినవారును నగు కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారి వంశ వృత్తాంతమును విపులముగా దెలుపునవి — ఇవి రెండును, వారి తండ్రిగారైన కొమఱ్ఱాజు వెంకటప్పయ్యగారి కంకితముగా రచితములైనవి. ప్రథమమున, శతకకవుల చరిత్రయందుదాహృతమైన సూచనతో ప్రారంభించుచున్నాను.

కొమఱ్ఱాజు వేంకటశివుఁడు

"ఈతని వ్యవహారనామము వేంకటప్పయ్య. రేఫాల రాజలింగ శతక మీతని కృతి. [1]ఉద్భటారాధ్య శేఖరుఁడగు వీరభద్ర గురు శిష్యుఁడు. ఈ కవి మునగాల ప్రభ్వియగు శ్రీ రాజా నాయని లచ్చమ్మారావుగారి మంత్రి (1881 క్రీ.శ.). శివతత్త్వ సుధానిధి యను కావ్యమున కీ కవి ప్రోత్సాహకర్త. అది శ్రీ *కందుకూరి వీరేశలింగము పంతులుగారి కవులచరిత్రకొఱకు తీయఁగాఁ బారవేసి రట!* ఈ కవి మరియొక శతకమును జ్యోతిష గ్రంథమునుగూడ వ్రాసెనఁట! కృష్ణా మండలము నందిగామ తాలూకా పెనుగంచి ప్రోలు వాస్తవ్యుఁడు. భారద్వాజసగోత్రుఁడు. శైవుఁడైన యాఱు వేల నియోగి. నాల్గుతరముల క్రిందట శైవులైరి. వైష్ణవులతో వీరికి సంబంధ మున్నది." (పుట ౪౭౮)

ఆనాడు వీరేశలింగము పంతులవారు పారవేసిరని వంగూరి వారు తెలిపిన 'శివతత్త్వ సుధానిధి'ని నే నీనాడు సంపాదింపఁ గలిగితిని. పైని వివరించినట్లుగా నీ గ్రంథ ప్రోత్సాహకులు కొమఱ్ఱాజు వేంకటప్పయ్యగారు. వీరే సుగృహీతనాములగు శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి జనకులు. ఈ గ్రంథమునుండియే గాక, 'సేతుమాహాత్మ్యము' అను మరియొక గ్రంథమునుండియు, కొమఱ్ఱాజువారి వంశమునుగూర్చి తెలుపుటయే యీ వ్యాసము యొక్క ముఖ్యోద్దేశము.

శివతత్త్వసుధానిధి మూఁడాశ్వాసముల ప్రశస్త ప్రబంధము. [2]వరదరాజు నందికేశ్వరకవి విరచితము. ఈ గ్రంథము ముద్రితమయ్యు నింతదనుక యలభ్యమగుటచే, ముఖపత్రమునను్న విషయముల నిట దెలుపుచున్నాను.

శ్రీ

శివతత్వ సుధానిధి

భారద్వాజగోత్ర పవిత్రుండగు

కొమరరాజు లక్ష్మణరాయని పుత్రుఁడగు

వేంకటప్పయవారి ప్రేరణంబుచేఁ

కౌశిక గోత్రజుండగు వరదరాజు నందికేశ్వరశాస్త్రిచే

స్కాందమునుండి తెలుఁగింపఁబడి

---

1. శతకకవుల చరిత్రము క్రిందటియేడు పునర్ముద్రణము నందినది. అందు పీఠికానుబంధములుగలవు. పరిష్కర్త ప్రస్తుత వ్యాసకర్తయే. అది వంగూరి సుబ్బారావుగారి కుమారులగు శ్రీ నరసింహారావుగారిచే ప్రకటితము. శ్రీ నాగేశ్వరరావుగారి పూర్వముద్రణపీఠిక యిందుగలదు.
2. ఈ సత్కవియు నీతని కృతులును నాంధ్ర వాఙ్మయమున కింకను నపరిచితములు.

బందరునందు కేశవరాజు [1]సమూహివారి స్వధర్మ ప్రకాశిని ముద్రాక్షరశాలయం దచ్చువేయింపఁబడినది.

భావసంవత్సర వైశాఖమాసము ఆ. ౧౮౭౪ సం.
అనగా నిప్పటి కెనుబదియైదేండ్ల క్రిందట ముద్రితమైనది.

ఈ ప్రబంధము, ప్రాచీనప్రబంధముల రీతిని యిష్టదేవతా స్తుతితో ప్రారంభమగుచున్నది.

శా॥ శ్రీరాజత్తనమంజరీలలిత గౌరీ వీరు దాశ్లేషితం
బారాగోరు జటాగ్ర పల్లవము దీవ్యద్గాంగ బిందు ప్రసూ
నా రమ్యంబు కటాక్షవీక్షణ ఫలవ్యాకీర్ణమై యొప్పు శ్రీ
సారంగేశ్వర కల్పకంబు మదభీష్ట ప్రాప్తిగావించుతన్

ఈ సారంగేశ్వరుఁడు నేడు మునగాల జమీందారీలోని 'నడిగూడెము' అను గ్రామమున వెలసిన దేవుఁడు - ఈ నడిగూడెము నకుఁ బూర్వనామము "నిడుగుడుములు". ఈ నిడుగుడుములు పండితత్రయములోఁ దృతీయుఁడగు మల్లికార్జున పండితారాధ్యుల పాదరజస్పర్శచే పవిత్రమైన స్థలము — దీనినిఁగూర్చి శివతత్త్వసార పీఠికలో కీ. శ. లక్ష్మణరావుగా రిట్లు వ్రాసిరి.

"నిడుగుడుములు అనునది యిప్పుడు కృష్ణాజిల్లా నందిగామ తాలూకా మునగాల జమీందారిలోని ముఖ్యగ్రామమగు 'నడిగూడెము' అని నా తాత్పర్యము—" ముదమున నిడుగుడుములకు నేతెంచి — సదమలాత్ముఁడు వీరచాకి రాజయ్య ప్రవ్యక్త భక్తి సారంగేశునంద — అని పండితారాధ్యచరిత్ర ౨౩౫ పుటలో గలదు.

ఇప్పుడు 'నడిగూడెము' అనఁబడు గ్రామమునకు "నడిగుడుములు" అని పూర్వపు లెక్కలలోఁ బేరుగలదు. ఇచ్చటి దేవుఁడు సారంగేశ్వరుఁడు. (పుట 24) ఈ ప్రబంధమున సారంగేశ్వరునిస్తుతి యైనవెనుక క్రమముగా అంబాస్తుతి, కృష్ణస్తుతి, కమలాస్తుతి, బ్రహ్మ సరస్వతీ స్తుతులు, గజాననస్తుతి గలవు. శరభసాళ్వస్తుతి యైనవెనుక గురుస్తుతి గలదు. కృతికర్త గురువు జ్ఞానానంద దేశికేంద్రుఁడు. ఈ స్తుతియైనవెనుక సాక్షాచ్ఛివావతారమగు నప్పయదీక్షితునికవి యిట్లు స్తుతించినాఁడు.

క. సాక్షాత్కలి ద్వితీయ మ
హోక్షాశ్వుఁ డనంగఁబరగి యుర్విని విమతా
ధ్యక్షుల నడఁచిన యప్పయ
దీక్షితు మదినెంతు భక్తి తేటపడంగన్.

సుకవిస్తుతి, కుకవిస్తుతి యైనవెనుక నాకాలమున మునగాల జమీందారీకి రాజైన శ్రీ నాయని వెంకటరామ భూపతి వంశ వర్ణన గలదు. నాయనివారి మూలపురుషుఁడగు అయ్యావారు రెడ్డి మొదలీ [2]వంశవృత్తాంతముఁ దెలుపఁబడినది. వెంకటరామరెడ్డి మునగాల రాజ్యమును పాలించుకాలమున నొకనాడు భూపతి నిండోలగమై యుండుసమయమున, కవి కృతిప్రేరకు నిట్లు వర్ణించెను.

మునగాల జమీందారీ — నాయనివారి వంశవృక్షము

అయ్యావారు రెడ్డి — ఈతఁడు కపిలశైల దేశమేలెను.
|
రామారెడ్డి
|
కృష్ణారెడ్డి
|
నరసింహారెడ్డి — భార్య లక్ష్మీదేవి. వీరి దత్తకుమారుఁడు
|
వేంకట రామరెడ్డి — భార్య లచ్చమాంబ. ఈమె కీసర కోదండరామ భూపతి కుమార్తె.

వేంకటరామరెడ్డి, బొల్లికొండ, బయ్యవరము, కందికొండ మునగాల, చింతకాణి, ఉంద్రకొండ మొదలగు ప్రదేశములను పాలించెను. వీనిలో మునగాల ప్రధానమైనది - ఈ వెంకటరామ రెడ్డిగారికి సకల రాజ్యకార్య ధురంధరులై సచివులై, కొమట్లాజు వేంకటప్పయ్యగారు వెలసిరి.

1. సమూహార్థమందు 'సమూహి' యని నన్నెచోడ కవిరాజును పాల్కురికి సోమనాథుఁడు వాడిరి — ఇది నిఘంటువుల కెక్కలేదు. గణికా సమూహి భక్తసమూహి అను నిట్టి సమాసములు వారిరచనలలో గలవు. యథా వాక్కుల అన్నమయ్యయు "సురలన్ మర్త్యసమూహి"గా అని యీ పదము వాడియున్నాఁడు. ముద్రణములో, సురలన్మర్త్య సమంబుగా అని పరిష్కర్తలీ సమూహిపదప్రయోగము నెఱుఁగక దిద్దినారు.

2. కృతిప్రేరకులగు కొమట్లాజు వేంకటప్పయ్యగారి వంశమును మునగాల జమీందారుల వంశమును నవినాభావ సంబంధము గలవి. సూక్ష్మముగా నిందు తెలుపుచున్నాను.

వేంకటప్పయ్యగారి వర్ణన

క. ఆరాజమౌళి పూర్ణ కృ
పారసమున సకల రాజ్యభర వహనత చే
కూరఁ గొమఱ్ఱాజు కులో
ద్ధారకుఁడగు వేంకటప్ప ధార్మికుఁ డలరున్.

ఉ. మంత్రులలోనఁ దావిబుధమంత్రియఁబోలి యరాతిభూమి రా
ట్తంత్రములన్ని నిర్విషయతం దనకెప్పుడు షడ్గుణోల్ల స
న్మంత్రబలంబుచేత వశమౌనటుచేసె షడక్షరీ మహా
మంత్రబలంబుచే బుధుఁ డుమాపతిఁ జిక్కఁగఁ బట్టినట్లుగన్.

సీ. రాజకార్య సముద్ధరణశక్తిఁ గమలాభి
వృద్ధికి సుధకుప్ప వెంకటప్ప
కల్యాణ గుణమౌక్తిక ప్రజాభ్యుదయైక
విధికి ముత్తెపుఁజిప్ప వెంకటప్ప
పరమదారిద్ర్యాబ్ధి పతిత సత్తారణ
వృత్తికిఁ బెనుతెప్ప వెంకటప్ప
రసిక విద్వచ్చకోర క్షున్నివారణా
ప్తికి వెన్నెలలతిప్ప వెంకటప్ప.

గీ. శివుఁడు నీవాఁడనని తనచెవినిఁజెప్పి
జయము పతికిచ్చి శత్రుపుంజములరొప్ప
సరవి ముత్తైదువులు పూలజల్లు కుప్ప
వెలయుచున్న కొమఱ్ఱాజు వేంకటప్ప.

మంత్రిసత్తముఁడును, మహానుభావుండును, విశేషజ్ఞుఁడును నగు నా వెంకటప్ప సచివుఁడు తన్ను బిలిపించి యీ గ్రంథమురచింపు మని యానతిచ్చినట్లీ విధముగా కవి వ్రాసియున్నాఁడు.

క. నను వరదరాజ కుల సో
ముని కౌశికగోత్ర శుక్తి ముక్తాఫల స
జ్జన వర్య నంది కేశా
ఖ్యునిఁ బిల్వఁగఁబంచి మృదు మధూక్తులఁ బలికెన్.

క॥ శివతత్త్వ సుధానిధి నో
కవివర నీ వాంధ్రభాషగా మృదురచనా
వివరణముగఁ జెప్పఁగఁదగు
భువిని ప్రసిద్ధముగ నీ విభుప్రవరాజ్ఞన్

సీ॥ భూరి నిజమహిమ నందఁబఁ
గారుణ్యతఁ బ్రోచి సకలకార్యము లిడుచుఁ—
కూరిమి నడిగుదెయునఁగల
సారంగేశ్వరుఁడు కృతికి సామియుఁగాగఁ—.

అని...సన్మానించిన కవియు సారంగేశ్వ రాస్థానంబు వర్ణించి గ్రంథ ప్రారంభము చేసెను.

కృతిప్రేరకులగు కొమఱ్ఱాజు వేంకటప్పయ్యగారి ప్రోత్సాహమున నందికేశ్వర కవీశ్వరుఁడు 'సేతుమాహాత్మ్యము' అను మరియొక ప్రబంధమును రచించెను. అందు కొమఱ్ఱాజువారి వంశము పూర్తిగ వర్ణితమైనది - [1]సేతుమాహాత్మ్యము, రామేశ్వర క్షేత్ర మహాత్మ్యమును దెలుపు నైదాశ్వాసముల ప్రబంధము - ఇది యముద్రిత మగుటచే నిందుండి యా వంశ వృత్తాంతమును దెలుపుచున్నాను.

ఈ ప్రబంధము కృష్ణామండలమున గల పెనుగంచిప్రోలున నెలకొనియున్న శంభులింగేశ్వరస్వామికి కృతి - ఆ పెనుగంచి ప్రోలిట్లు వర్ణితమైనది.

సీ. అఖిలాంధ్ర దేశ మధ్యావనీ స్థల కంఠ
భూషణంబయ్యె నేపురవరంబు
భ్రమరాంబికా నాథ భవనాంత్య దిగ్భూమి
భాసిలుచుండు నే పట్టణంబు
పుణ్యపయః పరిపూర్ణమే సహ్యజ
దనరారు నేపురి దక్షిణమున
కూలంకషాంబు కల్లోల మౌద్గలనది
ప్రవహించుచుండునే ప్రహరిచెంత

గీ. ఈశి నీ భర్త శంభులింగేశ భర్త
యుద్భవం బందెనే నికటోత్తమమున
నద్దినరారు నిఖిల కళాభిరతి వి
రించిపురిఁబోలు శ్రీ పెనుగంచిప్రోలు.

---

1. సేతుమాహాత్మ్యము ప్రతి యొక్కటియే లభ్యమైనది. అది ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున నున్నది. సంఖ్య R. 676. ఇది కాగితపుఁప్రతి దీని మాతృక తాళపత్ర ప్రతిని కీ. శే శ్రీ లక్ష్మణరావుగారు సంపాదించిరి. ఆ మాతృకకు పుత్రికయే ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగార ప్రతి.

మొదట కొమఱ్ఱాజువారి వంశవృక్షము నిచ్చి యా వెనుక వివరణము చెల్పుదును.

భారద్వాజ గోత్రము

కొమఱ్ఱాజు - మూలపురుషుడు

శంకరుఁడు (భార్య బుచ్చమ)

శ్రీశైలపతి | రాజేశ్వరుఁడు | నాగేశుఁడు (భార్య చొక్కమ)

నాగేశుఁడు: వెంకటామాత్యుఁడు | అక్షయలింగము | బసవనమంతి | లక్ష్మణరాయుఁడు | రామేశ్వరుఁడు లేక రామలింగయ్య

లక్ష్మణరాయుఁడు - రామేశ్వరునికి దత్తు (భార్య సంగమ్మ)

1 వేంకటశివుఁడు | వెంకటప్పయ్య | సంగమేశ్వరుఁడు

వెంకటప్పయ్య: మొదటిభార్య అచ్చమ | రెండవభార్య గంగాంబ

మొదటిభార్య అచ్చమ: శంకరలింగము (విజ్ఞానచంద్రికా, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ సంపాదకులు)

రెండవభార్య గంగాంబ: 2 వెంకట నారాయణ - అచ్చమాంబ

3 వెంకట లక్ష్మణరావు

వినాయకరావు | అచ్చమాంబ

---

1. లక్ష్మణరాయని కుమారులు - మువ్వురు వేంకటశివుఁడు - వెంకటప్పయ్య - సంగమేశ్వరుఁడు - అని సేతుమహాత్మ్యమునఁ జెప్పఁబడి యుండుటచే శతకకవుల చరిత్రమున - కొమఱ్ఱాజు వెంకటశివుఁడు - ఇతని వ్యవహారనామము వెంకటప్పయ్య - అని నిరువురి ఒకే వ్యక్తిగా చెప్పఁ బడుట సరికాదని యెన్నఁనగును.

2. వెంకటప్పయ్యగారి రెండవభార్య గంగాంబ. సేతుమాహాత్మ్యమున - లక్ష్మణరావుగారి జ్యేష్ఠ సహోదరి అచ్చమాంబగారి జననముగాని, లక్ష్మణ రావుగారి జననము గూర్చిగాని స్పష్టముగా లేదు. కాని నందికేశ్వరకవి యా సందర్భమున నిట్లు వ్రాసియున్నాడు.

   క॥ రెండవ సతి గంగాంబిక

   గీ॥ ఆమె వెంకటనారాయణాది ముఖ్య సుతులఁగనియె నిరంతర సుఖవిహితుల
   ఘనతరాఖండ భాగ్యరేఖా ప్రయుతుల సకలరాజ్య ధురంధర శక్తిరతుల

   'ఆది ముఖ్యసుతుల గనియె' అని చెప్పుటచే. లక్ష్మణరావుగారి జననమిందు సూచితమైనదనియే చెప్పవచ్చును.

   'అబలాసచ్చరిత్ర రత్నమాలను నాంధ్రభారతికి సమర్పించిన విదుషీమణి. లక్ష్మణరావుగారీమెను అస్మజ్జ్యేష్ఠ సహోదరి' యని సగౌరవముఁ జేర్కొందురు.

3. వెంకటప్పయ్య లక్ష్మణరావుగారికి వారి తండ్రి పేరే పెట్టిరి. లక్ష్మణరావుగారు మాత్రము తమ కుమారునికి తమ కత్యంత ప్రియతముఁడగు మహారాష్ట్ర స్నేహితుఁడు వినాయకరావు పేరు పెట్టిరి.

4. నేను కొమఱ్ఱాజువారి వంశమునుగూర్చి గ్రంథముల యందున్న విషయములు మాత్రమే తెలిపితిని-తద్వంశీయు లిందలి లోపముచేవేని తెలిపినయెడల వానిని కృతజ్ఞతతో సవరించెదను.

వంశమునందలి ప్రసిద్ధ వ్యక్తులను గూర్చినది.

౧. శంకరుఁడు

ఈతఁడు ముదిగొండ వీరభద్రారాధ్యుని శిష్యుఁడు - మూఁడు మాఱులు శ్రీగిరి ప్రదక్షిణము గావించిన మహనీయుఁడు.

క॥ ఉదయించి వృద్ధిఁగని మది
వదలని శివభక్తినొంది వర్ణితగుణుఁడౌ
ముదిగొండ వీరభద్రా
ఖ్యుఁడగు గురువరునిఁజేరి పృథుశుశ్రూషన్

ఉ. జంగమరూపముల్ వెలయ సాహసవృత్తి నఘోరభైరవుల్
ముంగల దారిఁజూపఁగఁ బ్రమోదమెలర్ప నిరంతరాయ స
న్మంగళ వృద్ధిగాఁ బ్రణవ మంత్రరతిన్ వెసమూఁడుమాఱులు
పొంగి ప్రదక్షిణంబులిడె భోరన శ్రీగిరి కాతఁడర్మిలిన్.

౨. నాగేశుఁడు

శంకరుని మూఁడవ కుమారుఁడగు నాగేశుఁడు మహాప్రసిద్ధుఁడగు వాసిరెడ్డి వేంకటాద్రి నాయనివారిమంత్రి.

చ. సలలిత వాసిరెడ్డి కుల చంద్రుఁడనందగు వేంకటాద్రి రా
ట్తిలకుని చెంత మంత్రిత సుధీజను లెన్నవహించి యంధ్రభూ
స్థలి పరిపాలనంబిడియె సత్యపథస్థితి ధారుణీమరు
త్కులమలరంగఁ గీర్తికవికోటి నుతింపఁగ ధర్మమూర్తియై

౩. లక్ష్మణరాయఁడు

నాగేశుని నాల్గవకుమారుఁడగు లక్ష్మణరాయఁడు గోలకొండ నవాబువలన ఆంధ్రదేశ సర్వాధికారము వడసెను.

చ. నిరతము గోలుకొండపుర నృప్రవరానుమతిన్ సమస్తమా
ధరణిని బాహుదండమున దాల్చి విభాసిలు [1] చందులాలుచే
సిరి వెలయంగ మాన్యతనుఁజెంది మహాచతురంతయానసం
చరణత నాంధ్రదేశము ప్రశస్త గుణోన్నతినేలె నీతిచేన్.

౪. రామలింగయ్య

పైవంశవృక్షమున లక్ష్మణరాయని పాలకపితయుఁసోదరుఁడు నగు రామేశ్వరుడే రామలింగయ్యగారు. వీరు శ్రీగిరిమల్లేశ్వర శతకము, వీరభద్రశతకము అను రెండు శతకకృతులను రచియించి యున్నారు - వీరికిని గురువు ముదిగొండ వీరభద్రారాధ్యులే. శ్రీ గిరి మల్లేశ్వర శతకమున శివభక్తి ప్రపంచితమైనది - అన్యమత నిరసనగలదు - కవితన యిష్టదైవము "దుర్వర్ణశైల వాసుఁడు -" అని చెప్పుకున్నాఁడు - దుర్వర్ణశైలవాసుఁ డనఁగా 'నల్లమల' కొండలయందువాఁడు-శ్రీ శైలేశుఁడు-ఈ శతకమున శైలిసులభమై వ్యావహారికమైన పలుకుబడి గలిగియున్నది. మచ్చున కొక పద్య ముదాహరించుచున్నాను.

1. శ్రీగిరిమల్లేశ్వర శతకము

సీ. కాలికిచెప్పట్ట జోలెఱుంగని వారు
పల్లకు లెక్కెటి ప్రౌఢిగనిరి
కట్టగుడ్డలు లేక కడుకృశించెడువారు
దివ్యాంబర ప్రాప్తిఁ దేజరిలిరి
కుండకూడెప్పుడు గుడుచుచుండెడివారు
బిందెతప్పేలాల పెంపుగనిరి
తమిదంబలియులేక తపసొనర్చెడువారు
పరివంటకంబుల పప్పుగనిరి

గీ. బందెపోట్లను ఖైదునఁబడ్డ వారు
పెద్దలైనారు నేఁటికి పేరుఁగనిరి
రామలింగార్యపోష । సద్రాజభూష
శరణు శ్రీగిరిమల్లేశ శాంకరీశ ।

2. వీరభద్రశతకము

క. శ్రీ వీరభద్రనే మది
భావించిన సిరులొసంగు భవములనణఁచున్
సేవింప మోక్షపదవులు
గావించును వీరభద్ర కారుణ్యనిధీ.

క. వర కొల్కులూరి పురిలో
స్థిరమతిచే వెలసి భక్త సేవితమతివై
ధరకీర్తిఁజెంది తౌరా
కరుణింపుము వీరభద్ర కారుణ్యనిధీ ।

---

1. సచివోత్తముడగు చందులాల్ - క్రీ. శ. 1827 నుండి క్రీ. శ. 1857 రకు హైదరాబాదు సంస్థానమును బరిపాలించిన నాల్గవ అసఫ్‌జా నిజాము వద్ద మంత్రి. చందులాలీ నిజామునొద్ద క్రీ. శ. 1820 నుండి క్రీ. శ. 1845 వరకు మంత్రిగా నుండెను.
శ్రీగిరి మల్లేశశతకము, ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించిన శతకసముచ్చయమున ముద్రితమైనది.
రామలింగయ్యగారిని చూడుఁడు. శతకకవుల చరిత్ర (నూతనముద్రణము)

సేతుమాహాత్మ్యమున వెంకటప్పయ్యగారిట్లు వర్ణితులైరి.

క. ఆ ముప్పురిలో నాంధ్ర
(వేంకటశివ, వేంకటప్ప, సంగమేశ్వరులు)
క్ష్మామండల విభునిచేత సమధికమతిచే
శ్రీమన్మంత్రితఁ గనియె మ –
హామహుఁడై వేంకటప్ప మంత్రివరుఁడహా!

క. వినుతులొప్పఁ గొమర్రాజు వేంకటప్ప
కేసరి నృపాలశేఖర క్షితిలలంబు
దివ్య చతురంతయాన సంస్థితి వహించి
వీలనేకాత పత్రత నేలుచుండ –

పూర్వ సంప్రదాయము ననుసరించి, వెంకటప్పమంత్రి వెంకట రామవిభునిచే ఆందోళికాది సన్మానములను గాంచెనని పైపద్యము తెలుపుచున్నది.

వెంకటప్పయ్య

లక్ష్మణరావుగారి జనకులగు వెంకటప్పయ్యగారు రాజకీయ వ్యవహర్తయగుటయేగాక రేపాల రాజలింగశతకము రచించిరి.

గీ. భావ భవభంగ గౌరిహృత్పద్మ భృంగ
రాజిత శుభాంగ రేపాల రాజలింగ

యను మకుటము - సీసపద్యశతకము - గ్రంథవిస్తర భీతినుదాహరణముల నీయలేదు.

వరదరాజు నందికేశ్వరకవి

కొమర్రాజువారి వంశమునుగూర్చి చెప్పినప్పు డా వంశమును గూర్చి తొలుత మనకుఁదెలిపిన వరదరాజు నందికేశ్వరకవిని గూర్చి తెలుపుట యావశ్యకము - ఇంతకుముందు తెలిపినట్లీతని కృతులు రెండేమనకు లభ్యమైనవి. 1. శివతత్త్వసుధానిధి, 2. సేతుఖండము. వానిలో సేతుఖండములోఁ దన్నుగూర్చి కవి యీ క్రిందివిధముగాఁ జెప్పుకొన్నాఁడు.

సీ. నన్ను కౌశికమునినాథ గోత్ర పవిత్రు
వరదరాజాన్వయ వార్ధి చంద్రు
జోగేశ్వరా ర్యాత్మజుని లచ్చమాంబిక
గర్భసచ్ఛుక్తి ముక్తాఫలంబు
రాజేశ్వరాగ్రజు రత్నయ శ్రీరామ
సహజన్ము వైదికాచార నిరతు
కాలత్రయార్చిత ఘనపార్థివేశ్వర
షడ్వర్ణమంత్రైక జపధురీణు

గీ. నిగమశాస్త్ర పురాణవి న్నిఖిల విబుధ
మానసాంభోజ విభ్రమమధువి దధిపు
సరస కవితావిధిజ్ఞు సత్సంగతిజ్ఞు
నందికేశాఖ్యుఁ బరశివానంద సౌఖ్య.

పైపద్యమునుబట్టి నందికేశ్వరకవి [1]కౌశికగోత్రుఁడనియు వైదికాచార తత్పరుడగు స్మార్తుఁడనియు, వరదరాజు జోగీశ్వరునకు లచ్చమకుఁ బుత్త్రుఁడనియు, రాజేశ్వర, రత్నయ, శ్రీరామ నాములకు సోదరుఁడనియుఁ దెలియుచున్నది.

నందికేశ్వరశాస్త్రి త్రికాల [2]పార్థివలింగ పూజా ధురందరుఁడు. శ్రీరాజరాజేశ్వరీ యుపాసకుఁడు, [3]షడక్షరీమంత్ర పారాయణుఁడు, శైవాగమపురాణ శాస్త్రవేత్త. శివతత్త్వసుధానిధిలో నీతఁడు జ్ఞానానందదేశికుఁడను నొకమహాయోగిని గురువుగాఁ బేర్కొనినాఁడు. నందికేశ్వరుని కృతులు రెండింటియందు నాశ్వాసాంత గద్యలలో నీ గురుప్రశంస గలదు.

గద్య. ఇది శ్రీమద్రాజ రాజేశ్వర వరప్రసాద లబ్ధకవితాధురీణ నిగమాగమపారీణ జ్ఞానానందగురు చరణారవింద మకరందపాన మానసేందిందిరో భయ సాహిత్యానంద కందళితాప స్తంబ సూత్ర కౌశికగోత్ర వరదరాజ వంశపవిత్ర జోగేశ్వరార్య పుత్ర లచ్చాంబిక గర్భపయః పారావారకుముదమిత్ర రాజేశ్వరానుగ్రహపాత్ర నందికేశ్వరనామ విద్వత్కవి ప్రణీతంబైన శివతత్త్వసుధానిధి యను మహాప్రబంధమునఁ బ్రథమాశ్వాసము.

ఈ వ్యాసమున వరదరాజు కవితావైదుష్యమునుగూర్చి, గ్రంథ విషయములనుగూర్చి చర్చించుటకు తావులేదు – శివతత్త్వసుధానిధి, సేతుఖండము - ఆంధ్రశైవ వాఙ్మయమునకు సంబంధించిన ప్రశస్తకృతులు - నందికేశ్వరశాస్త్రి కవితానైపుణ్యముఁ దెలుపుటకు శరభసాళ్వస్తుతియగు నీ క్రిందిపద్యము చాలును.

---

1. వైదికియని "నందికేశ్వరశాస్త్రి" యని ముద్రితగ్రంథ ముఖపత్రము నందలి "శాస్త్రి" పదమే తెలుపుచున్నది.
2 నా జనకులు, కీర్తిశేషులు సుందరముపంతులుగారు పార్థివలింగపూజా ధురంధరులై ప్రసిద్ధిగాంచినారు.
3. ప్రణవముతోఁగూడిన పంచాక్షరికి షడక్షరి యనిపేరు.

సీ. నక్తంచరపరక్తి భుక్తి స్పృహార్తాటి
    నార్తగరుద్వేల సత్త్రములు
అక్షుద్రగజ ఘటాధ్యక్ష భ్రమత్కుక్షి
    శిక్షితోర్వ్యంతరిక్ష క్షమములు
అద్రీద్వరద్రుమ సముద్రముద్రిత రసా
    విద్రావిదక్షైక మరుద్ధృతములు
చండతరోద్దండ తుండపాటిత పద్మ
    జాండమండల ఖండతాండవములు
గీ. చిత్రములు శక్రుపీరుల్లి విచిత్రరూప
పాత్రములు పాపచయతమో మిత్రకాంతి
ఫరిత శిఖముఖనఖములు శరభపక్షి
పక్షివిక్షేపములు శుభాస్పదములొసగు

పై పద్యము - ఆముక్తమాల్యదయందలి "ఖనటత్పయోబ్ధి వీక్ష్య రసాతలాన్యోన్య పిండీకృతాండ క్షీతాండజములు" అను పద్యమునకు ననుకరణము. గ్రంథవిస్తరభీతిచే కవితావిమర్శన మిందు చేరలేదు.

పై రెండు గ్రంథములలో మొదటిది సుపరిష్కృతమునై ముద్రితమైనచో, నది యాంధ్రశైవ వాఙ్మయమునకొక యలంకారమగును. రెండవది క్షేత్రమహాత్మ్యశాఖకు నొక విశిష్టతను చేకూర్చును.

ఏతద్వంశోత్పన్నులీ విశిష్టకావ్య సముద్ధరణము గడంగి, కొమట్రాజువారి వంశచంద్రికలను నాంధ్రదేశమున, విరాజిల్ల జేయుదురుగాక.

అహింసాయుతమైన పోరాటంలో ఒక ప్రత్యేకత యేమిటంటే, అహింసావాది కష్టాలను ప్రతివాదిపై రుద్దేబదులు తనే ఎదుర్కోటానికి ఆహ్వానిస్తాడు. ప్రతివాదికి హాని కలుగజేయటం ద్వారా లక్ష్యాన్ని సాధించటం కాదు అతని ధ్యేయం. తన కరుణతో తనే బాధలనుభవిస్తూ ప్రతివాదిలో సానుభూతి, గౌరవం పురికొల్పటం ద్వారా తన లక్ష్యసాధన కుపక్రమిస్తాడు. అయితే హింసాయుత పోరాటంలో ఇరు ప్రక్కలవారు బాధ లనుభవించాలి. అహింసా పోరాటంలో బాధలన్నీ ఒక ప్రక్కవారే అనుభవిస్తారు. కనుక వాస్తవానికి బాధలనేవి సగానికి సగం తగ్గిపోయినట్లు. ఇంకా అంతకంటె తక్కువకూడా. ఎందుకంటే ఒక ప్రక్కవాది ఎప్పుడైతే హింసా విధానం అవలంబింపరాదని తీర్మానించుకున్నాడో, అప్పుడే ప్రతివాది హస్తాలు బలహీనమవుతాయి. అతని ఆయుధాలు వాడిమి కోల్పోతాయి. కోపోద్రిక్తతకు తావు నిచ్చినప్పుడే ఎదుటివానికి బలం చేకూరుతుంది. కాబట్టి అహింసా విధానంలో కష్టాలు స్వల్పం.

—డా॥ రాజేంద్రప్రసాద్

*   *   *   *

ద్వేషభావంతో మాటాడేవారు తమ శాంతిని చేజేతులా భంగ మొనర్చుకున్నట్లే.

శ్రీ త్యాగరాజు

స్వర్గీయ శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి

నీవాఙ్మాధుర్యము నీ భావశరచ్చంద్ర వైభవంబును దెలియం
గావశమె ? త్యాగరాజ రసావేశ మహాకవీంద్ర ! యానందాబ్ధీ !!

* * * *

ఒక సామ్రాజ్యమునేలు నీ కవిత తానొక్కొక్కచో స్వర్ధునీ
వికచాంభోరుహషండనిస్సృతరసాప్తిన్ జాలొక్కసంజాలు, వే
ఱొకచో ముద్దులు మూటగట్టు నొకచో నొయ్యారముం జూపుఁగాం
తకుఁ బై పెచ్చుగఁ ద్యాగరాజ కవినాథా ! భావచంద్రోదయా !

* * * *

నీవీ లోకులనెల్లఁ జూచినటుగా, నీవన్నటుల్ గాని స
ద్భావ శ్రీగృహమేధి కూహా సొరదెప్పట్టున్ జగత్కారణున్
గైవల్యప్రదు శ్రోతఁ జేసి చెవికెక్కంబాడి సత్కీర్తనల్
జీవన్ముక్తుఁడవైతివయ్య సుకవీ ! శ్రీ త్యాగరాట్పండితా !

* * * *

పాయక వృత్తిసంపదల భవ్యులు శ్రీ జయదేవ సూరినా
రాయణ తీర్థులే యమృతమద్భుత పాత్రలయందు నింపిరో
యాయది పాక భేదమున నందఱకుం జవులూరఁగూర్చిత
య్యా ! యతిమంజులంపుఁ గృతియాకృతిగైకొనఁ ద్యాగరాట్కవీ!

* * * *

తన మనోహరు రామపాదంబుఁబాడు
భవ్యుఁడని కాదొ నీ మనఃపద్మపీఠిఁ
బరమపావని రసఝరి భావలక్ష్మి
తనకుఁదాఁ గొల్వుదీర్చుట త్యాగరాజ !

* * * *

ఒకకొన్ని చోటులఁ బ్రకటంపుబాటల
సనువైన మంగళధ్వనులు వెడలు
నొకకొన్ని తావుల సుకరంపుఁదావుల
మవ్వమ్ముతగు కుసుమములు కురియు !
నొకకొన్ని పట్టుల నికరంపుఁబట్టుల
నింపైన మలయానిలంబు వీఁచు
నొకకొన్ని నేలలఁ నుద్యత్ప్రభాలీల
నగు విమలప్రవాహములు పాఱు!

నొకట నాబాలగోపాల ముబ్బుచేయుఁ
దోగనై యొప్పి యుండునో త్యాగరాజ !
రామవిభు పాలితంబయి రమ్యమైన
తావకకృతి ప్రపంచ భూతలములందు !

*   *   *   *

కులుకుచు నెడనెడ గిలిగింతఁగలికి పో
కల "తోడి" రక్తి భావలతఁబెరయ !
గడును "బిలహరి"యై గత పరాపరభేద
యై భక్తి హరిరూప మందికొనఁగఁ
గామ "ముఖారి" వర్ణద్వేషి సాధుబృం
దావనాత్మ విరక్తి హాయినెగడఁ
నఖిల "మోహన" పదన్యాసంబుగొలుపుచుఁ
జిచ్ఛక్తి ముక్తితో జెలిమి నెఱప !

నీ ముఖాంభోజమునయందు నిలిచి వెడలు
కృతులు తీర్థములట్టు లా కృతులఁ గిల్బి
షముల గెడపవెయో యోగిచంద్ర ! త్యాగ
రాజ ! నాద లయబ్రహ్మ ! పూజితాత్మ !

*   *   *   *

విడువదు భావలక్ష్మి మదిఁబెట్టిన నెచ్చెలికత్తె యేమొకో ?
నడువదు కాలిత్రోవ నొకనాడును ఖేచరకన్య యేమొకో ?
యుడుగదు మజ్జనక్రియరసోదధి రాజకుమారి యేమొకో ?
ఎడఁదఁగరంచు నీకవిత యేమిది రామకథాసుధాంధసా !

*   *   *   *

రహిమీఱఁ జక్కని రాజమార్గమునందుఁ
బలు సంగతులతోడఁ బల్కరింతు !
ముద్దుల మరువంపు మొలకరాబల్కఁగా
భక్తిపంజరమునఁ బట్టియుంతు !
చేరవే వెన్న పాలారగింపవె యంచుఁ
గేలుమోడిచి బ్రతిమాలుకొందు !
ఎవరని నిన్నిర్ణయించిరిరా యంచు
సద్వైతభావమ్మునంది పిలుతు

రాము నెదలోన నీ భావరత్నమ్ముల్
మూతఁడ యెఱుంగు దత్రోత్పతమైన జీవ
వత్కృతి మనోజ్ఞహారాళి వరుసన ఱుతఁ
దాల్పనాతండ యెఱుఁగునో త్యాగరాజ !

* * * *

సరిగమపదని సంజ్ఞబొంగు వెల్లెడి
స్వరసముద్రధ్వని సారఫలము !
ధ్రువముఖ్య బహుళతాళవిశేష సంబద్ధ
సరస మృదంగోత్థ శబ్దఫలము !
నాలాప మధురకంఠారావ మాతృక
సాధనశ్రుతి భవ, స్వరఫలంబు !
నారబ్ధగీత తాళాదిప్రమాణ సం
శ్రయసామ్య విలసిత, లయఫలంబు !

సర్వఫలముల నెఱిఁగి తత్సార మెఱిగి
ప్రణవగాయనుఁడైన నీవంటి పాట
కుండు చతురబ్ధివేష్టిత కువలయమున
నగుపడునె మాకుఁ ద్యాగరాజాఖ్యరామ !

* * * *

రాగయుక్తుఁడవయ్యు విరాగివగుట
లయతనొప్పియు సద్గుణాలయుడవగుట
యెంతయు నపూర్వమగుఁగాదె యెంచిచూడఁ
దారకోపాసనాస్థిర ! త్యాగరాజ !

* * * *

వాగ్గేయకారోజ్జ్వలమణి - త్యాగరాజు

బాలాంత్రపు రజనీకాంతరావు

వ్యతీత విషయములందు స్మృతీ, ఆగామిగోచర పరిజ్ఞానమూ తత్కాల విషయములందు తెలివి కలిగిఉండేశక్తిని ప్రజ్ఞఅని ఆలంకారికులన్నారు. అటువంటిప్రజ్ఞ నవనవోన్మేషశాలిని అయితే దానినే ప్రతిభ అంటారు. నిత్యలోక పరిశీలనా, శాస్త్ర కావ్య పారాయణమూ, నిత్యకవితా కళాసాధనా హేతువులుగా ప్రభవించేశక్తి ప్రతిభ అనిపించుకుంటుంది. దానినే ప్రమేయ స్ఫూర్తి అనికూడా అంటారు. వాగ్గేయకారునకు అగ్రేసరత్వమునిచ్చే లక్షణాలలో ఇది ముఖ్యమైనది. దీనికితోడు తాను శ్రావ్యగాయకుడై ఉండాలి. అదే సుభగగేయత అని శార్ఙ్గదేవాది లక్షణకర్తలు వ్యపదేశించిన లక్షణం. దేశిరాగములందు పరిపూర్ణమైన అభిజ్ఞానమూ, వాక్పటుత్వమూ ఉండాలి.

'రోషద్వేష పరిత్యాగః సార్ద్రత్వ ముచితజ్ఞతా
అనుచ్ఛిష్టోక్తి నిర్బంధో నూత్న ధాతు వినిర్మితిః
పరచిత్త పరిజ్ఞానం ప్రబన్ధేషు ప్రగల్భతా
ద్రుతగీత వినిర్మాణం పదాంత రవిదగ్ధతా
త్రిస్థానగమకప్రౌఢి ర్వివిధాలప్తినైపుణమ్
అవధానం గుణై రేభి ర్వరో వాగ్గేయకారకః,

పైగుణాలకుతోడు రోషద్వేష వివర్జితుడై సార్ద్రహృదయుడై ఉచితజ్ఞుడు కాగలిగినవాడు ఋషికల్పుడో మహాకవియో కాగలడు. శార్ఙ్గదేవాదులు నిర్దేశించిన ఈ ఉత్తమ వాగ్గేయకార లక్షణములన్నిటిని పుడికి పుచ్చుకొన్నవాడు గనుకనే త్యాగరాజు వాగ్గేయకారోజ్జ్వలమణియై తాను ప్రకాశించి, లోకమునకు వెలుగు ప్రసాదించాడు.

ఏ వాగ్గేయకారకునకుగాని తనకాలంలో త్యాగరాజస్వామికి ఉన్నంతమంది శిష్యులు చేకూరి ఉండలేదంటే అతిశయోక్తి కాదు. ఐహిక సంపదలయెడల నిస్సంగుడై వేదచోదితములైన జీవితపద్ధతి ననుసరించి నిరాడంబర జీవియైన త్యాగరాజు నాదబ్రహ్మోపాసకుడై మహాతపస్సంపన్నుడైన మహర్షిగా జీవించాడు. ఆయనవద్ద సంగీతశిక్షణకై చేరిన శిష్యులందరు ఆయనపద్ధతుల ననుసరించే జీవించనేర్చి, తిరువయ్యారులోని త్యాగరాజ కుటీరమును ప్రాచీనభారతగురుకుల విద్యాపీఠముగా ప్రకాశింప జేశారు.

త్యాగయ్యగారి కీర్తనలన్నీ. దాదాపు - ఆయన పారవశ్యస్థితిలో ఉండగా వెలువడినవే. పారవశ్యంలో నిమీలితములైకాని, ఆవేశంలో పొంగికాని ఆయనకన్నులు తేజస్సుతో ప్రకాశిస్తోంటే నోట పాట వెలువడుతూండగా, నల్లరంగు పూసిన మామిడిచెక్క పలకలను బలపాలను తీసుకొని, నలుగురు శిష్యులు ఆయనచుట్టూ చేరేవారు. కీర్తన పూర్తిఅయ్యే సరికి శిష్యులలో ఒకడు పల్లవినీ మరొకడు అనుపల్లవినీ, ఇంకొకడు చరణమునూ మరొకడు సాహిత్యమునూ స్వరబంధ సహితముగా పలకలమీద వ్రాసుకొని తలజకడూ తలజక కావేరీ ఘట్టానికి పోయి, ఆ కీర్తన భాగాలను వల్లె వేసుకొనేవారు. ఆ తరువాత అందరూకలిసి, కలబోసికొని, కీర్తనంతా పాఠంచేసి, ఆ వెనుక గురువుగారికి వినిపించేవారు.

అన్నమాచార్యులనాడు సంకీర్తనంగాను, ఆధ్యాత్మిక పదంగాను ప్రారంభించిన కీర్తన - నారాయణతీర్థులు, రామదాసు, సుబ్రహ్మణ్యకవివంటి వాగ్గేయకారుల రచనలలో భజనకీర్తనగాను, అధ్యాత్మకీర్తనగాను పరిణమించి, మార్గదర్శి శేషయ్యంగారు, మేలట్టూరు వీరభద్రయ్యగారల రచనలలో ధాతుకల్పనకు (సంగీతబంధములో) కొత్తమార్గాలు అవలంబించి, ఆ నూతన రూపంలో త్యాగరాజునాటికి కృతి అనేపేరు వహించి పరిపక్వత పొందింది. కృతులు బయలుదేరేనాటికి రాగాల స్వరూపంలో కూడా చాలామార్పులు సంభవించాయి. ఈ

మధ్యలో క్షేత్రజ్ఞాదుల పదకవితలో సాహిత్యబంధమూ రాగబంధమూ సమాన ప్రాధాన్యమువహించి రాగ స్వరూపానికి దర్పణము అనదగిన పదరచనలు ప్రభవించాయి. త్యాగరాజునాటి 'కృతి' రాగస్వరూపానికి దర్పణం మాత్రమే కాదు, క్రమ విస్తృతిగల సంగతుల ప్రయోగంతో సాహిత్య భావం ఇతోధికంగా ప్రస్ఫుటం అవుతుంది.

పటిష్ఠమైన పద్యకవిత్వ భాషకంటె ఉదాత్తమైన గద్యమే కృతుల సాహిత్యానికి యోగ్యమైనదని త్యాగరాజు రచనల ద్వారా నిరూపితమైనది. ఆగద్యంలోనే తాళపోషకములైె యమక, అంత్యప్రాసాది అలంకారాలు చేరి కృతి మరింత శ్రావ్యము కాగలదని కూడా తేలింది.

కృతిలోని భావానికి ప్రధానసూత్రమైన వాక్యం పల్లవి. అనుపల్లవి పల్లవిలోని సూత్రమునకు వ్యాఖ్యగా గాని అనుబంధంగా గాని సాగుతుంది. చరణాలు ఆవ్యాఖ్యకు విపులమైన భాష్యాలు. సులభంగా అర్థమయే లలిత పదజాలమూ, ఉదాత్త భావాలూ, సదాశయాలూ, నిత్యజీవిత సంభాషణలలో వాడుకొనే లోకోక్తులూ సామ్యములూ త్యాగరాజ కృతులనూ, సంగీతమునూ సామాన్యజనులకు కూడ ఆస్వాదయోగ్యములుగా చేశాయి. ఉపనిషత్తులలోని పరమ సత్యములను కూడా సులభశైలిలో తన కృతులలో చెప్పించినందువల్ల త్యాగరాజు కృతులను తత్త్వవిదులయనవారు త్యాగబ్రహ్మోపనిషత్తు అని కొనియాడారు.

ఆయన కృతులలో దాదాపు సగానికిపైగా రామాయణ కథాత్మకమైనవి. రామాయణ కథానాయకుడైన రాముడుగానే కాక, ఆ దైవము పరబ్రహ్మ స్వరూపుడైన మూల విరాట్టుగాను, మహావిష్ణువునకు పర్యాయనాముడుగాను త్యాగరాజుకు దర్శన మిచ్చాడు.

అచ్చుయి లభిస్తూన్న ఐదారువందల కృతులలోను సుమారు 200 రాగాలను త్యాగయ్యగా రుపయోగించినట్లు తెలుస్తుంది. ఆయన రచించినట్లు ప్రతీతిలో ఉన్న 72 మేళకర్తరాగ కీర్తనలలోను సుమారు 40 మాత్రమే ప్రచారంలో కనిపిస్తున్నాయి.

సాహిత్యంలోని భావాలనుబట్టి త్యాగరాజ కృతులను వేదాంతబోధకములు, నీతిబోధకములు, నమస్కృతులు, సంగీత ప్రశంసాత్మకములు, మానస బోధకములు, ఆత్మ ప్రవర్తన విషయమైె పశ్చాత్తాపాత్మకములైన ప్రార్థనములు, విన్నపములు అని వివరించవచ్చు.

త్యాగరాజు తన కృతులలో బొత్తిగా గ్రామ్యమునుగాని, పరగ్రాంథికమునుగాని వాడక, శిష్ట వ్యావహారికమునే వాడినాడు. శ్లేషార్థములు ఆయనకు రుచింపవు. 'ఒక పత్నీవ్రతుడాయె,' 'పలువిధ చెడు దుర్విషయములు' వంటి వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు చేశాడు. సంగీత కృతుల విషయంలో అవి పాటించదగిన దోషాలు కావని పెద్ద లంటారు.

ఆయన కీర్తనలలో వ్యావహారిక సంభాషణలలో దొర్లే లోకోక్తులూ జాను తెలుగు పలుకుబళ్లూ కొల్లలు!

"రూకలు పదివేలున్న చేరెడు నూకలు గతిగాని ఓమనసా
కోకలు వెయ్యున్న కట్టుకొనుట ఒకటేగాని" —
"పరునిండి పారినా పాత్రకు తగునీరు వచ్చుగాని —
సారమౌ కవితల విని వెర్రివాడు సంతోషపడియేమి పడకేమి" —
"తురకవీధిలో విప్రునికి పానకపూజ నెరయ జేసియేమి
చేయకుంటేమి" —
"సోమిదమ్మ సొగసుగాండ్ర గోరిన, సోమయాజి స్వర్గార్హుడౌను"

ఇటువంటి లోకోక్తులవల్ల, ఆయన కేవలం మొగం ముడుచుకొని జీవిత పరాఙ్ముఖుడై ఉండే వేదాంతి మాత్రమే కాడనీ, చాలా సున్నితంగా హాస్యం చేయగలిగిన వాడనీ, సమయం వస్తే సంఘంలోని దురాచారాలను, వెగటును గర్హించడానికి సూటిపోటు మాటలనైనా వాడే స్వభావం గలవాడని తెలుస్తుంది.

ఆయన కృతులు కొన్ని మనస్సున నాటే ఉపదేశాలతో నిండిఉంటాయి. కొన్నిటిలో భగవంతునితో పంతాలాడినట్లు, కొన్నిటిలో జాలితో దీనుడైనట్లు మరికొన్నింటిలో నిందాస్తుతులు, స్తుతినిందలూ కనిపిస్తాయి.

ప్రజలలోని విషయలోలత్వా, డాంబికాచారములు, ధనవంతుల గర్వాటోపము, సామాన్యుల హింసాపరత్వము, జారచోరాది దురాచారాలు, కులాచార పాతిత్యమూ, కపటవర్తనలూ ఏటన్నిటినీ త్యాగరాజు తన కృతులలో పలుచోట్ల ఖండించాడు. ప్రతివారును సంసార మందుండియే కులాచారాలను వర్జింపక, సత్ప్రవర్తనతో నిష్ఠాత్ములై నియమబద్ధులై నిత్యమూ

భగవద్భక్తి కలిగి ఉండాలని ఆయన బోధించాడు. మత భేదములుగాని, మూలదైవముల పేరుల భేదాలనుబట్టి వివాదములుగాని ఆయనకు కిట్టవు. భక్తి మార్గములు వేరైనా, మత సంప్రదాయములు వేరైనా సర్వమతముల లక్ష్యమూ ఒక్కటే అని ఆయన చాటినాడు. అహంకారమును చంపుకొని, శమదమాది గుణములను పెంచుకొని ప్రాపంచిక వ్యవహారముల యెడ నిర్లిప్తులై ఉండడమే మోక్ష మార్గమనీ, డాంబికంగా చేసే జపతపాదులకంటె అంతశ్శుద్ధి కలిగి నిష్కామమైన భక్తి మార్గమే ముక్తి ప్రదమైనదనీ ఆయన విశ్వాసము. శ్రీరామానుగ్రహబలం కలవారిని గ్రహబలమేమీ చేయలేదనీ, రామ భజనపరులకు దండపాణి భయములేదనీ, రామకథాసుధారస పానమును మించిన అమూల్య వస్తువులేదనీ, ఆ భక్తిసాధనకు నాద బ్రహ్మోపాసనమే ప్రధాన మార్గమనీ ఆయన ప్రపంచానికి ప్రకటించాడు.

శృంగార కథాత్మకములైన నృత్యనాటకములు తనకాలము నాడు మేలట్టూరి భాగవతులు ప్రదర్శిస్తూ ఉండినా, ఆ ప్రదర్శనలవల్ల ఉద్బోధితుడయి కూడా ఆయన తన సంగీతనాటకాలు నౌకా చరిత్రము, ప్రహ్లాద భక్తి విజయమూ, సీతారామ విజయమూ ఆధ్యాత్మతత్త్వ బోధకములుగా కేవల సంగీత నాటకములుగా మాత్రమే రచించాడు.

తన కృతులతో దక్షిణభారత దేశమంతటినీ ఉద్విగ్నముచేసి, కర్నాటక సంగీతమును ఉజ్జ్వలితముచేసి, భారతీయావతార పురుషులలో ఒకడై, ప్రపంచ వాగ్గేయకారులలో నొకడుగా భద్రప్రతిష్ఠుడైన త్యాగరాజస్వామి చిత్రమును భారత ప్రభుత్వమువారు తపాలుబిళ్లగా ప్రచురించడం నేడైనా జరిగినందుకు సంగీతసాహిత్య కళాభిమానులంతా ఆనందింపవలసినదే!

ప్రభుత్వ నిర్ణయాలు

రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు నెలకొల్పేట్టు పారిశ్రామికదారులను ప్రోత్సాహపరచే ఉద్దేశ్యంతో కొత్త పారిశ్రామిక యూనిట్లకు విద్యుచ్ఛక్తి చౌకగా సప్లయి చేయాలని 1961 జనవరి 10వ తేదీన ప్రభుత్వం నిర్ణయించింది.

కలెక్టరుకున్న అధికారాలను జాయింటు కలెక్టర్లకు, అవసరమైతే ఇతర అధికారులకు కూడా సంక్రమింప జేయటానికి ప్రభుత్వానికి అధికారం ఇచ్చే ఒక శాసనాన్ని ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయించటం జరిగింది.

గూడూరులోని ప్రభుత్వ పింగాణి ఫ్యాక్టరీని, గాజు ఫ్యాక్టరీని నడపడానికై రెండు జాయింట్–స్టాక్ కంపెనీలను రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది.

ప్రజాస్వామ్యాన్ని గురించి పునాదుల నుంచి గాకుండా ఉన్నత అంతస్థులపై ఆలోచించే అలవాటును ప్రజలు అలవర్చుకున్నారు. ప్రజాస్వామ్యం పునాదులనుంచి నిర్మించనిదే ఉన్నత అంతస్థులలో విజయం సాధించలేదు.

—ప్రధాని నెహ్రూ

చేనేఁత పరిశ్రమ

సి. వి. సుబ్బన్న శతావధాని

(భోజ—కువింద సంవాదము)

ప్రజ్జ్వల త్తేజః ప్రభావ సమగ్రుఁడై
జనియించె నెవ్వాఁడు సవనవేది,
బిత్తల దిరిగెడి విబుధోత్తములకెల్ల
చేలమ్ము లెవ్వాఁడు చేసి యిచ్చె,
లోక కంటకులైన భీకరాసుర మూల
బలముల నెవ్వాఁడు గెలువఁ జాలె,
తనయంత వలచివచ్చిన శోభనాంగి, భ
ద్రావతి నెవ్వాఁడు ప్రభుత నేలె,
అట్టి ఘనుఁడు మృకండు మహర్షి పట్టి
కన్నవాఁడు మదన్వయ కర్త, భావ
నా మహర్షి ప్రసిద్ధుఁ డుద్దామకీర్తి
పాలిత కవీంద్ర! భోజ భూపాలచంద్ర!

కృత మెఱుఁగు నంద్రు లోకము
కృతకమతులుగాక, యెవ్వరికృతి ఫలమున్
గృతికిన్ దగుదానిఁ గనిరి!
కృతజ్ఞతాగుణము చూడ నెంతటిదో కదా.

తమ్మిచూలి దొట్టి తరలివచ్చిన వేల్పు
దొరల విన్నపమ్ము ద్రోసి చనక
దుర్ఘటమ్ము నాఁటి దువ్వలువల నేఁత
మేము గనుక చేసినాము, సామి!

కొలకులఁ దమ్మితూండ్లుగొని, కోమల తల్లలితో దరాంత ర
మ్ముల నలసల్ల తీసికొని పోగులు, వానిని బ్రోగుచేసి, కో
కల కనుపైన దారములుగా నదికించుచుఁ, జేకనూలుతోఁ
గలయికపొందు చందమును గన్గొని, మగ్గముపెట్టి నెండియుఙా.

పలుచని గంజితోడఁ బసిపావను దీర్చినయట్లు దీర్చి, మం
జులమగు నంచు, కమ్ములును శోభిలఁ గూర్చిన పుట్టముల్, ప్రియం
బలర సురల్ జనుల్ గొనుటయయ్యె, నుతించుటయయ్యె, నాఁటి వా
ర్తలు కలలోని సొమ్ముల విధమ్మునఁబోయె వచింప నేటికిన్.

సురల సమక్షమందుఁ గొనుచున్ వహియించిన నాఁటి దీక్షయే
తరములవెంటఁ గాదనక తాల్చి, తరమ్ములు నూర్లు వేలునుం
జరగెఁ; గృతజ్ఞతాలవము జాఱిన యీ ప్రజ కట్టుచుండె నం
బరములు, వాని కుచ్చెళులపాటవ మంబరవీధి నుళ్లుగా.

ధరణి సమస్తభంగుల నుదాత్త గుణంబున కందెవేసి, నా
గరకత వృద్ధిపొందె ననఁగా నెదిమూలమొ, అట్టి చేలమున్
విరచనచేయు మామక పవిత్రకృతిన్ గణియించి, పాండితీ
పరములు ధర్మమూర్తు లిదిభావ్యమునాక తొలంగఁబాడియే ?

గణనకు మేము కోటులుగఁ గల్గి, గృహమ్ములుదాటిరాక, దా
రుణమగు చావుచచ్చి, పదిరూకల నెట్లొ గడించి, పిల్లలన్
బణఁతుల సాకుకొంచును సనాతన ధర్మము నిర్వహించు మా
యణఁకువ తేలికయ్యె నకటా ! కలికాలము దాపురింపఁగన్.

మానవుడు పరిస్థితులకు కేవలం బానిస అని తన ప్రవర్తనను తాను నిశ్చయించుకోలేని నిస్సహాయుడని అనుకోవడం పొరబాటు. శారీరక మానసిక ధర్మమును నిర్ణయించడంలో అనువంశిక పరిసరాల ప్రభావాలు అధికంగా వున్నా, వాటిని మానవుని మేధాశక్తి సరిదిద్దగలుగుతుంది. మానవునికి కావలసినది సంకల్పబలం.

— గురజాడ

శ్రీకూర్మం

గజపతిరాయవర్మ

మారిన మత సాంప్రదాయాలు విడిచిన ఆనవాళ్లు వెదికే వారికే గాదు, పురాతన చారిత్రకావశేషాలు, ఉత్తరాంధ్రుల సమాజ జీవన విశేషాలు శిల్పంలోకూడా ప్రదర్శించే క్షేత్రాలు నేటి శ్రీకాకుళం జిల్లాలో వున్నాయి.

ఫౌజ్‌దార్ షేక్ మహ్మద్‌ఖాన్ శిఖాఖోల్ చేయక పూర్వం శ్రీకాకుళం క్రీ. శ. 7 వ శతాబ్దంనుండీ వరాహవర్తనీ, కోటీశ్వరాగ్రహారం పేరిట నుండెను.

శ్రీకాకుళానికి 8 మైళ్ళలో నున్నది శ్రీ కూర్మం. అనేక క్షేత్రాల్లో - దేశం అనేక ప్రాంతాల్లో చేపలూ తాబేళ్లూ ఆలయం చేరువ చెరువుల్లో పెంచడం వుందేగాని విష్ణు - దశావతారాల్లో ఒకటైన కూర్మావతారం పూజలందినదీ, ఆలయమున్నదీ ఒక్క శ్రీ కూర్మం లోనే.

'కుదురుకు కూర్మాం, జిలుగుకు సింహాచలం' అంటారు.

కళింగ రాజ్యంలో - ఆంధ్రలో అశోకుని దండయాత్ర నాటికే బౌద్ధమతం బహుళ వ్యాప్తిలో నుందనీ, ఆజీవక, జైన సాంప్రదాయాలూ ఉండేవనీ పరిశోధకాభిప్రాయం. ఆదిమ శైవ శాక్తేయాలూ ఉండేవి.

గంగాముల కులస్తులు. గంగా నామాన్వయులు పాలించిన సుమారు 9 శతాబ్దాల్లో క్రీ. శ. 10 వ శతాబ్దం వరకూ ఈ రాజుల పోషణలో శైవమత వ్యాప్తికి బౌద్ధం తట్టుకోలేక పోవడం, క్రీ. శ. 8 వ శతాబ్దం తర్వాత సాలిహుండాం మహా చైత్య దర్శనాని కెవరూ రాక పోవుటలోనే తెలుస్తుంది.

శ్రీ కూర్మానికి శ్వేతాచలం, శ్వేతగిరి యని మరో పేరుంది. కాళింగ శాసనాల్లో పేర్కొన్న కొందరి రాజధాని శ్వేతక మీ శ్రీ కూర్మమే గావచ్చును.

సాలిహుండాం శ్రీ కూర్మాం దాపుల్లో నున్నందునా, ప్రజలు చెప్పుకునే కథలు - సంబంధాలు బట్టి శ్రీ కూర్మాం ఒకప్పుడు బౌద్ధ క్షేత్రమేమో యనిపిస్తుంది.

అరసవల్లి సూర్యనారాయణంలో దేవుడు సూర్యుడైనా ఆలయ శిల్పం - అంతా శైవం - కాగా శివాలయంలో గర్భగుడి పోలిక - సూర్యదేవుడు మధ్యలో నున్నాడు.

అరసవల్లిలో వలెనే శ్రీ కూర్మాంలో శివాలయం వైష్ణవాలయం జేశారంటూరు.

"కూర్మ పురాణము" శైవపరం అనే సంగతి అందరెరిగినదే.

"పద్మపురాణా"ంతర్గతమైన శ్రీకూర్మ మహాత్మ్యం కాళింగుల నిరసించుటలో పాతకాలపు ద్వేషాలు. నమ్మకాలు కారణం.... లక్ష్మీదేవి భర్త కళింగంలో నివసించగోరిన సందర్భపు ప్రశ్న. ఈయన శ్వేతాచలాన అవతరించా రంటూరు గాని శ్రీకూర్మంలో కొండలులేవు.

శ్రీకూర్మం ఆదిలో పాతాళ సిద్ధేశ్వర క్షేత్రము. ముంజేరు. గ్రామ శిలాశాసనకర్త, కళింగాధిపతి విజయసిద్ధి ప్రతిష్ఠించెను.

నండూరి కొమ్మనామాత్యుడు ప్రతిష్ఠించెననీ, క్రీ.శ. 1070లో నిచట వైష్ణవాలయం నెలకొల్పబడెననీ "కేయూరబాహు" చరిత్ర చెబుతుంది. కాదు క్రీ.శ. 12వ శతాబ్దంలో రామానుజాచార్యుడే శైవక్షేత్రాన్ని వైష్ణవంజేసి కూర్మనాథుడనే పేరిడెనంటూరు.

కచ్ఛపం కథలో శైవం - లింగపూజ - 'సెక్సు' సంబంధం ప్రపంచంలో వుండేదని పరిశోధ కాభిప్రాయం.

శ్రీ కూర్మనాథాలయం చేరువనే శివాలయమున్నది. దేవుని పేరు పాతాళసిద్ధేశ్వరుడు. గర్భగుడి లోతుగానే వుంది.

అసలు సిద్ధేశ్వరాలయం నేటి శ్రీకూర్మ నాథాలయమే అనుకోడానికి అవకాశాలేకపోలేదు.

శ్రీ కూర్మనాథాలయంపై మందమై గట్టిపడిన సున్నపుపూత రసాయనికాలతో తొలగిస్తే శైవపరమైన శిల్పం బైల్పడవచ్చును.

విష్ణ్వాలయాల్లో విగ్రహం గోడకు చేరువగా నుంటును. అరస వల్లి, సింహాచలం, శ్రీకూర్మాల్లో నేడు విష్ణ్వాలయాలైనా విగ్రహాలు గోడకు చేరువగాలేవు.

. శ్రీకూర్మనాథాలయంలో ఎదురుగా గోడ చేరువగా కాన్పించేవి జగన్నాథుడు, సీతారామ లక్ష్మణుల విగ్రహాలు. ఆలయంలో ఒకపక్కగానున్న వేదికపై ఎదుటనుండి చూచిన వీలుగా కనిపించే లింగమూర్తికి వెనుకవుండు పర్పర్చిన చిహ్నాలు అలంకరణాలు - అమరికలు - పక్కనుండి చూస్తే రాజేలు ఆకారంగా కనిపిస్తుంది.

రామానుజాచార్యుడు క్రీ. శ. 12వ శతాబ్దంలో వైష్ణవాలయంగా మార్చాడు అంటారేగాని చారిత్రకాధారాలేమి లేవట.

అంగవస్త్రం, అమర్పులు తీసిచూస్తే కనిపించేది లింగ మూర్తియే.

స్థలపురాణం ఆలయ నిర్మాణం బహుపురాతనం అన్నప్పటికీ అచటి శాసనాల వలన క్రీ. శ. 12వ శతాబ్దానికి పూర్వపుది మాత్రం కాదంటారు.

శక వర్షాలు 1172, 1263, 1393 నాటి సాహసమల్లుడు, నారాయణ గజపతి, పాలకొండ సర్వజ్ఞదేవరాజుల శాసనాలు, క్రీ. శ. 12-15 శతాబ్దాల మధ్యకాలపు గంగా నామాన్వయుల శాసనా లున్నాయి.

కళింగ దేశం పాలించిన గాంగుల్లో తొలిగాంగు లనబడిన గంగామల కులస్థుల కులదైవం గోకర్ణేశ్వరుడు (శివుడు). మలి గాంగు లనబడిన గంగా నామాన్వయులు గోకర్ణేశ్వరుని పేర్కొన్నప్పటికీ మధుకేశ్వరోపాసకులు. మలిగాంగులు కళింగాన్ని క్రీ. శ. 9 వ శతాబ్దంనుండి క్రీ. శ. 15 వ శతాబ్దం వరకూ పాలించారు. వీరి పరిపాలన చివరి రెండు మూడు శతాబ్దాల్లో సౌరవైష్ణవాలు కూడా ఆదరింప బడినట్లుంది.

అనంత వర్మచోడ గంగదేవు (క్రీ. శ. 1076 - 1147) డు ఉత్తర కళింగాన్ని (ఉత్కళ) క్రీ. శ. 1132లో జయించెను. రాజధానిని ముఖలింగము (శ్రీకాకుళం జిల్లా) నుండి కటకము (ఉత్కళ) నకు మార్చెను. అతడే గాంగుల్లో వైష్ణవాన్ని కూడా ఆదరించిన మొదటి రాజంటారు.

శ్రీకూర్మ నాథాలయంలో ఎక్కువగా ఊతని శాసనాలు, వున్న శాసనాల్లో పురాతనమైన దితనిదే అయ్యున్నందున శ్రీకూర్మనాథు నితాడే ప్రతిష్ఠించి యుండునంటారు.

కోణార్క (కోణ కోణ) సూర్యదేవాలయం గూర్చి వ్రాస్తూ సర్ విలియం హంటర్ జీర్ణావస్థలోనున్న బౌద్ధం — శైవాన్నెదిరించడంలో పొందిన వైష్ణవ సహకారం - ఫలితం సౌరారాధనావ్యాప్తి, విష్ణ్వాలయాల్లో (శ్రీకూర్మనాథాలయంలో వలె) బౌద్ధం (జగన్నాథ?), బౌద్ధక్షేత్రాల్లో వైష్ణవ చిహ్నాలు కాన్పించిన కారణం అనెను. అది క్రీ. శ. 13వ శతాబ్దపు విషయం.

శ్రీ కూర్మనాథ క్షేత్రానికి చెందిన మఠాధిపతి (పూర్వాశ్రమంలో శ్యామశాస్త్రి), నరహరి తీర్థులు, 12 సంవత్సరాలు రాజప్రతినిధిగా కూడా వ్యవహరించెనట. ఈయన క్రీ. శ. 14వ శతాబ్దారంభ కాలపు వాడు.

కళింగ దేశంలో నేడగుపడే నల్లరాతి విగ్రహాలన్నీ (సింహాచలం, అరసవల్లిమొ. క్రీ. శ. 12 శతాబ్దం తర్వాత ప్రతిష్ఠింప బడినవంటారు.

శ్రీకూర్మనాథాలయపు చెరువులో అస్థికలు కలుపుతారనీ, అవి సాలిగ్రామాలుగా మారిపోతాయంటారు. శ్రీకూర్మం చెరువులోకి నీరు వంశధారా నదినుండి (సాలిహుండాం వద్ద) వస్తుందనీ, నదికీ - చెరువుకూ సాలిహుండాం కొండలోనుండి భూగర్భ జలమార్గం వుందనీ చాలామంది నమ్ముతున్నారు. వీరికి సాలిహుండాం శ్రీకూర్మం చెందినదైయ్యుండినట్లే గాక (బౌద్ధక్షేత్రం) సాలిహుండాము చైత్యాన్ని శాలివాహనుని కోటలేక సౌధంగా నమ్మకం.

శ్రీకూర్మం కళింగ సిద్ధాంతులకు 'గ్రీన్‌విచ్', ఉజ్జయిని వంటి దంటారు. పంచాంగ గణన ఏమైనా సాలిహుండాం, శ్రీకూర్మాం-రెండిటా జ్యోతిర్మండల పరిశోధనకు అనువైన ప్రదేశం సాలిహుండాం - రెండిటి మధ్యా సుమారు 4 మైళ్లదూరం.

శ్వేతాచలం, శ్వేతగిరి అనేపేరెప్పుడైనా సాలిహుండాము కుండేదేమో తెలీదు. సాలిహుండం పూర్వపుపేరు సాలిపెటక, సాలిపెడక వివరం 'సాలిహుండాం' గూర్చిన వ్యాసంలో వ్రాశాను.

బహుమతి పత్రాలు

చిట్టా దామోదర శాస్త్రి

కొనండి బాబూ కొనండి తల్లీ
కొనండి బహుమతి పత్రాలూ
బలేలాటరీ, అదృష్టముంటే
బహుమతి తెచ్చే పత్రాలూ. ॥కొనండి॥

ఐదురూకలకు ఏడున్నరవేల్
పదిరూకలకూ పదేనువేలూ
వందరూకలకు ముప్పైవేలూ
బహుమతి వచ్చును కొనండి బాబూ. ॥కొనండి॥

అసలుకు మోసం లేదండీ
వడ్డీఐతే రాదండీ
బహుమతి తమకు రాకపోయినా
భద్రము తమ సొమ్మండీ
ఐదువత్సరా లనంతరమున
అసలు పొందగలరండి. ॥కొనండి॥

పిల్లా పెద్దా, స్త్రీలు పురుషులూ
ఎల్లరు కొనవచ్చండీ
అందరు తమతమ అదృష్టమెంతో
పరీక్ష చేసికొనండి. ॥కొనండి॥

మూడునెలలకొకసారి
ముచ్చటగా కలిపెదరూ
కలిసివచ్చి తమ నెంబరువస్తే
బలేఛాన్సులె వేలకువేలే. ॥కొనండి॥

డర్బీలాటరి, సిక్కింలాటరి
మద్రాస్ బొంబై రేసులూ
క్రాసుపజిల్సూ కాటన్ మార్కెట్
అదృష్టముంటే వస్తుంది
అదిలేకుంటే ఏమీరాదూ
అసలు హుళక్కి సుమ్మండీ
కాబట్టీ తగు యోచనచేసి
గవర్నమెంటూ గ్యారంటీగల
బతేలాటరీ లక్కీలాటరీ
బహుమతి తెచ్చే పత్రాలూ. ॥కొనండి॥

బహుమతిపోను మిగిలిన డబ్బూ
ప్రజలకోసమేనండీ
ప్రణాళికలకూ పశుసంపదకూ
వ్యవసాయానికి వంతెనలకునూ
బాటలకొఱకు పాఠశాలలకు
ఆసుపత్రులకు అభివృద్ధులకూ
ప్రజల సుఖమునకు, ప్రజాసంపదకు
సౌకర్యాలకు సౌభాగ్యానికి
వ్యయపడునండీ, ఇది నిజమండీ. ॥కొనండి॥

కాబట్టీ మనమేలుకోసమే
గవర్నమెంటు బహుమతి పత్రాల్
కొన్నారండీ ఎంతమందియో
కొట్టారండీ లక్కీఛాన్సూ
తప్పక తమతమ గ్రామంలోనూ
తలకొక వేయి కొనవలెనండి. ॥కొనండి॥

మనం చేసే పనులన్నీ భయంలేక పిరికితనంతోగాకుండా ఆత్మబలం, సత్యం, నిజమైన ధైర్యంమీద ఆధారపడి సాగిస్తే విజయం తథ్యం.

— డా. రాజేంద్రప్రసాద్

కొండపల్లి ఖిల్లా

అక్కాల బాబురావు

కొండపల్లి గ్రామం విజయవాడ - హైదరాబాదు రైలు మార్గమున 10వ మైలుదగ్గరను, విజయవాడ - తిరువూరు బస్సు మార్గమున 12వ మైలు నందున గలదు. ఇది దుర్గారణ్య ప్రవేశమై, సుమారు మైళ్ల చుట్టుకొలత గలిగి యున్నది. కొండ యెత్తు రెండు మైళ్లుగలదు. ఈ గ్రామము సీతాఫలములకును, రేగిపండ్లకును ప్రసిద్ధి చెందియున్నది. కొండపల్లి అనగనే "కొండపల్లి బొమ్మలు" అను పదము స్ఫురించును. కొండపల్లి బొమ్మలు తయారుచేయు, అర్యక్షత్రియ కుటుంబములు ప్రస్తుతము 5 లేక 6 కుటుంబములు మాత్రమే వున్నవి. ఈ పరిశ్రమ జీర్ణావస్థలో నున్నతరి ప్రభుత్వమువారు బొమ్మల తయారీలో శిక్షణ నిమిత్తము ఒక కేంద్రమును స్థాపించి యున్నారు. ఈ శిక్షణ కేంద్రములో పలువురు విద్యార్థులు శిక్షణ పొందుచున్నారు.

కొండపల్లి కథనం

గజపతుల నుండి రాజ్యము నాక్రమించిన బహమనీ సుల్తాను మహమ్మదుషా (క్రీ. శ. 1463-1471) కొండపల్లి కోటయందు కొన్నిమార్పులు చేయుటయేగాక, దుర్గము క్రింద నొక గ్రామము కూడా కట్టించెను. ప్రాకారములు నిలువకుండుట జూచి, పరిసర ప్రాంతములో గొర్రెలు కాచుకొను కొండడు అను గొల్లవానిని, అతని భార్య పల్లెను హత్యచేసి పునాదులలో వేసి గోడలు కట్టించిరి. అప్పటినుండియే క్రిందనున్న గ్రామమునకు కొండపల్లియను సార్థకనామము వచ్చెను. క్రీ. శ. 1579-1590 కాలమున పాలించిన ఇబ్రహీం పాదుషా కొండపల్లి నగరమునకు ముస్తఫాఖానుని, కొండవీటి నగరమునకు మృత్తుజాఖానుని దుర్గపాలకులుగా నియమించెను. అప్పటినుండి కొండపల్లి నగరమునకు "ముస్తఫానగర"నియు కొండవీటి నగరమునకు "మృత్తుజానగరమనియు" మారుపేర్లు ఏర్పడయించెను. ఈ ముస్తఫాఖాను తన ప్రభువైన ఇబ్రహీంపాదుషా పేరున కొండపల్లికి సమీపమున యిబ్రహీంపట్నం అను గ్రామము కట్టించెను అది నేడు విజయవాడ - జగ్గయ్యపేట, విజయవాడ - తిరువూరు బస్సుమార్గమున 9వ మైలుదగ్గర ఇబ్రహీంపట్నం జంక్షన్ అను పేరుతోనున్నది. క్రీ. శ. 1515-1530 కాలమున పాలించిన శ్రీకృష్ణదేవరాయలు తక్కిన దుర్గములతో బాటు కొండపల్లి దుర్గమును యిబ్రహీంపట్నముకువద్ద మకాము వేసి స్వాధీనము చేసికొనెను. ఆ కాలమందు రాయల సైనికులకు నీటి సౌకర్యములేనందున మంత్రి తిమ్మరుసు ఒక దిగుడుబావిని త్రవ్వించెను. అది నేటికిని తిమ్మరుసు బావి అని పిలువబడుచున్నది

దుర్గనిర్మాణము : దాని పాలకులు

క్రీ. శ. 1362-1377 కాలమున పాలించిన అనవేమారెడ్డి ఈ కోట నిర్మాణముగావించి యుండెను. ఈ దుర్గము క్రింద నొక కోట ప్రాకారమున్నది. దాని చుట్టుకొలత 12 మైళ్లుండును. ఈ ప్రాకారము నంటియున్న కోటచుట్టూ కందకము కలదు. క్రిందినుండి దుర్గమునకు షుమారు 2 మైళ్లుండును. దుర్గమునకు రాచబాట, రాళ్లబాట అను రెండు బాటలుగలవు. రాళ్లబాట రహస్య యాత్రలకును, రాచబాట పదాతిసైన్యములకును వినియోగింపబడి యున్నవి. ఈ రెండు బాటలు నేటికిని వినియోగములోనే యున్నవి. ప్రతి ప్రాకారమునకు బురుజులున్నవి. ఈ బురుజులువున్న స్థలములు హనుమంతకొండ; ఎర్రబురుజు, ఎద్దకొండ, ఒంటిమన్యము అని పిలువబడుచున్నవి. ఒంటి శిఖరమునుండి వీక్షించిన బందరు సముద్ర తీరము కన్పించును. కొండపల్లి దుర్గనిర్మాణ రహస్యమంతయు ఒంటి మన్యములోనే యున్నది. రెడ్డిరాజులు యీ బురుజు నుండియే కొండవీటి దుర్గమును వీక్షించినటుల చరిత్ర చెప్పుచున్నది. క్రీ. శ. 1697-1749 కాలమున పాలించిన సుల్తాన్ అబ్దుల్లాహసన్ తానీషా, ఈ ఒంటిమన్య సామీప్యమున "బాల హిస్సార్" అను భవనమును తన ఉంపుడుగత్తెకు కట్టించెను. దానిని యిప్పటికిని "భోగందాని మేడ" అని పిలుచుచుందురు.

కొండ పైభాగమున రెండు తటాకములు గలవు. అవి టాకీలనే పేరుతో వ్యవహరింపబడు చున్నవి. దర్బారు భవనమునకు ముందు రాణులజలక్రీడార్థము సరస్సు త్రవ్వించబడియున్నది.

కుమారగిరి వేమారెడ్డి (క్రీ. శ. 1378-1398); పెదకోమటి వేమారెడ్డి (క్రీ. శ. 1399-1415); రాచ వేమారెడ్డి (క్రీ. శ. 1416-1419); లాంగూల గజపతి (క్రీ. శ. 1420-1431); ప్రతాపరుద్ర రాయలు; హరిహర రాయలు (క్రీ. శ. 1431-1454); కపిలేశ్వర గజపతి (క్రీ. శ. 1455-1464); మహమ్మదు షా II (క్రీ. శ. 1464-1471); పురుషోత్తమ గజపతి (క్రీ. శ. 1471-1482); అంబర రాయలు (క్రీ. శ. 1482-1496); వీరభద్ర గజపతి (క్రీ. శ. 1497-1515); శ్రీకృష్ణదేవరాయలు (క్రీ. శ. 1515-1530); కులీకుతుబ్ షా (క్రీ. శ. 1534-1543); అచ్యుత రాయలు; సదాశివరాయలు; వెంకటపతిరాయలు (క్రీ. శ. 1543-1579); ఇబ్రహీం పాదుషా (క్రీ. శ. 1579-1590); అజాన్ ముల్కు; పరాస్ ఖాన్; అసరస్ ఖాన్; అకలస్ ఖాన్ (క్రీ. శ. 1590-1611); గుంటుపల్లి ముత్తనామాత్యుడు (క్రీ. శ. 1611-1656) నటఫర్ జంగ్; అబ్దుల్లాహసన్ తానీషా (క్రీ శ. 1656-1666); నిజాముల్ ముల్కు పాదుషా (క్రీ. శ. 1666-1697); సుల్తాన్ అబ్దుల్ హసన్ తానీషా (క్రీ. శ. 1697-1749); దాదాబహద్దర్ తానీషా (క్రీ. శ. 1749-1752); హసదుల్లా ఖాన్; తాతద్దీన్ ఖాన్; నటపర్ జంగ్; (క్రీ. శ. 1752-1766); జనరల్ కెయిలాడ్; (క్రీ. శ. 1766-1859). 1859 సం॥లో ఈ జిల్లా పరిపాలన అంతమయినది.

ప్రస్తుత పరిస్థితి

రెడ్డిరాజులచే నిర్మింపబడిన యీ దుర్గరాజము నేడు శిథిలావశిష్టమై, ప్రభుత్వమువారిచే నెట్టి రక్షణచర్యయును తీసికొనబడక, జీర్ణావస్థలో నున్నది. పూర్వచరిత్ర స్ఫురింపజేయు శిథిలములను జాగ్రత్త చేయుపనిని యిప్పటికైనను ప్రభుత్వమువారు పూనుకొనిన కడు సమంజసముగా నుండును. ప్రభుత్వము వారిచే జిల్లాపై జాటసారులకై నిర్మించిన "ట్రావలర్సు బంగళా" సయితము జీర్ణావస్థలో నున్నది. ఇప్పటికిని యీ జిల్లాను జూచుటకు నిత్యము పలువురు యాత్రికులు వచ్చుచుందురు.

ఈ గ్రామములో జిల్లా పరిషదోన్నత పాఠశాల; 5 ఎలిమెంటరీ పాఠశాలలు; రెండు సత్రములు; కొండపల్లి బొమ్మల కేంద్రము; రస కర్పూరముచేయు బట్టీలు; పోస్టు అండు టెలిగ్రాఫ్ ఆఫీసు; పంచాయితీ బోర్డు; లోకల్ ఫండ్ ఆసుపత్రి; ఒక పనిచేయని క్లబ్బు; రెండు వడ్లమరలు; ఒక ఆముదపు మిల్లు వున్నవి. క్రీ. శ. 1570-1590 కాలమున పాలించిన యిబ్రహీం పాదుషా కట్టించిన "ముసాఫిర్ ఖానా" ప్రస్తుతము సారాఖానా అనుపేరుతో వ్యవహరింప బడుచున్నది. ఈ కాలముననే యీ పాదుషా దుర్గముపై దేవళమును పాడుచేసి కట్టించిన మశీదు "హజరత్‌గాలబు సాహిదర్గా" నేటికిని వున్నది. క్రీ. శ. 1656-1666 కాలమున పాలించిన తానీషా ప్రభువు కొండపల్లి దుర్గమునుండి గోల్కొండకు రహస్యబిలము యేర్పాటు చేయించెను. అదినేడు మూయబడి యున్నది.

రెడ్డిరాజుల కాలమున నిర్మితమైన కొండపల్లి దుర్గము పూర్తిగా శిథిలము గాకమునుపే ప్రభుత్వమువారు దుర్గ సంరక్షణకు పూనుకొనుట సమంజసము.

అతి శీతలదేశాల సంగతి అటుంచి, మన దేశవాతావరణ స్థితినిబట్టి మనకు తాగుడు అనవసరం. తాగుడుకు అలవాటు పడినదేశం వినాశనమవక తప్పదు. మహా మహా రాజ్యాలు ఎన్నో తాగుడుకలవాటు పడి సర్వనాశనమయ్యాయి. ప్రపంచ చరిత్ర దీనిని నిరూపిస్తుంది. శ్రీకృష్ణుడు యాదవంశ సంభూతుడు. అంతటి గొప్పవంశం త్రాగుడుతో రూపుమాసిపోయింది. రోమన్ మహా సామ్రాజ్యం అంతరించటానికి తాగుడు ప్రధాన కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చు మంచిగా జీవించాలనుకుంటే ముంచుకురాకముందే ఈ దుర్గుణాన్ని పారద్రోలండి.

—'గాంధీదర్శనము' నుండి

ప్రసన్న కవితాలోకము

'మసూనా'

క్రొత్తబాటల పయనించు కోర్కెసాంచి
మధుర మధురోహలకు రూపమామతించు
నీ ప్రభాతమ్ము, నెచ్చెలీ ! ఏ మనోజ్ఞ
సీమలనో చూడ పోయివచ్చెదము రమ్ము.

2

బహుళ సంకుల జీవన భారములను
ప్రక్కకునెట్టి నిర్మల భవ్యకాంతి
లోకముల విహరింత మీలోక కథనె
మరచి సురుచిరానంద సంచరణసీమ.

3

మనము లక్షించు నవ్య సామ్రాజ్యమందు
మధుర దరహాస లాస్య సంభావ్యమైన
వదనములెకాని దుఃఖిత హృదయములట
కానరావది మానస కల్పకమ్ము.

4

ప్రియముతో లేక కడు నసంతృప్తికెలుగ
కలువరింతల మయముగా కలగునట్టి
కృష్ణపక్షాలు లేవట, క్రీడలోలయు
నిశ్చలానంద పూర్ణిమా నిశలెకాని.

5

ఇతడు నిత్య లక్ష్మీకటాక్షయుతుడని, అత
డినుపగజ్జల తల్లికి అనుగుబిడ్డ
అనియు అంతర మటలేదు, ఆత్మబల, వి
భాసమానులెల్లరు—ఆ దివమ్ములోన.

6

అస్పృత రూపాలతోడ దోగార్తిలేని
యౌవన విలాస నవ వైభవాతిశయము
తోడ, కళ్యాణ రోచులతోడ వెలుగు
ఆ ప్రపంచ మనంత శిలాప్రథితము.

7

మానవతలోని ఆత్మసుమమ్ము విరిసి
పరిమళమ్ముల నొలుకు ప్రాభాతవేళ
ఉద్యమింతము, దివ్య కార్యోత్సవమ్ము
సానుకూలమౌ, శుభదమౌ సాగిరమ్ము.

8

శ్రీ తరుణద్యుతీ విభవ
రేఖల సర్వచరాచరమ్ము, సం
చాతతమై వెలింగెడు, అ
నంత విభాపరిపూత కీర్తి సం
జాత మనోజ్ఞమూర్తి పద
సన్నిధి నిశ్చలభావయుక్తి సం
గీతవినీతగీతుల లి
ఖింతము నవ్యపథాన లేఖినీ!

9

ఓ నవలేఖినీ! సుషమ
నొప్పెడి ఆధర కాంచువేళ, నీ
మానసమూగి వేడుకల
మైమరచేవు సుమీ! త్వదీయ, ది
వ్యానుభవమ్ము సర్వజన
పాళికి భుక్తము చేయగావలెన్,
మానవలోక మెల్లెడ, స
మత్వము సత్వము నింపగావలెన్.

ఆపద సంభవించినపుడు సానుభూతి చూపటం మానవత్వం. దాన్ని నివారించటం దైవత్వం.

—హోరేస్ మాన్.

వ్యాఖ్యానమ్

యామిజాల పద్మనాభస్వామి

ఎందుకీసంత ! అసలు వచ్చిన పనేమిటో చెప్పుదూ? 'అంటారు.'

సంతలో వినిపించే గోలకి వ్యాఖ్యానం అనవసరం. కాని ఆ గోల కావాలని ఎవరూ చేసేదికాదు. వస్తువులు బేరమాడిన వాళ్లు అనే మాటలూ, అమ్మేవాళ్లు చెప్పే జవాబులూ, ఒకరి నొకరు పరిచితులు పలకరించుకుని చేసే ప్రసంగాలూ వగైరా అంతా కలిసి

'సంతగోల'అయి సంతకి ఒకలక్షణంగా తయారవుతుంది. పిల్లాజెల్లా అంతా ఒకదగ్గర కూర్చుని నలుగురూ నాలుగురకాల మాటాడుకోవడం, అరవడం, అల్లరిచెయ్యడం ఇదంతా కాస్త హెచ్చుతగ్గుగా సంతగోలగానే ఉంటుంది. ఆసమయంలో ఆదరాబాదరాగా యింటికి వచ్చిన యజమాని విసువుగా, విసురుగా అంటాడు 'ఏమిటర్రా యిల్లు సంతచేసేస్తున్నారు!' అని.

ఆలాగే ఎవరేనా ఏదో అవసరార్థం ఒకరియింటికి వచ్చి తన ప్రయోజనం ముందు చెప్పక ఉపోద్ఘాతం ఆరంభిస్తారు. వినే వారికి అదంతా అనవసరమే అయినా కార్యార్థికి అది చాలా అవసరం. అదంతా వల్లిస్తూనే ఉంటాడు. మరి భరించలేక వినే వాడు అంటాడు

'ఎందుకీసంత ! అసలు వచ్చిన పనేమిటో చెప్పుదూ'—అని. చూశారా ! వినేవాడు యిచ్చేవాడు, చెప్పేవాడు పుచ్చుకునే వాడు. చెయ్యి చాచడం ఒక నామర్దా అయినా అది కాస్త ఘరానాగా ఉండాలనీ, ఆ చాచడానికి తగినంత కథ ఉందనీ తన గోడు వెళ్ళబుచ్చుకుంటాడు పాపం ! మరి యిచ్చేవాడికి అంత సహనం ఉంటుందా ? చెప్పేవాడి గోడంతా ఆ పెద్ద మనిషికి 'సంత' అయిపోతుంది........

మన భాషలో యిలా ఉపయోగించేవి బహు చమత్కారంగా ఉంటాయి.

'తాటిపండు తింటావా ?

తల కొట్టుకుంటావా ?'

ఇందులో ఏ ఒక పనీ సహజంకాదు. తాటిపండు తినడంవల్ల చెరుపేగాని కడుపుకి అరేదా ? కాలుకి అయేదా ? పీచు పళ్ళలో చక్కగా అమురుకుంటుంది. దానిని పీక్కుంటూ ఆ బాధ ఎలాగో సహిద్దామని తినడానికి ప్రయత్నించినా ఆ పండులో ఉండే రసం అంత యింపైనదీ, నింపైనదీ కాదు. పైగా అదోక ముదరవాసన కొట్టుతూ ఉంటుంది. దానికీ సహించి తిన్నప్పటికీ వచ్చేగుణం నహి. తాటిపండు తింటే వాతం ప్రకోపిస్తుందంటారా ? ఫలితార్థం ?

వాతరోగం కోరి తెచ్చుకోడం — ఉండలేక గుజ్జుంచేత తన్నించుకోడం అంటే యిదే. కనక తాటిపండు తినడం అసాధ్యం, అవగుణాకరం.

అలాగే 'తలకొట్టుకోడం' - ఏ గోడకో వేసి తలకొట్టుకోడం ! పిచ్చివాడుకూడా యీపని చెయ్యడు. బెదిరించినా చెయ్యలేడు. ఎందుచేత? వచ్చేఫలం ఏమిటి ? బొప్పికట్టుతుంది. పోటు పుట్టు తుంది. దానిని మాన్పుకోడానికి ప్రయత్నిస్తే తెలిసినవాడు

'నీకేం మతిపోయిందా ?'

అని అడుగుతాడు........

అయితే యీ రసస్ఫోరకమైన జంటవాక్యం ఎందుకు అవత రించినట్టు ? నవ్వులాటగా అన్నా వినడానికి అది కటువుగా, మొరటుగా ఉన్నదే.

అసాధ్యమైనపనులు రెండు చెయ్యవలసివచ్చినపుడు కష్ట సుఖాలు గణించక దానిని ఎలాగైనా చెయ్యాలని ఆజ్ఞ అయితే యీవిధంగా అంటారు.

ఏమిటయ్యా ! నువ్వు చెప్పినది ఎలా ఉందంటే

'తాటిపండు తింటావా ?

తల కొట్టుకుంటావా ?' అన్నట్టుంది అని....

ఇంచుమించు యిలాటిదే యింకోటి—

'మొట్టో అంటే పెళ్ళి' — అన్నాడట.

పెళ్ళి చేసుకున్నవాళ్లు పెళ్ళాంవచ్చి, ముగ్గురో నలుగురో పిల్లలు పుట్టాక పడే అవస్థ అనుభవైకవేద్యంగాని వాచ్యంకాదు.

ఆ అవస్థకి దారిద్ర్యం తోడయితే యింక చెప్పనక్కరలేదు. అలాటి గృహస్థుల అవస్థ దయనీయం. వాళ్లు పడేపాట్లు కుక్కలుకూడా పడవు. అదంతాచూసి, విసిగి, జీవితంమీద విరక్తిపుట్టి ఏక్‌నిరంజన్‌గా ఉంటేనే హాయ్ — అనుకునేవాడు 'ఏమిరా అబ్బాయీ!' పిల్ల నచ్చిందా? అని అడిగితే

'మొఱ్ఱోఅంటే పెళ్ళి' నాకక్కరలేదంటాడు. దీనినే యింకో విధంగా వ్యాఖ్యానించవచ్చు.

ఒక అమ్మాయి జ్వరంవచ్చి బాధపడి లేచి తేరుకున్నది. అప్పుడే కాస్త పథ్యం వంటపట్టి కొంచెం కొంచెం రక్తం చేరుకుని కాళ్ళల్లో లేచి నిల్చుందుకు జవసత్వాలు వస్తూఉంటాయి. ఇరుగుపొరుగున ఎవరింట్లోనో పెళ్లిబాజాలు వినిపించి దగ్గరగా ఏ మేనమామో, మేనత్తకొడుకో ఉంటే చూసి.

'ఏమిటాబాజాలు — సీతకి పెళ్లా?' అని అడిగింది.

ఆఁ — నీకూ చెయ్యమన్నావా?' అని నవ్వుతూ అడిగితే ఆ అమ్మాయి చికాకుగా నవ్వి

బాగుంది నీవేళాకోళం. జ్వరంవచ్చి చచ్చి ఎలాగో బతికాను. యిప్పుడు నీపని అలాఉంది.

'మొఱ్ఱోమని నేను ఏడుస్తూ ఉంటే పెళ్ళి చెయ్యమంటావా? అని అడుగుతున్నావా?' అన్నది. ఏమంటారు సందర్భం సరిపోయిందికదూ!

యిలాటివాటిలో మరీ చక్కనిది యింకోటి.

'బ్రహ్మచెవుడురా వాడికి' అంటారు.

యీ 'బ్రహ్మచెవుడు' అన్నది ఎలా వచ్చింది? దీనికి ఏమిటి అర్థం? కాస్త ఓపికగ చదవండి. వ్యాఖ్యానిస్తున్నాను.

విశ్వంఅంత ఒకటే జలమయం. విరాట్పురుషుడు యోగనిద్రలో ఉన్నాడు. కొంచెం తెలివి తెచ్చుకుని సృష్టి చెయ్యాలని అనుకున్నాడు. అంతకాలం నీళ్ళల్లో నిద్రించి ఉన్నాడామరి! బొడ్డున ఒక తామరతీగ మొలిచింది. అది ఒక పువ్వుపూసింది. దాన్లో బ్రహ్మ పుట్టుకునివచ్చాడు. బ్రహ్మ యిటూ అటూ చూశాడు. అంతా జలమయం. తానెవరో, ఏమి చెయ్యాలో తనకే తెలియలేదు. ఇటూ అటూ బిత్తరపోయి చూస్తున్నాడు. అంతలో

తప! తప! అని వినిపించింది. ఆహా! అనుకున్నాడు. తపస్సు చేశాడు. తనలో ఏదో కదిలింది. ఆ అనుభూతిలో దృష్టి లోపలికి మళ్లించుకున్నాడు. విరాట్పురుషుడు దర్శన మిచ్చాడు. సృష్టికార్యం ఉపదేశించాడు.

అమ్మయ్యా! ధన్యుడ నయా ననుకున్నాడు బ్రహ్మ. విరాట్పురుషుని ఆజ్ఞప్రకారం ఏవేవో శక్తులన్నీ బ్రహ్మకి వశమయాయి. సృష్టి చేశాడు.

రకరకాల జీవరాసులు ఉద్భవించాయి. బ్రహ్మకి సంసారం పెరిగింది. మొదట తానెవడో తనకి తెలియలేదు. అప్పుడు ఏకాకి. సృష్టి పెరిగాక బ్రహ్మాండమైన సంసారంతో పెద్దవాడైపోయాడు. అలా కొంతకాలం గడిచింది. దినదినమూ సృష్టికార్యంతో బుర్ర వేడెక్కింది. నవనాళాలూ పీకుతున్నాయి. చేతుల్లో బలం తగ్గింది. ఆవలించాడు. అనుకోకుండా కళ్లు వాలిపోయాయి. ప్రక్కనే కూర్చుని పిచ్చాపాటీ నడుపుతూన్న సరస్వతి భర్త అన్నీ వింటూనే ఉన్నాడని కథలు ఏవో చెప్పుకునిపోతూంది.

సృష్టి తలకిందులైపోయింది. మళ్లీ అంతటా నీళ్లు ముంచుకువస్తున్నాయి. బ్రహ్మగదిలోకికూడా నీళ్లు వచ్చాయి. సరస్వతి యిటు తిరిగి చూసింది.

'ఏమండీ! నీళ్లు! నీళ్లు. లేవండి! అని ఆదరా బాదరాగా లేపింది. బ్రహ్మ కదల్లేదు, మెదల్లేదు. ఆ మహాకల్పం ముగిసిపోయిందని ఆమె అనుకోలేదు. గొంతుచించుకుని పెడబొబ్బలు పెట్టింది. బ్రహ్మ అటుంచి యిటు కొంచెం ఒత్తిగిల్లి

'ఏమిటి విశేషం!' అని అడిగాడు. 'అదేమిటండీ! ఎంతపిల్చినా లేవరు? అంత చెవుడు ఎలా వచ్చిందీ!' అని విడ్డూరంగా అడిగింది.

సరస్వతీదేవి మాటలు విని ప్రక్కనున్న నారదుడు.

'అమ్మా' ఎందుకా గాభరా! అది బ్రహ్మచెవుడు. నాయనగారి స్వభావం అని అన్నాడు నవ్వుతూ.

అదే 'బ్రహ్మచెవుడు' అయింది. డప్పులు కొట్టినా కొందరు చెవుడున్నవాళ్లు చలించకుండా కూర్చుంటారు. అలాటివాళ్లకి యీ

'బ్రహ్మచెవుడు' ఒక బిరుదయింది....యీలాటి వాక్యాలే కొన్ని సామెతలుగానూ, సంస్కృతం వారి పరిభాషలో 'న్యాయాలు'గానూ చలామణీ అవుతున్నాయి.

ఘట్టకుటీ ప్రభాతన్యాయం. చక్కని న్యాయం.

ఒక బండివాడు సరుకు వేసుకుని ఎక్కడికో ప్రయాణమయాడు. అర్ధరాత్రి, కటికచీకటి. అల్లంతదూరంలో మినుకు మినుకుమని దీపం కనిపించింది. ఎదురుగా ఒకబండి వచ్చింది.

ఏమిటయ్యా! అదేమిటి? అని అడిగాడు. అది పన్నులు వసూలు చేసే ఘట్టం అన్నాడు ఎదురుగావచ్చిన బండివాడు. పన్ను ఎగవేయాలనే దుర్బుద్ధి పుట్టింది యీ బండివాడికి. బండిదిగి నాలుగడుగులు ముందుకువెళ్ళి రాచబాటకి ఇటూఅటూ పరీక్షగా చూశాడు. కుడిచేతివైపు ఒకదారి కనిపించింది. బండివాడు పొంగిపోయాడు. యీదారంటపోతే ఆ ఘట్టకుటీని తప్పించుకోవచ్చు అని అనుకున్నాడు. ఆదారికి మళ్ళించాడు బండి. మహా సంతోషంగా వెళ్తున్నాడు ఆదారిలో. వెళ్ళగావెళ్ళగా తూరుపు తెల్లవారింది. తెల్లవార్లూ ఆ బండి మారుదారినే నడిచింది. ఇక ఆ పన్నులగుడిసె తప్పించుకున్నట్టే అనుకున్నాడు. ఆదారి సరాసరి రాచబాటకి కలిసింది. అప్పటికి బాగా తెల్లవారింది. బండి తిన్నగా ఆ గుడిసె గుమ్మందగ్గరకు వెళ్ళింది. పన్ను వసూలు చేసేవాడు వచ్చి,

'పన్ను చెల్లించు' అన్నాడు. బండివాడు నోరు తెరుచుకుని గుడ్లు అప్పగిస్తూ నిలబడిపోయాడు. రవంతసేపు అయింది. మూలుగుతూ, ముక్కుతూ పన్ను కట్టేసి వెళ్ళిపోయాడు. ఇదే

'ఘట్టకుటీ ప్రభాతన్యాయం'

పన్ను ఎగవేయాలని మారుదారిని అడ్డంగాపోయి రాత్రంతా గడపి తెల్లవారేసరికి ఆచోటికే చేరాడు పాపం!

దీనిని కవిసార్వభౌముడు ఎంతో చక్కనిస్థానం చూసి ఉపయోగించాడు చూడండి.

'ఇంద్రాగ్నియమ వరుణులలో ఎవనినో ఒకనిని వరించు' అని దూతగా వచ్చిన నలుడు దమయంతితో అన్నాడు. కాని ఆమె యిష్టపడలేదు. తన నిర్ణయానికి తిరుగులేదనీ, నలుణ్ణితప్ప యింకొకణ్ణి చేపట్టననీ, నలుడు పెండ్లాడకపోతే నలుడి పేరు మీదుగా ఉరిపోసుకునో, జలప్రవేశం చేసో, అగ్గిలోపడో మరణిస్తానని చెప్పింది. ఆ సందర్భంలో నలుడు అంటాడుకదా!

ఓ దమసహోదరీ! నువ్వు ఎంతచెప్పినా దేవతలను వరించననీ, చచ్చిపోతాననీ అంటున్నావే గాని అలా జరిగితే ఆ నలుగురిలో ఏ ఒకనినో నీవు చేరుకోడం తప్పదు.

"రజ్జువల్లరిమీద ప్రణయంబు గలదేని
అంతరిక్షంబేలు హరి వరించు,
అగ్నికాహుతిగాగ నాత్మగోరెదవేని
జాతవేదుని అదృష్టము ఫలించు,
సలిల ప్రవేశంబు సమ్మతించెదవేని
అంబుధీశ్వరుడు పుణ్యంబుసేయు,
ఎబ్భంగి ప్రాణ ముపేక్షించితేనియు
వైవస్వతునికబ్బు వాంఛితంబు
ఘట్టకుటికా ప్రభాతంబు క్రమమునంది
దమసహోదరి! నీకు నయ్యమరవరుల
నొల్లననియును పుదింబొందకుండరాదు
సమ్మతింపుము నామాట చలముమాని"

ఈ పద్యం శృంగారనైషధంలోది.

ఏవిధంగా మరణించినా వారిలో ఒకనిని చేరడం తప్పదు. కనక ఫలింపని పట్టుదల మానేసి శుభంగా యిప్పుడే ఏ ఒకనినైనా పెళ్ళిచేసుకో - అన్నాడు. ఇక్కడ ఎంత బందోబస్తుగానో

ఘట్టకుటీ ప్రభాతన్యాయం

చోటుచూసుకున్నది.

యీనాడు పత్రికలలోనూ, ప్రముఖుల ఉపన్యాసాలలోనూ 'విద్యాస్థాయి దిగజారిపోయింది'— అనేనినాదం అందరికీ కొట్టవచ్చినట్టు తగులుతూంది. నేను సాహసించి అడుగుతాను ఒక్కమాట. ఆస్థాయి పెరగడానికి ఏమిటి ఉపాయం? అది ఎందువల్ల దిగజారిపోయింది? — సమాధానం అంత తేలికగా రాదు.

మన మాతృభాష తెలుగు. తెలుగుకి సంస్కృతభాష తొమ్మిది వందల సంవత్సరాలనుంచీ అంగరక్షగా వస్తూంది. ఈనాడు తెలుగుభాషకి పెట్టిన పేరు ఎంత విడ్డూరంగా ఉందో ఎవరేనా పరామర్శించారా?

'ప్రాంతీయభాష.'— ఆ మహాబిరుదం చిత్తగించారా? ఏ మహానుభావుడు. ఏ విషపుగడియలో తగిలించాడో యీబిరుదు. అర్థంలేని బిరుదు.

ఇక సంస్కృతం ఏనాడో మృతప్రాయం అయిపోయింది.

జాతీయత ముద్రకొట్టినట్టు ఉండే తెలుగుకిగాని, భారత సంస్కృతికి, సంప్రదాయానికీ వైదేశికులచేత కూడా నివాళు లెత్తించిన సంస్కృతానికిగానీ యింతదురవస్థ పట్టడం ఎందువల్ల? విజ్ఞులు ఆలోచించండి.

మన భాషలో ఆనోటా యీనోటా మరుగుపడిఉన్న నుడికారాలను యీనాడు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూన్న విద్యార్థులకు తలకి పట్టేట్టుచెయ్యాలి. మాతృభాషలో ఉన్న గ్రంథాలను చదవాలిఅనే అభిరుచి నేటి విద్యార్థికి కలిగేట్టు చెయ్యడం తెలుగు పాఠ్యం బోధించే ఉపాధ్యాయుని బాధ్యత. దానికితగిన ప్రోత్సాహం యివ్వడం ప్రభుత్వధర్మం. పట్టుమని పది వాక్యాలు సచమత్కారంగా మాతృభాషలో మాటాడలేక, వ్రాయలేక చదివేచదువు, చదివించే చదువువల్ల ప్రయోజనం? ★

నాగార్జున సాగరము

కన్నెకంటి వీరభద్రాచార్యులు

(పల్నాటి సోదరకవులు)

౧

అదిగో కాల్వలు కాల్వలై కదలి బ్రహ్మాండంబుగాఁ బారను
న్నది నాగార్జున సాగరంబు - సకలాంధ్రక్షోణి కాహార సం
పదలం బెంపొదవింప - దివ్యమధురాంభఃపూర్ణ ధారల్ మహా
భ్యుదయధ్వానములం బయల్వెడల - విద్యుచ్ఛక్తి మిన్నంటఁగన్.

౨

బక్కవారల నొక్కినొక్కి బ్రుక్కఁగఁ జేయు
నినుపగజ్జలతల్లి నీడ్చికొట్టు
కటకటంబెట్టు లోకమును దాకదొడంగు
కాటకంబులఁజుట్టి వేటలాడ
క్రమ్మి బ్రహ్మాండమున్ గానరానటుచేయు
కాఱుఁజీకటిఁ దారుమారొనర్ప
తినక త్రాగక వృద్ధిఁగని ప్రజం బాధించు
ఋణభూత తతిని మారణము సలుప
రాతినేలలలో నవ్యరాజనాల
రాసులంజూప నాకటీరట్టు బాప
నవతరించిన సిద్ధ నాగార్జునాఖ్య
సాగరంబున కిడవోయి! స్వాగతంబు.

౩

నిలువెల్లం బులకింపఁ గన్పడునులే? నీ నేత్రపర్వంబులై
లలితాకారములై మనోహరములై లావణ్యధామంబులై
జలధారావృతముల్ సమస్త ఫల సస్యశ్యామల క్షేత్రముల్
బలపూర్ణంబులు కర్షకాభరణముల్ బంగారు మాగాణముల్.

సకల కర్షక వీరులకుఁ గల్పవృక్షంబు
కార్మికావళికి బంగారుకొండ
బుద్ధిజీవులకు సంపూర్ణ మానధనంబు
శిల్పవేదులకు సంజీవకరణి
మహిళా మణులకు సమ్యక్పారిజాతంబు
కూలి రైతులకు ముంగొంగు పసిఁడి
లతకళాకారులకు గామధేనువు
పశుగణంబులకెల్ల పంటచేను
అమృతకలశము వివిధద్విజావళులకు
రత్నకోశంబు సర్వాంధ్రరాజ్యరమకు
రంగదుత్తుంగ భాస్వత్తరంగ మాలి
కాంబు పూర్ణంబు నాగార్జునార్ణవంబు

౫

సకలజ్ఞుల్ మనదేశనాయకులు భాస్వత్పంచవర్షప్రణా
ళికలన్ జేర్చిరి దీక్షతో - జయముకల్గెన్ - దివ్యశబ్దమ్ముతో
నిఁక నాగార్జున సాగరమ్ము కడుహాయింగూర్చు నా చంద్రతా
రకమై నిల్చుచుఁ గాంతివెల్గుచు మహాంధ్రక్ష్మాత లైశ్వర్యమై.

పారించెదవుగాక పలురకాల పొలాల
చవులూరుచుండు కృష్ణాజలమ్ము
నారగింతువుగాక నోరూర సతతంబు
నోలలాడెడు రాజనాలపంట
నెలకొల్పెదవుగాక విలువఁ జెన్నలరారు
రమణీయ సుమఫలారామములను
పోషించెదవుగాక బుధ పుంగవులు మెచ్చ
వెలకసాధ్యములైన లలితకళల
కరుణతోఁ జూచెదవుగాక యిరుగు పొరుగు
పేద సాదుల నెంతయో మోదమొప్ప
నిలిపెదవుగాక వన్నెచిన్నెలను గూర్చి
యాంధ్రజనయిత్రి రత్నసింహాసనమ్ము.

ప్రగతి పథంలో....

(జిల్లాలనుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలనుగూర్చి సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు

సంగీత, నాటక గోష్ఠి

ఆదిలాబాదులో జరిగిన తృతీయ సంగీత, నాటక గోష్ఠిలో "బంగారుభూమి" అను నాటకం ప్రదర్శించిన మంచిర్యాల ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి లభించింది. శ్రీ వరదాచారికి ఉత్తమనిర్వాహణకూ, శ్రీ రామయ్యకు ఉత్తమనటనకు బహుమతులు వచ్చాయి. వీరిరువురూ చిన్నూరు ఉన్నత పాఠశాలకు చెందినవారే.

అనంతపురం

కుటుంబ నియంత్రణం

ప్రణాళికా కాలంలో జిల్లాలో తెరిచిన కుటుంబ నియంత్రణ సలహా కేంద్రాలవల్ల 20,000 మంది ప్రజలు సహాయంపొందారు. అనంతపురం ఆసుపత్రిలో యీ సంబంధమైనవి 330 శస్త్ర చికిత్సలు చేయబడినవి.

చిత్తూరు

పశువుల ఆసుపత్రి

తిరుపతి ఆంధ్ర పశువైద్య కళాశాలకుచెందినఆసుపత్రిభవనానికి రాష్ట్ర పశుగణాభివృద్ధి శాఖామంత్రి 1960 డిసెంబరు 17 న ప్రారంభోత్సవం చేశారు.

కడప

కోడూరులో పరిశీలక బృందం

ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పే ప్రతిపాదనలను పరిశీలించి, నివేదిక సమర్పించడానికై కేంద్ర ప్రభుత్వం నియమించిన వ్యవసాయ విశ్వవిద్యాలయ బృందం వారు 1960 డిసెంబరు 27న పండ్ల ఉత్పత్తి కేంద్రమయిన కోడూరు సందర్శించారు.

తూర్పు గోదావరి జిల్లా

క్షామ సహాయక చర్యలు

ఈ జిల్లాలో క్షామ నివారణ చర్యలకై మొత్తం రు. 1.70 లక్షలు మంజూరు చేయబడింది.

గుంటూరు

లిఫ్ట్ ఇరిగేషన్ పథకం

1960 డిసెంబరు 19న బాపట్లలో విద్యుచ్ఛక్తి పంపుసెట్ల మీటనొక్కటం ద్వారా రాష్ట్ర ప్రణాళికా మంత్రి మాంబ్రోలు వారి పాలెం సహకార లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రారంభోత్సవం చేశారు. ఈపథకం మూలంగా 1000 ఎకరాలలో వరి పంట పండించ వీలవుతుంది.

హైదరాబాదు

గ్రామాలకు విద్యుచ్ఛక్తి విస్తరణ

హైదరాబాదు జిల్లాతో సహా మొత్తం ఏడుజిల్లాలలో 48 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సప్లయి చేసేందుకై రాష్ట్రవిద్యుచ్ఛక్తి బోర్డు రు. 40,91,310 లు మంజూరు చేసింది.

జిల్లా క్రీడోత్సవాలు

1961 జనవరి 10న జిల్లా క్రీడోత్సవాలు ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధాన కార్యదర్శి విజేతలకు బహుమతులు పంచిపెట్టారు.

కరీంనగరం

జిల్లా క్రీడోత్సవాలు

జిల్లా క్రీడోత్సవాలు యీ ప్రాంతంలో మొట్ట మొదటి సారిగా 1960 డిసెంబరులో నిర్వహించబడినాయి. ఫుట్ బాలులో స్టార్ క్లబ్ కూ, హాకీలో జిల్లా పోలీసుక్లబ్ కూ ప్రథమ బహుమతి లభించింది. ఈ రెండు జట్లు కరీంనగరానికి చెందినవే.

రోడ్లు పనులు

గ్రామ సహాయక కార్యక్రమం క్రింద జిల్లాలో రోడ్డు పనులు చేపట్టడానికై ప్రభుత్వం రు. 4.5 లక్షలు మంజూరు చేసింది.

ఖమ్మం

జిల్లా విద్యావారోత్సవం

జిల్లా సెకండరీ పాఠశాలల క్రీడోత్సవాలు, విద్యా విషయిక సమావేశం ఖమ్మంలో జనవరి 5 నుండి 10 వరకు జరిగాయి.

కృష్ణా

హరిజన దినోత్సవం

నూజివీడు పంచాయతీలోని వేలేరులో 30.12.1960 న హరిజన దినోత్సవం జరుపబడింది. ఆరోజున గ్రామంలోని వీధులు, బావులు అన్నీ పరిశుభ్రం చేయబడ్డాయి.

కర్నూలు

మూడు రోజుల మేలా

జనవరి 3 నుంచి 5 వరకు యెమ్మిగనూరు పంచాయతీ సమితి మేలా జరిపింది. ఈ సందర్భాన ఒక పశు ప్రదర్శనం కూడ యేర్పాటు చేశారు.

మహబూబునగరం

దేవరకొండలో బ్లాక్ మేలా

జిల్లా కలెక్టరు దేవరకొండలో డిసెంబరు 27న బ్లాక్ మేలాను ప్రారంభించారు.

ప్రదర్శన తిలకించడానికి 20,000 ప్రజలరాక

1960 డిసెంబరు నెలలో మహబూబునగరంలో యేర్పాటు చేసిన చేతిపని వస్తువుల ప్రదర్శనను 20,000 మంది ప్రజలు తిలకించారు.

ప్రాంతీయ సంగీత, నాటక గోష్ఠి

జిల్లా ముఖ్య నగరంలో నిర్వహించిన సంగీత, నాటక పోటీలలో మహబూబునగరం మాధ్యమిక—ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతిని గెల్చుకున్నది.

చాపల తయారీ

1960 అక్టోబరు మాసాంతానికి యెనగొండ చాప అల్లిక దార్ల సహకార సంఘంవారు 2442 చాపలు తయారుచేశారు.

జిల్లా సంగీత, నాటక గోష్ఠి

1960 డిసెంబరు 21, 22 తేదీలందు మహబూబునగరంలో నిర్వహించిన జిల్లా సంగీత, నాటక పోటీలలో కొడంగల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి వచ్చింది.

సహాయక ప్రదర్శన

అమనగల్ పంచాయతీ సమితి కార్యాలయ ఆవరణలో 1960 డిసెంబరు 7న "అడుగు జాడలు" అనే నాటకాన్ని ప్రదర్శించారు. నాటకానికి వచ్చిన వసూళ్ళు స్థానిక జిల్లాపరిషత్తు పాఠశాలను అభివృద్ధి చేసేందుకు వినియోగిస్తారు.

వెనుకబడిన తరగతుల సమావేశం

మహబూబునగరం జిల్లా వెనుకబడిన తరగతులు, హరిజనుల సమావేశాన్ని డిసెంబరు 31న గద్వాలలో రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి ప్రారంభించారు.

మెదక్

విద్యుచ్ఛక్తి సప్లయి

దుబ్బాక బ్లాకులోని తిమ్మాపురం గ్రామానికి జనవరి మొదటి వారంలో విద్యుచ్ఛక్తి సౌకర్యం ప్రారంభించటం జరిగింది. ప్రారంభోత్సవంలో రాష్ట్ర లఘుపరిశ్రమల మంత్రి పాల్గొన్నారు.

నల్గొండ

జిల్లా ప్రదర్శన

జిల్లా టోర్నమెంటు, ప్రదర్శక సంఘం వారి ఆధ్వర్యాన నల్గొండలో జనవరి 3 నుంచి 6 వరకు ప్రదర్శన ఏర్పాటు చేయబడింది.

ఉన్నత పాఠశాలలు, బేసిక్ శిక్షణ, మాధ్యమిక పాఠశాలలు అన్నీ ఆటలపోటీలలో పాల్గొన్నాయి. పోటీలలో నెగ్గినవారికి జనవరి ఆరవ తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, శ్రీ యం. పి. పాయ్, బహుమతులను పంచిపెట్టారు.

పశువుల ఆసుపత్రి

సూర్యాపేటలో ఈ మధ్యనే రు. 23,000 ల ఖరీదుచేసే పశువుల ఆసుపత్రి భవనం ఒకటి నిర్మించటం పూర్తయింది.

నెల్లూరు

హరిజన దినోత్సవం

ఉదయగిరి పంచాయతీ సమితి బ్లాకులోని సోమశేగడ

గ్రామంలో హరిజన దినోత్సవం జరిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామయువకులు సిక్కులు ఉత్సవంలో పాల్గొన్నారు.

నిజామాబాదు

విద్యుచ్ఛక్తి సప్లయి

నిజామాబాదుకు సమీపంలోని గోరుగొప్ప గ్రామానికి డిసెంబరు 18న జిల్లా కలెక్టరు మీటనొక్కి విద్యుచ్ఛక్తి సప్లయిని ప్రారంభించారు.

భవన నిర్మాణం మంజూరు

నిజామాబాదులో హిందీ బోధనా భాషగా వున్న ఉన్నత పాఠశాల, ఆదర్శ హిందీ విద్యాలయానికి భవన నిర్మాణానికై రు. 34,41,8 ల గ్రాంటును రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసింది.

శ్రీకాకుళం

పశుచికిత్సా కేంద్రాలు

రామభద్రపురం సమితి ప్రాంతంలోని పాచిపెంట, రేగ గ్రామాలలో డిసెంబరు 22న పశువైద్య ప్రథమ చికిత్సా కేంద్రాలు తెరిచారు.

విశాఖపట్నం

పంచాయతీ రాజ్యం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య వికేంద్రీకరణం పనిచేస్తున్న విధానాన్ని పరిశీలించేందుకై కేంద్ర సమాజాభివృద్ధి, సహకార మంత్రిత్వ శాఖ ఒక పథకాన్ని ఆమోదించింది. ఈ పథకం చేపట్టడానికై అడ్వాన్సు రూపంలో రు. 30,000 లు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మంజూరు చేసింది.

శిక్షణా శిబిరం

రోలుగుంట పంచాయతీ సమితి ఆధ్వర్యాన డిసెంబరు 28 నుంచి 30 వరకు కూసర్లపూడిలో గ్రామ సహాయకుల శిక్షణా శిబిరం నిర్వహించారు.

వరంగల్లు

వెనుకబడిన తరగతులవారికి ఉపకార వేతనాలు

జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో చదివే వెనుకబడిన తరగతులు, షెడ్యూలు కులాల విద్యార్థులకు ఉపకార వేతనాలను ఇప్పించేందుకై జిల్లా పరిషత్తు రు. 56,000 ల మొత్తాన్ని మంజూరు చేసింది.

వెనుకబడిన తరగతులవారికి వసతిగృహం

వరంగల్లులో ఈ మధ్యనే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిణి వెనుకబడిన తరగతులవారి వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి రు. 70,000 అవుతుందని అంచనా.

ప్రాథమిక పాఠశాల భవనం

డిసెంబరు మొదటి వారంలో తాటికొండ గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ భవనం రు. 15,300 ల వ్యయంతో నిర్మించారు. ఇందులో నాలుగోవంతు ప్రజలు విరాళాల రూపంలో ఇచ్చారు.

పశ్చిమ గోదావరి

ఆరోగ్య కేంద్రం ప్రారంభం

డిసెంబరు 25న మంచిలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

చేతిపనుల వారోత్సవం

ఆరవ అఖిలభారత చేతిపనుల వారోత్సవ సందర్భంగా డిసెంబరు 5 నుంచి ఒక ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. నర్సాపురం లేసులు, జంపఖానాలు మొదలైనవి ప్రదర్శించబడినవి.



పంచాబ్దప్రణాళికలు

కల్లూరి భోగేశ్వర సోమయాజులు

1

పంచాబ్దపు ప్రణాళికల
పరమార్థం తెలుసుకోర
భారతీయుడా !

గగనానికి ఎగిసిపడే
నదులన్నీ సాధువులై
నడచివచ్చు నీ వెనుకనె,
కదలివచ్చు నీ తోడనె
కఱవులింక కలుగవుగా
పరువులింక పెరుగునుగా. ॥పంచా॥

2

పల్లెలలో పిల్లలింక
పసుల కాచుకొనుట మాని
పాఠాలను వల్లెవేయు
భాగ్యాలిక కలుగునుగా
ఎడంచేతి వేలిముద్ర
ఎందున కనుపించదుగా. ॥పంచా॥

3

ఊరేలేవాడొకడు,
కూలడిగేవాడొకడు,
కష్టించేవాడొకడు,
కరుణించేవాడొకడు,
అంతస్థుల భేదాలిక
అంతరించి పోవునుగా. ॥పంచా॥

5

ఉన్నదంత ఖర్చుచేసి
విద్యలెన్ని చదివినా,
ఉద్యోగం లేదంచును
వాపోయే జీవులింక
మందుకైన కనుపించని
మంచిరోజు లొచ్చెనుగా. ॥పంచా॥

4

యువకులింక సోమరులై
అరుగు లరుగునట్లుగా
పేకాటల నాడుకొంచు
డంబాలను పలుకుకొంచు
పాడైపోయెడి రోజులు
పోయెనుగా ! పోయెనుగాపోయెనుగా! !
॥పంచా॥

---

1. ప్రాజెక్టులు కట్టబడును. 2. ఊరూరా విద్యాలయములు నెలకొలుపబడును. 3. వ్యక్తులలో నున్న పరస్పర తారతమ్యములు తగ్గింప బడును. 4. నిరుద్యోగ సమస్య తీరగలదు. 5. యువకులలో సోమరితనము పనికిరాదు. నడుమువంచి పనిచేయవలయును (అని భావము.)

కథానిక :

చదువుకున్నందుకు ......

పీ రా జీ

కారుదిగి టకటక యింట్లోకివచ్చి, స్టెతస్కోపూ, మెడిసిన్ ఛెస్టూ బల్లమీద దిగవిడిచి, టై విప్పుకుంటూ డ్రాయింగ్‌రూము దాటి గదిలోకి వచ్చాడు సోమశేఖరం.

ఆయా మరియమ్మ అప్పుడే పాప సుగుణ ప్రక్కన తలగడ పెట్టి అవతలికి వెళదామని కాబోలు లేస్తున్నది. రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయేడు సోమశేఖరం.

ఆయా కూడా యజమాని రావడంతో ఒదిగి అక్కడే నించుండి పోయింది.

"అమ్మగా రేరీ? మరియా!"—అతను పాప దగ్గిరగా వెళ్లి, నిద్దురపోయే చిన్నారి మోము నొక్కసారి నిమిరి అడిగేడు.

"ఇవాళ సాయంత్రమే ఏదో సమావేశం అని చెప్పి వెళ్లేరు బాబూ! కారు మిమ్మల్ని దింపగానే తెమ్మని డ్రైవరుకి చెప్పేరుండీ" వినయంగా చెప్పింది మరియా.

"చిట్టితల్లి పోరుపెట్టకుండా పడుకున్నదా" అతని కంఠంలో ఆవేదనా, విసుగూ రెండూ ధ్వనించేయి.

ఆయా ఏం చెప్పగలుగుతుంది. నిజం చెబితే యింటి యిల్లాలికీ యజమానికి దెబ్బలాట తప్పదు. అది తన వుద్యోగాని కంత క్షేమమూ గాదు. "లేదుండీ" అన్నది.

'ఉస్సుర'ని సోమశేఖరం డ్రెస్సింగ్ రూంలోకి పోయేడు. శారద బి. ఏ. చదివిందని ముచ్చటపడి కట్టుకున్న సంగతి తల్చుకుంటే పీక పిసుక్కుంటున్నట్లు వుంటుంది.

తను డాక్టరు. ఎనిమిది గంటలు వుద్యోగం చెయ్యడం...ఆ తర్వాత ఓవర్ టైం అనడం, ఆదివారాలు హాయిగా నిద్దరపోయి వుదయం తొమ్మిది గంటలకి లేవడం లాంటివి వుండవు సరిగదా, ఇరవైనాలుగు గంటల్లో ఏ క్షణాన ఐనా ధర్మానికీ వృత్తిరీత్యా వున్న బాధ్యతకీ కట్టుబడవల్సిందే.

తను ఎం. బి. బి. యస్. అయినందుకు తనకు రాబోయే ఇల్లాలు కనీసం బి. య్యేవో, బి. యస్.సీ వో అవకపోతే ఎలాగ అని ఆరాటపడ్డాడు సోమశేఖరం సుమారు ఆరేళ్ల క్రితం.

తన కోరిక ఫలితంగా తన తండ్రి తల్లిమాట కాదని యీ సంబంధం స్థిరపరిచేడు.

శారద బి. ఏ. చదివింది. ఎర్రని ఛాయ. నిండైన విగ్రహం. మంచి సంప్రదాయం అనుకొని సోమశేఖరం తల వూపాడు.

తల్లి మూడేళ్ల క్రితంవరకూ, ఇక ఆర్నెల్లకు ఇహలోకయాత్ర చాలిస్తుందన్నంతవరకూ "నా మాట కాదన్నావ్ నా అన్న కూతుర్ని కాలదన్నావ్....ఈ చదువుకున్న సరస్వతిని కట్టుకున్నావ్.... నీ పిల్లలగతేమవుతుందో నీకిప్పుడు తెలీదురా అబ్బాయ్...." అని హెచ్చరిస్తూ వుండేది.

నిజంగా అతగాడికి యిప్పుడు పిల్లల గురించే బెంగగావున్నది. శారద అంటే అతను ప్రాణం పెడతాడు. పోతే ఆమెకూడా కాస్త డాంబికానికి దర్పానికి పాటుబడే పిల్లతప్ప....తతిమ్మా ఏ విషయంలోనూ, ఆమెకి వంకలు పెట్టడం యెవరికీ తరంగాదు.

సోమశేఖరంపెళ్లి తను వుద్యోగంలో జాయినయిన ఏడాదే అయ్యింది.

శారద రాకతోనే అతని అదృష్టం పుష్పించింది.

మలి సంవత్సరమే అతగాడు ప్రాక్టీసు పుంజుకుని వుద్యోగం వదిలేసేడు.

శారద తండ్రి అగర్భ శ్రీమంతుడు. ఆమెకి ఒక కారుకూడా అరణమిచ్చేడు.

ఆమె మొదటినించీ చాలా సర్దాలువున్న పిల్ల. పిక్‌నిక్‌లూ,

షైర్లూ తిరగమనేది భర్తని. అతనుకూడా రెండేళ్లు చాలా హాయిగా దొర్లించేసేడు.

అటు తర్వాత పెద్దవాడు రఘు పుట్టడం....తన ప్రాక్టీసు గూడా ఎక్కువ అవడంచేత తీరికలేమి శారదనే వొంటరిగా క్లబ్బులకీ, షికార్లకీ పొమ్మనేవాడు కూడాను.

శారద అల్లరిపెట్టి ఆయాను పెట్టింది రఘూకి. ఇప్పుడు రఘూకి నాలుగో ఏడు. ఐనా వాడు అంత ఎత్తిర్లలేదు. పీలగా నజ్జుగా వుంటాడు.

తరువాతది సుగుణ. దీనికి పూర్తిగా ఆయా పెంపకమే అయింది. దరిమిలాన శారద మహిళామండలి సెకరట్రీ అవడమే అందుకు కారణం.

సోమశేఖరం ఆలోచిస్తూ డైనింగ్ టేబిల్ దగ్గర కూచున్నాడు. ఇదంతా శారదచేసిన కృత్రిమమైన జీవితం అనుకొని విసుక్కున్నాడు.

మంచి టైలరు కుట్టిన యింగ్లీషు సూటు తన వొంటిమీద హత్తుకొని అమరినట్లు, తతిమ్మా అన్ని విదేశీ నాగరికతలు మనకి అబ్బవు....మనపట్ల రాణించవు. ఏమిటో శారదకి తను చదువు కున్నాను...తన హక్కులూ వీటి గొడవ తప్ప యింకేమీ తెలియవు. జుట్టులోనికి వేళ్లు పోనిచ్చి కూచున్నాడు సోమశేఖరం.

ఇంతలో అవతల కారు ఆగడం తర్వాత తలుపు ధభేలున వేసిన చప్పుడవడం....మరికొన్ని క్షణాలకు శారదా, ఆమె వెనక రఘు నెత్తుకుని డ్రైవరూ లోపలికి వచ్చేరు.

సోమశేఖరం ఏమీ మాటాడలేదు. తీవ్రంగా శారదకేసి చూసేడు. ఆమె హెయిర్‌పిన్నులు తీసి డ్రెస్సింగ్ టేబిల్‌మీద పడవేస్తూ "మీరింకా భోంచేయనేలేదా....నాయర్ వడ్డించేసే వాడేనే" అన్నది.

"బాబు నెందుకు తీసికెళ్లావు....వాడి హెల్త్ అసలే డెలికేట్ అని తెల్సుకదా నీకు ?"

ఆమె భోగట్టాకి సమాధానంగా శేఖరం వేసిన ప్రశ్న అది.

"మరి ఏం చెయ్యనేమిటి ? వెళుతున్నప్పుడు వాడు వొకటే మంకుపట్టు పడితేనూ....అయినా యిప్పుడు వాడికి కలిగిన స్ట్రెయిన్ యేమిటీ ?" అని బాబుని పడుకోపెట్టి నించున్న డ్రైవర్‌కేసి తిరిగి "ఉదయం ఏడు గంటలకే కారు సిద్ధం చెయ్యాలి....నువు వెళ్లు" అని చెప్పింది.

భర్త ముట్టుకుంటే పేలిపోయే బాంబులాగ కూచోడంచూసి శారద యేమీ మాటాడకండా వడ్డించింది.

పూర్తిగా నాలుగుముద్దలు మింగకుండానే అతను ఆగి "నువ్వు యిద్దరి పిల్లల తల్లివయ్యేవ్ శారూ....ఇంక ఆ క్లబ్బూ, సెక్రటరీ షిప్పూ వదిలేయకూడదూ" అని నిష్కర్షగా అన్నాడు.

"పిల్లలు పుట్టేరని క్లబ్‌మానమనడం భావ్యంగా లేదండీ మీకు....ముందు భోజనం చేయండీ....ఆనక అన్నీ మానేయ మందురుగాని" మరింత నెయ్యి వడ్డిస్తూ పొడిగా నవ్వి, ఆ విష యాన్ని తేలికగా నెట్టేద్దామని చూసింది.

ఐతే అది సాధ్యం అవనిపని అని గ్రహించడానికి ఆమెకి యెంతోసేపు పట్టలేదు. అతను చాలా సీరియస్‌గా వున్నాడు.

"నువ్వు క్లబ్బులకి వెళ్లి, షైర్లకీ వెళ్ళి యీ పిల్లల్ని బాధ్యతా రహితంగా వదిలేయడంచూస్తే....నాకీ ప్రాక్టీసు వదిలేసి యింట్లోనే వుండిపోదా మనిపిస్తూంది...." చెయ్యి కడుక్కుని లేచిపోయాడు సోమశేఖరం.

"సరే....మీ యిష్టం బాబూ ! అయినా నేనేం పిల్లల్ని అశ్రద్ధ చెయ్యడంలేదు....ఆయా దగ్గిర పెరిగినంతమాత్రాన వాళ్లని నేను నెగ్లెక్ట్ చేస్తూన్నానని అనుకోడం బావులేదు..."

శారద సాక్ష్యంలేకుండా వాదిస్తున్న లాయర్‌లాగ సమర్థించుకో జూసింది.

"లేదు శారదా...నీకు తెలీదు...యీ వయస్సులో పిల్లలకి కావల్సినది తల్లిమమత, తండ్రివాత్సల్యమూను...నువ్వు క్లబ్బు లనీ, స్త్రీ జనోద్ధారణ అనీ...నేను కేసులనీ తిరుగుతూవుంటే... మన యిద్దరికీ సుఖం లేకపోగా....పసివాళ్లిద్దరి భవిష్యత్తూ కంటకప్రాయ మవుతూన్నది..." భార్యకి బోధపరుద్దామని ప్రయత్నం చేసేడు.

అంతలో సుగుణ లేచింది. శారద దాన్ని పడుకోబెట్టి బుజ్జగింప జూసిందిగాని...అది కింక వదల్లేదు. సోమశేఖరం ముందుకి వొంగి బిడ్డని తన భుజంమీద వేసుకున్నాడు.

ఆ పసిది తండ్రి వొంటి వెచ్చదనం గుర్తించినట్లు, భుజంమీద వాలి నిద్దురోయింది.

శారద ఏమీ మాటాడలేదు. రఘుమంచంమీద కూచున్నది.

నిజమే బాబు రోజు రోజుకీ చిక్కిపోతున్నా డనుకుంది.

పోనీ తనీ పిల్లలు, సంసారం అని చూసుకుంటూ యింటి పట్టునే వుండిపోయి మందలీ ఆదర్శాలూ వదులుకుంటే....

దానికీ యీ జ్ఞానంలేని పిల్లలు చిక్కిపోదానికీ యేమైనా సంబంధం వున్నదా లేక కేవలం భర్త, అందరి భర్తలకుమల్లే తననూ కాళ్లూ చేతులూ కట్టి యింట్లోనే పారేద్దామని యిలాగ అల్లరిపెడుతున్నారా? అని ఆమె తర్కించుకో చూసింది.

తను సాయంత్రం పురుషులు వాళ్ళ మూర్ఖమయిన నిబంధనలూ, వాటిపిల్ల కొత్తకాపురాల్లో కలిగే కలతలూ వివరిస్తూ సుదీర్ఘమైన వుపన్యాసం యిచ్చింది.

ఆ కరతాళధ్వనులు యిప్పటికీ యింకా ఆమెచెవుల్లో గింగురు మంటున్నాయి. అక్కడ తను తనయింటి వ్యవహారం గురించి ఆలోచించనూలేదు, మాటాడనూలేదు.

శారద తన భర్తని ఎంతైనా ప్రేమిస్తుంది. కాని ఆమెకుగల రకరకాల ఆదర్శాలూ, ప్రిన్సిపల్సూ అడుగడుగునా తన గృహస్థ జీవితంలో కంటకప్రాయమవుతున్నాయి. అలాగే నెట్టుకుని వస్తున్నది.

పిల్లలు ఎప్పుడూ తల్లిదగ్గరా తండ్రిదగ్గరా వుంటే వాళ్ళకి విసుగుజనించడం, విలువ తగ్గిపోవడం జరుగుతుందనీ అలాగ గాకుంటా వాళ్లకి ఎప్పటికప్పుడు ఒకవింత అనుభూతి, ఒక కొత్తదనం యివ్వడానికి సాధ్యమయినంత ఎడంగా వుంచడం అవసరమనీ అంటుంది శారదమనస్సు.

"నన్ను ఆయా పెంచలేదు. మా అమ్మ కారులో క్లబ్బులకి వెళ్ళనూలేదు....మా నాన్నగారు మాకు టేబిల్‌మేనర్సు పెట్టితేనేగాని యింగ్లీషుఅబ్బదనీ ఎం. బి. బి. యస్ అవననీ కలలోకూడా అనుకుని వుండరు", సోమశేఖరం యిలాగఅని చాలాసార్లు శారదని వెటకారంచేసేవాడు. ఆమె ప్రిన్సిపల్స్‌ను తృణీకరించేవాడు.

అందులోని నిజానిజాలు గుర్తించడం శారదకి వుక్రోషంలో సాధ్యమయ్యేదికాదు.

సోమశేఖరం పాపనెత్తుకుని వచార్లుచేస్తున్నాడు. అతను మధురమైన ఆ పసిదాని స్పర్శలో కోపమూ అలసటా అన్నీ మరిచిపోయేడు.

అంతలో టెలిఫోను మ్రోగింది.

డాక్టరు శేఖరం "సిరికిన్ జెప్పడు" లాగ వెళ్ళిపోయిం తర్వాత శారద 'ఉస్సుర'ని నిట్టూర్చింది.

పగలు ఎలాగా పగలే.... గడియ పొందికలేదు. ఇకరాత్రుళ్లా యిదీవరస అనుకుంది.

ఆయా పెంపకం, తల్లివాత్సల్యం యింతవిసరైనా పొరకక పోడం, బాబు చిక్కిపోదానికీ, నజ్జుతనానికీ కారణమని సోమశేఖరం నమ్మకం. తను యివ్వగల యింజక్షన్లుగాని మందులు గాని వాడి మనోవ్యాధిని కుదర్చలేవు.

ఐతే బాబు తల్లినే అనుసరించి వుండడంగాని, తల్లికోసరం వాడు బెంగవడతాడన్న బాహ్యచిహ్నాలుగానీ కనిపించవు.

అందుచేతనే శారద ఒకవేళ భర్త తన నిరభ్యుదయవాదిత్వాన్ని యీ సాకుతో కప్పిపుచ్చలేదుగదా అనుకుంది.

ఆమెమాత్రం తల్లికాదా? ఆమెకిమాత్రం పిల్లలంటే మమకారంవుండదా?

కాని శారదకి తాను మహిళాలోకాన్ని వుద్ధరిస్తున్నాను అన్న గర్వంతోనూ పదేపదే భర్త తనతో పిల్లలవిషయంమీద వాగ్యుద్ధానికి తలపడడంచేరా, అది మరింత మరుగున పడిపోయింది.

రాత్రి రెండుగంటలకి కాన్పులు తిరిగివచ్చి పడుకున్నాడు సోమశేఖరం. అయినా వుదయం ఏడుగంటలకి అలారంలా లేచి పోయేడు.

లేస్తూనే సుగుణపక్కన చేరి పసిదాన్ని పలకరించి ఆడుకోడం మొదలెట్టేడు.

అంతలో వంటవాడు కాఫీతెచ్చి అందివ్వగా, అది అందుకుంటూ, అప్పుడే డ్రాయింగ్‌రూంకేసి వెడుతున్న శారదకి వినిపించాలన్నట్లు పసిపాప సుగుణ నుద్దేశించి శేఖరం అన్నాడు.

"తల్లీ! మన ఖర్మరా!....మిమ్మల్ని ఆయా పెంచుతుంది.... నాకు వంటవాడు తిండిపెడతాడు...ఇంక మీ అమ్మని ఎందుకు కట్టుకున్నట్లు....చెప్పుతల్లీ నువ్వైనా మీ అమ్మకి బుద్ధిచెప్పు"

అయితే మీకువంటకీ. మీ పిల్లల పెంపకానికీ తెచ్చుకున్న దాసీదాన్నన్నమాట నేను ...నా హక్కులు అవసరాలూ లేవన్న మాట అని విసుక్కుంది శారద. కాని భర్తకి, వినిపించనంత జాగర్తగా విసుక్కుంది.

తిరిగి ఎనిమిదిన్నరగంటలవేళ బాబునీ, పాప సుగుణనీ ఆయాకి జాగర్తచెప్పి వొప్పగించి వెడుతున్నవేళ సోమశేఖరం చాలాకోపంగా "శారదా" అని అరిచి. "నువ్వింకా యిలాగే

చేస్తూవుండు....యీ సంసారంగతి ఏ మవుతుందో చూద్దువుగాని" అన్నాడు.

శారదకూడా వెడుతున్నదల్లా వెనుదిరిగి బుసకొట్టినట్లు "వెది రించడం చెల్లిందికదాని మరీ దాసీదానిలాగ చూడకండి" అని సమాధానంచెప్పి మరీ గుమ్మందాటింది.

"నీ మీద నాకువున్న అభిమానమే అను, మోజే అనుకో అది నిలుపుకున్నకొద్దీ నాకు బాధతప్ప సుఖంలేదు.... పోతేపోనీ....నా సుఖం సంగతిఎదిలేయ్, యీ కుర్రకూనల్నియెందుకు కన్నామో.... వాళ్ల పట్ల మనకి బాధ్యత యెటువంటిదో గుర్తించు....మీ మహిళా మండలి సభ్యుల్ని...యీ ప్రశ్న వేసి మరీ యింటికిరా...."

చరాచరా అవతలికి విసురుగా వెళ్ళిపోయేడు.

శారద కారులోకూచుని దభేలున తలుపువేసుకుని, మహిళా మండలి భవనంముందు చిరచిరలాడుతూ దిగింది. అప్పటికీ ఆమెమనసు కుదుటపడలేదు.

నాడు పిల్లలూ - పెంపకం అన్న విషయంమీద, స్త్రీజనోద్ధారణ సంఘాధ్యక్షురాలైన ప్రఖ్యాత 'శకుంతలా సరళ' మాటాడింది.

శారద మనసు అక్కడలేదు. ఆమె ధ్యాసఅంతా తనపిల్లలి మీదికేవెళ్ళింది. మధ్యమధ్య భర్తసాధింపు గుర్తుకురాగా, ఆమె ఆ ఆలోచననించే తప్పించుకుంటామని ప్రయత్నించింది.

తిరిగివస్తూనే, బయట డిస్పెన్సరీగది ఖాళీగావుండడం లోపల అంతా సద్దుమణిగివుండడం చూసి విసియపడింది.

ఆయా మరియమ్మ అగుపించలేదు. వంటవాడు కనిపించడు. "నాయరూ" అని కేకవేయగా వాడు వచ్చి "అయ్యగారు బయటికి వెళ్లేరమ్మా" అన్నాడు.

"నీ మొహంలాగుంది.... మరి పిల్లలేమయ్యారు.... ఆయా ఎక్కడచచ్చింది....పదకొండున్నర అయ్యిందే వంట ఎక్కడ తగలెట్టావ్ ?"—

వాడు శారద తీవ్రధోరణకి తీక్షణదృక్కులుకీ తట్టుకోలేక నసుగుతూ.... "అయ్యగారు....అయ్యగారు....వద్దన్నారండీ.... హోటేళ్లో తింటారుటండీ" అన్నాడు.

శారదకి వుక్రోషమూ, అవమానంచేత కలిగిన బాధ పెన వేయగా వుచ్ఛ్వాస నిశ్వాసాల వడి ఎక్కువయ్యింది....మాట పెగలలేదు. మొహం కోపంతో ఎరుపై అంతలో నిస్సహాయతా, అవమానమూచేత నల్లగా కళావిహీనమైపోయింది.

నాయర్ని అవతలకి పొమ్మని అలాగే మంచంమీద వాలి పోయింది....భర్త ఎదురుగావుంటే ఆమె వాదించీ సాధించీ కేకలువేసేదేమో గాని ఎవరూ ఎదుటలేమి, ఆమెకళ్లల్లో గిర్రున నీళ్లుతిరిగేయి.

ఆమె అలాగ ఐదుక్షణాలు వున్నదో లేదో, సోమశేఖరం యిద్దరుపిల్లలను తీసుకునివచ్చాడు.

'నాయరూ' అని కేకేసి వాడిచేతికొక రెండురూపాయిల కాయితం యిచ్చేడు.

"మీ అమ్మగారికి కావాలంటే కారియరు తే, లేదా నువ్వు తినిరా ఫో" అన్నాడు.

శారదకి తల తీసినట్లయింది. అహంకారంతో తోకతొక్కిన వెయ్యిపడగల నాగయింది.

ఆమె యిప్పుడో గడియకో పగిలే అగ్నిపర్వతంలా వున్నది. మాటాడలేదు.

సుగుణనీ బాబునీ కూడా చేరదియ్యలేదు. వాళ్ళు దగ్గరికిరాగా, చీమలు ప్రాకుతూవుంటే దులుపుకోలేక నిర్సంగా వూరుకున్నట్లు వూరుకున్నది.

ఎంత సాహసం....

తనని నేతిలో ఈగని తీసిపారేసినట్లు పారేసి, యెంత అవమానం చేసేరు? ఛీ యీ మగాళ్ళదౌర్జన్యాలు మండా.... ఈ బానిసత్వంకన్నా నరకంమేలు, చావడం నయం....

భోజనం చేస్తానా... ఈ యింటికి తిండిలేక మొహంవాచి చేరేననుకున్నారు కాబోలు.... లక్షలు మూలుగుతున్నాయి మా తండ్రి యింట....ఛీ అక్కడకయినా పోవాలి....అదీ యింతకు రెండింతలయిల్లేనూ, యిదుగో యీ కుర్రకుంక లొకరు కదా.... అందుకే ఆయన కంత నిర్లక్ష్యం....

ఆమె బాధపడినకొద్దీ ఆలోచనచేసినకొద్దీ వెలితి యెక్కువ కాజొచ్చింది.

సుగుణ ఆమె రొమ్ములో తలదూర్చి "ఊఁ ఊఁ" మని పొడుస్తున్నది. బాబు ఆమె నడుంమీద తలఆన్చి ముందుకు వొంగి, ఎర్రనైన ఆమెకళ్లల్లోకి బేలగాచూస్తున్నాడు.

శారద వొక్కసారి ఉద్వేగంతో పిల్లలిద్దర్నీ, తనకి శక్తి వున్నంతవరకూ ఎద నదుముకుంది.

భర్తమీద బుసలుకొడుతూ....అతగాడు బయటికి వెళ్ళేదాకా దీర్ఘంగా ఆలోచిస్తూనేవుంది.

ఒక నిర్ణయానికి వచ్చింది. మరి తర్కించలేదు.

ఇదే సమస్య మరివొకరికి వచ్చి తనను సలహా అడిగితే ఏం చెప్పేదో అదే తనూ చెయ్యాలనుకుంది.

"వుహూఁ....తనయింట తన మాట చెల్లక తనంటే యెంత నిర్లక్ష్యం."

అది తల్చుకుంటేనే వెన్నెముక కరిగిపోయి శరీరమంతా కుప్పలా కూలిపోతున్నట్లవుతున్నది.

కారు తీసుకున్నది. డ్రైవర్నుద్దేశించి "నువ్వు మీ అయ్యగారి నౌకరువి....ఈ కొంప యీ సర్వస్వం మీ అయ్యగారివి...నెత్తి నెట్టుకుని వూరేగమను" అని తన పిల్లలిద్దర్నీ అందులో వేసుకుని పుట్టినింటికి పోయింది.

శారద తండ్రి జమీందారుకాడుగాని చిన్న పిల్లజమీందారీ వున్నంత శ్రీమంతుడు. ఒక కొడుకునింగ్లాండూ, మరో కూతుర్ని ఇండియాలోని బెనారసూ పై చదువులకి పంపించేడు.

రామా కృష్ణా అనుకుంటూ కాదుగాని భూమి పుత్రా, ఆదా యమూ గత్రా చూసుకుంటూ వుండడమే అతగాడి వ్యాపకం.

కూతుర్ని అకస్మాత్తుగాచూసి కొంచెం నివ్వెరపడి...అంతలో సర్దుకుని సంబరపడి మనుమల్ని ముద్దాడి కూతుర్నుద్దేశించి "ఏం? దేశోద్ధారణకోసరం మీ ఆయన అర్జెంటు కేసుమీద వెళ్ళేడా ఏం ... తానై రాలేకపోయాడు సరే పోనీ డ్రైవరెక్కడ చచ్చేడు?" అని అడిగేడు.

అక్కడ సోమశేఖరం మిన్నువిరిగి మీదపడ్డట్లు ఫీలయ్యేడు. అంతపని చేస్తుందనుకోలేదు. ఎంత దారుణం...

"ఎంతకైనా తగును? ఆఖరికి చిట్టితల్లినికూడా తీసుకు పోయిందన్నమాట. సరే వెళ్లమను ఎంతదూరం వెడుతుందో" అని బాధపడ్డాడు.

"తన కారు లేకపోతే వెనకటికి ముసలమ్మ—కుంపటీ కథలాగ నేను బ్రతకలేననుకుంది ఏం....వుహూఁ" అని విసుక్కున్నాడు.

వారంరోజులు బరువుగా వొక యుగంలాగ దొర్లాయి అతగాడికి.

చిట్టితల్లి ఎలావుందో...ఛీ దీన్ని పీకె పిసికినా పాపంలేదు ... బాబు ఎలా వున్నాడో... అక్కడ మాత్రం యిది వీళ్ల సంరక్షణ చేస్తుందీ అని నమ్మకం యేమిటీ !

శారదకి నాలుగురోజులు తిరగకుండానే మహిళామండలినించి వుత్తరం వచ్చింది.

బాధ్యతలను వదిలి వెళ్ళిపోవడం, అదీ అర్థమధ్యంతరంగా వెళ్ళిపోడం బావ్యంగా లేదని దాని సారాంశం.

శారదకి కూడా ఆ విషయంలో చెయ్యి విరిగినట్లయింది. ఎంతైనా బాధపడింది.

ఐతే ఆమెకి యిరవైనాలుగ్గంటలూ పిల్లలతోనే గడిచి పోవడంతో ఒక క్రొత్త అనుభూతి, వింతదైన అవ్యక్తానందం, అనుభూతికి వచ్చింది.

నిజంగా ఆయనఅన్నట్లు బాబుకి నా బెంగ వున్నదేమో.... వాడీమధ్య ఛెంగు ఛెంగున గెంతుతూ, తన మెడచుట్టూ చేతులు వేసి 'వదల్రా'అని విసుక్కున్నాకూడా వదలకుండా గుమ్మందాద్దం ...పరిగెత్తివచ్చి వళ్లో గభాలున చతికిలబడి, తన మొహంలోకి చూస్కో నేనెంత ఘనకార్యం చేసేనో అన్నట్లు చూడడం.... మునుపటి నజ్జుతనం వాడిలో మచ్చుకైనా లేకపోవడం ఆమెని ఆశ్చర్యంలోనూ, ఆనందంలోనూ ముంచివేసేవి.

ఐతే పాప మాత్రం నలతగా వున్నది. కొంపదీసి యిదిగాని ఆయనకోసం బెంగపెట్టుకోలేదు గదా....

అయన కివేం పట్టవు? ఎంతసేపూ నన్ను నీబాధ్యత తెలీదు ....అని వేధించడమేగాని, అయ్యో పాప సుగుణ తన గురించి బెంగపడుతుంది అన్న జ్ఞానమే లేకపోయె....ఛీ చదువుండగానే సరా...." అనుకుంది.

చదువు?

అది తనకీ వుంది.

తనూ సైకాలజీ చదువు కుంది....మరి సార్థకమేదీ....

ఆమెకి మహిళామండలికూడా ఒక సమస్య అయింది.

ఆమె లోపలినించి యెవరో చదువుకున్నదానివి....తోటి స్త్రీ జాతి హక్కులను వుద్ధరించవల్సినదానివి....నువ్వే బాధ్యతవొదిలి, యిలాగ వెళ్ళిపోతే నిన్నేమనాలి....అని నిలదీసేరు.

అబ్బ అక్కడవుంటే ఆయన బాధ్యతో అని కాల్చుకుతిన్నారు. ఇక్కడికి వస్తే యీ అంతరాత్మ గోల....

ఈ పిల్లల్ని తీసుకుని ఎక్కడికేనా పారిపోదునా? అనుకుంది.

అంతలో రఘు పరిగెత్తివచ్చి వొళ్లో కూచోగా చికాకుపడి వదిలించుకుంది.

ఆ వెనకాలే తండ్రి "ఏమిటమ్మా ...శారదా....యీ కుర్రది నలతగావుంది.... చిక్కిపోయినట్లుంది.... అదీగాక మీ ఆయ న్ననాలి. కనీసం వుత్తరం ముక్కయినా రాయలేదు....అసలింతకీ నువ్వేం చెప్పవూ? ఏమైనా అల్లుడు పెద్దపెద్ద మాటలు ఆడాడా ఏం? అని కనుబొమ తెగరేసి అడిగేడు.

ఆయనకి తన రూపాయిలమీద చాలా నమ్మకముంది.

శారద "లేదు నాన్నగారూ....నేనే వచ్చేను చూసిపోదామని" అని వూరుకుంది. ఆమె తన వుద్వేగాన్ని దాచాలని చాలా ప్రయత్నం చేసింది.

''అది సరే....వచ్చేవు....రాకపోతే నేనే కబురెడుదు ననుకో ....కాని, మీ ఆయనకి బుర్రలేదు అంటాను....లేకపోతే యింత ఎదిగీ, యింత చదివీ తన బాధ్యత తెలియొద్దూ....పెళ్లాం పిల్లల యోగక్షేమం తెలుసుకో లేనివాడు దేశోద్ధరణ అంటూ యేమి వెలగబెడతాడూ అంట....''

శారద తన భర్తని, తాను ధిక్కరించి, తిరస్కరించి వచ్చిన భర్తని, తనను నిర్లక్ష్యంచేసేడని యింతవరకూ తను నిందిస్తున్న భర్తని తండ్రి నిందించేసరికి గిలగిల్లాడి పోయింది.

కత్తి పుచ్చుకుని యెవరో తన హృదయకుహురంలో పొడిచి నట్లు ఫీలయింది.

ఆమెకి తర్కించుకున్న కొద్దీ, మథనపడ్డకొద్దీ, అతడానికి బాధ్యతలేగాని హక్కులెక్కడివీ.... అనిపించింది.

అసలు హక్కులూ బాధ్యతలూ వీటిమధ్య గీత ఏమిటీ, అర్థం వున్నదా అన్న సమస్య తేలిందికాదు.

పాప యీగిలపడి కింక పెడుతున్నది శారద కా పరధ్యానంలో వినిపించిందే గాదు.

ఆమె వులిక్కిపడి చూసేసరికి పాప నెత్తుకుని ఆరడగుల విగ్రహం. సోమశేఖరం నించునివున్నాడు.

ఆమె తలయెత్తి అతనికేసి అతి ప్రయత్నంమీద చూసేసరికి ...అతను పాప బుర్కా మొహం ఏకమయ్యేలాగ తనివిదీరా దాన్ని ముద్దుపెట్టుగోడంలో నిమగ్నుడై వున్నాడు.

మాటాడుదా మనుకున్న అయిదారు క్షణాలకి ఆమె పెదాలు విడిపడ్డాయి.

''జ్ఞాపకం వచ్చానా ఏం?''

''ఉహుఁ లేదు....యిదుగో మా చిట్టితల్లిని చూసిపోదామని వచ్చేను....వుండబట్టక ...నువ్వు నీ హక్కుల పోరాటం నిర్విఘ్నంగా సాగనీ....అది తెలీకనే అనుకుంటాను. నేను వస్తూ వుంటే మీ క్లబ్ ప్రెసిడెంటు ఎదురువచ్చి ''స్త్రీలూ-హక్కులూ'' అన్న నీ వుపన్యాసం రాస్తున్నావా? ... అని నన్ను అడిగింది.... సోది అడగమని సలహా చెప్పివచ్చా....

అంతలో బాబు లివ్వునవచ్చి అతని కాళ్లకి పెనవేసుకున్నాడు. శారద కా దృశ్యం పరమానందం ఇచ్చింది.

''సరే తల్లీ....నే వస్తా మరి... ఏది నాన్నా బాబూ....'' అంటూ పాపని దింపి....బాబుని తప్పించుకో జూసేడు సోమశేఖరం.

శారద చిరుకోపం ముక్కుమీద చిందులువేయగా ''పదండి వెడదాం....వస్తామని చల్లగా జారుకుంటున్నారే....బాధ్యత అని వొకరికి చెప్పడమేగాని....తాము చెయ్యడం లేదన్నమాట?'' అన్నది పాప నెత్తుకుంటూ.

శారద పూర్తిగా గతమంతా మరిచిపోయింది. ఆమె కళ్లలో మిలమిలా వింత కాంతులు మెరిసేయి.

''ఓ అవును....అన్నట్లు మీ మండలికూడా అక్కడ నీ వుపన్యాసాలు లేక దొర్లుతున్నది....చలో శెకరట్రీ'' అన్నాడు నవ్వుతూ శేఖరం. మళ్లీ కొంచెం ముందుకివంగి ''మరి నేను వంటవాణ్ణి మానిపించేను నీకు తెలుసుగా....'' అన్నాడు.

''గొప్ప పని చేసేరు....ఇంకానయం భోజనం మానేసేనన్నారు కాదు....నేను వండగలను లెండి....''

''హుర్రే'' అన్నాడు ఆనందంతో సోమశేఖరం. పాప, బాబూ వింతపడి చూస్తూ వుండిపోయేరు.

''మరి హక్కులు - సెక్రటరీ షిప్పూ ఎట్సెట్రా....'' ఆమె మొహంలోకి చూస్తో అడిగేడు.

''నో....నో....'' ''స్త్రీలూ - బాధ్యతలూ'' అని సవరించేసేం మా వుపన్యాసాన్ని....అన్నది శారద.

''బహుశా శెకరట్రీషిప్పుకి విడాకులిచ్చే ముందు అదే నా అంతిమ గంభీరోపన్యాసం అవుతుంది.''

''ఐసీ....అయితే చచ్చామే....శెక్రటరీషిప్పు నెవరు వరిస్తారేం?....''

''గంగా భాగీరథీ సమానురాలైన గంగాబాయమ్మ గారో, సక్కుబాయమ్మగారో ముందుకు వస్తారులెండి....మీరు బెంగ పడకండి....''

ఇద్దరూ నవ్వుకున్నారు పాప, బాబూగూడా అర్థం అయినట్లు కిలకిలమన్నారు

ఆ యిద్దర్నీ చెరో చంకని ఎత్తుకుని 'చలో' అన్నాడు డాక్టర్ శేఖరం ...


తిన్నగా కారు ఎక్కిపోయేరు.

అంతలో తండ్రివస్తూ ''వోయ్! అల్లుడూ!....అదేమిటే అమ్మాయ్! చెప్పా చెయ్యకండా అలాపోతారేం?'' అంటూ కేకలేసేడు.

తాతకి ''టా! టా! చెప్పరా బాబూ'' అని శారద వెనక సీట్లో నించి తల యివతలపెట్టి బాబుచెయ్యి పట్టుకుని వూపింది. ''తాతకి నువ్వూ చెప్పు తల్లీ! టాటా'' అని చేత్తోటి చంటి దానిచేతకూడా వూపించేడు సోమశేఖరం.

''ఓరిమీ! నా డబ్బుకేనా విలువ లేదట్రా?'' అని ఆనంద బాష్పాలు రాల్చేడు, మలుపు తిరిగిపోయిన కారుకేసి చూస్తూ ఆయన.

★




మైలవరం బ్లాకులోని వెలగలేరులో, 1960 నవంబరు 1వ తేదీన మైలవరం పంచాయతీ సమితి ఉపాధ్యక్షుడు శ్రీ సి. హెచ్. వెంకటరావు తండ్రి గారైన శ్రీ సి. హెచ్. రతిరాయుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈయన ఈ కేంద్రానికి రెండుఎకరాల భూమి. రు. 5,000 ల రొక్కం విరాళంగా ఇచ్చారు.



పంచాయతీ రాజ్య దినోత్సవ సందర్భంగా కృష్ణాజిల్లా నందిగామ బ్లాకులోని అంబర్‌పేట గ్రామంలో హరిజనవాడలో "శ్రమదానం" ద్వారా రోడ్డు నిర్మించారు.




కృష్ణాజిల్లా చెవుటూరు గ్రామంలో మైలవరం పంచాయతీ సమితి సభ్యురాలు శ్రీమతి వి. కనకరత్నమ్మ ప్రాథమిక పాఠశాలా భవనానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి ఈమె రు. 5,000 ల విరాళం ఇచ్చారు.




"కూర్మనాథ స్వామి" - శ్రీకాకుళం దేవాలయంలోని విగ్రహం.

—(*22 వ పుట చూడుడు.*)



చిత్తూరుజిల్లా, పుత్తూరు పంచాయతీ సమితిలోని రామచంద్రాపురం గ్రామవాస్తవ్యులు శ్రీ కోలా రామచంద్రనాయుడు, వారి సతీమణి, ఈ గ్రామంలో ఒక ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రాన్ని నిర్మించ డానికిగాను వీరు రు. 15,000 లు విలువచేసే తమ యావదాస్తిని దానం చేశారు.



రహస్యం ?



చిత్తూరు జిల్లా చౌడేపల్లి పంచాయతీ సమితిలోని దుర్గసముద్రం గ్రామస్థులు బుతకపల్లె చెరువు కాలువకు 4 మైళ్ల పొడవున శ్రమదానం ద్వారా మరమ్మతులు చేశారు.

అల్లూరి సీతారామరాజు చరిత్ర

ఆంధ్రవీరుని అద్భుత జీవితము

అన్ని వివరాలతో

సచిత్రంగా వర్ణింపబడినది

★

ఆర్టుపేపరుమీద మనోజ్ఞంగా ముద్రింపబడిన

ప్రభుత్వ ప్రచురణము

వెల: రూ. 2-75 న. పై.

ప్రతులకు : సమాచార-పౌరసంబంధముల శాఖ

ఆంధ్రప్రదేశ ప్రభుత్వం,

హైదరాబాదు.

నాటిక

రోగంలేని మందు

ముద్దంశెట్టి హనుమంతరావు

పాత్రలు : విజయకుమార్—22 సం.
దేవరాజ్—21 సం.
రామచంద్ర—22 సం
శశిభూషణ్—20 సం.
వెంకట్రామయ్య—50 సం.

(కాలేజి హాస్టలు రూమ్. గదిమధ్య ఓ టేబులు, కుర్చీ, ఎడమప్రక్క శుభ్రంగా వున్న మంచం. మరోవేపు పుస్తకాలతో నిండివున్న షెల్ఫు, వుంటాయి. టేబిలుమీద పుస్తకాలు చిందర వందరగా పడివుంటాయి. విజయ్‌కుమార్, తెరలేచేసరికి విసుగ్గా అయోమయంగా పచారుచేస్తూ, చేతిలోవున్న సిగరెట్ క్రింద పడేసి నలిపేస్తాడు. వెలుపలినుండి దేవరాజు వస్తాడు.)

దేవ : (పరిహాస ధోరణిలో) ఏఁవిట్రా అంత విసుగ్గా పచారు కొడ్తున్నావ్, అందుకే నే నంటుంటాను, రూమ్‌లో ఎప్పుడూ కూచోవద్దని. విసుగుపుట్టినప్పుడంతా అలా షికారుకో, యే సినీమాకో పోతేకాదూ ? (కుర్చీలో కూచుంటాడు)

విజ : (ఆగి) వెధవబుర్ర అంతే పనిజేసిందిగాని, దూరంగా యోచించలేదు.

దేవ : (లేచివస్తూ) ఏఁవిట్రా నీ వుద్దేశం ?

విజ : నువ్విస్తున్న యీ బోడి సలహా, యెవరికీ స్ఫురించక్కాదు. అసలు, బైట అడుగుపెట్టామంటే, జేబులో పుష్కలంగా డబ్బుంటేనేగాని హుషారుగా వుండదు

దేవ : అంత లేకుండా వున్నావేట్రా ?

విజ : ఉంటే, యీ అఘోరింపు యెందుకు ? ఓ పదిరూపాయిలే వున్నాయి. మార్కెట్టుకిపోయి, టూత్‌పేస్టూ, సబ్బు, తలనూనె వగైరా, వగైరా కొనుక్కోవాలిగా ! ఇంక మిగిలేదేవిఁటి ? అన్నట్టు, ఒరేయ్–ఆ రోజు పదిరూపాయిలు అప్పుపుచ్చుకున్నావు. అవి యిప్పుడు సర్దుబాటు చెయ్యకూడదూ !

దేవ : (తెల్లమొహంవేసి) చచ్చాంరా ! నిన్నే ఓ రెండు రూపాయిలు అడుగుదామని వచ్చాను. నా కింకా మణియార్డరు రాలేదు.

విజ : బావుంది.... దావుంది.... ఇంక, యిదొకటా ?

దేవ : మీ నాన్నకి వుత్తరం రాశావుగా, డబ్బు పంపమని. పంపిస్తారేమో ! న్యాయంగా యీ సరికి పంపించాలి. ఈ వేళ వస్తుందేమో ?

విజ : (దిగులుగా) ఏవిఁటోరా ! అబద్ధాలకి హద్దూ, పద్దూ వుండాలి. ఏదో ఒహా అబద్ధం రాయడం–డబ్బు తెప్పించుకోవడం జరుగుతుంది. రోజుకి రోజూ ఖర్చులు పాపం పెరిగినట్టు పెరుగుతున్నాయేగాని, చదువులో మాత్రం పురోగమనం కన్పించడంలేదు. గత సంవత్సరం యెలాగూ పోయింది. ఈ సంవత్సరమన్నా ప్యాసవకపోతే మర్యాద దక్కదు.

దేవ : ఈ సంవత్సరం ఢంకామీద దెబ్బకొట్టి ప్యాసవుతాంరా ! (చిటికెలువేస్తూ) పరీక్షలు నెలరోజులున్నాయనగానే ప్రారంభించి, ఒక్క నిముషం వేస్టు చెయ్యకండా చదివామంటే, తిరుగుండదిక. పట్టుదల వుండాలేగాని, సాధ్యం కానిదేమిట్రా !

విజ : నిజమేగాని, ఆ పట్టుదలే మనలో శూన్యమన్పిస్తుంది.

[రామచంద్ర వస్తాడు. పొడుగ్గా, ఠీవిగా వుంటాడు. కోటేరు వేసిన ముక్కు, పెద్దకళ్లు.... వుత్సాహంగా అగుపిస్తాడు.]

రామ : (వస్తూనే) తెగని సమస్య విడదీస్తున్నట్టుగా మొహాలు పెట్టారేఁవిట్రా యిద్దరూను ? విజయ్, నువ్వేఁవిటీ అలా వున్నావు ? డ్రెసప్ అవలేదేం ? కాలేజీకి శలవున్న రోజు కూడా మనం యిలా కాలాన్ని నిస్సారంగా గడపడం యెంత అవమానకరం ! అలా యెక్కడికైనా వెళ్దాం పదండి.

దేవ : నే నంటున్నదీ అదేన్రా !

రామ : ఇవ్వాళ కొత్త పిక్చరు రిలీజ్ అయ్యిందిగా. విజయ్ మనందరికీ చూపిస్తాడు, ఏంరా ? (విజయ్ వేపు చూస్తాడు)

విజయ్ : (నిట్టూర్చి) చూపించినట్టే వుందిరా! చేతిలో డబ్బులేదని నేను దిగులుగా వుంటే, యీ సలహా ఒకటా? బావుంది.... ఎన్నోసార్లు మిమ్మల్ని సినీమాకి నేను తీసుకువెళ్లాను. ఇవ్వాల్టికి నువ్వు స్టాండు కాకూడదూ!

రామ : (గుటక మింగుతూ) నేనా....? స్టాండయ్యేవాణ్ణేకాని, చేతిలో చిల్లిగవ్వలేదురా! మణియార్డరుకోసం యెదురుచూస్తు న్నాను. మణియార్డరుకి బదులు యివ్వాళ ఓ ఉత్తరంముక్క వచ్చింది.

దేవ : మణియార్డరు పంపుతున్నట్టు రాశారుకదూ, మరింకేం! రెండుమూడు రోజుల్లో వచ్చేస్తుంది.

రామ : (విసుగ్గా) అదికాదురా బాబూ! అలా రాస్తే బాగానేవుణ్ణు. మా అన్నయ్య ఊళ్ళో లేడట. వాడు వచ్చేసరికి మరో అయిదారు రోజులన్నా పడుతుందట. వాడు వచ్చేక పంపుతారట. అంతవరకూ యెలాగో సర్దుకోమన్నారు, (ఏడుపు మొహం పెట్టి) ఎట్లా సర్దుకోవడం? మనం యిరక్కడపడే అవస్థ వాళ్ళకేం తెలుసు? ఏంచేస్తాం మరి? మన విజయ్ యెలాగూ వున్నాడుకదా, అన్నధైర్యం చిక్కబట్టుకున్నాను.

విజ : నేనే నానా అవస్థలూ పడుతూంటే, నా మీద ఆశలు పెట్టుకూర్చోవడమెందుకురా?

రామ : ఇప్పుడంటే చేతిలో డబ్బు లేదుగాని, రేపో, మాపో, అంతకీవస్తే-యివ్వాళే మణియార్డరు వచ్చేయకూడదా ఏంవిటి? నువ్వు ఒక్క వాక్యం రాస్తే చాలు, మీ నాన్నగారు ఆఘమేఘాల మీద డబ్బు పంపిస్తారు. టెలిగ్రామ్ మణియార్డర్లు యెన్నిసార్లు అందుకోలేదు నువ్వు?

విజ : నిజమే అనుకో! అబద్ధపు సాకులు యెన్నోరాసి, యెన్నోసార్లు డబ్బు రప్పించుకున్నాం. ఎప్పుడన్నా, ఆయనకి అనుమానం కలిగి ఆరాతీశాడో, చచ్చామన్నమాటే!

దేవ : ఓస్! యింతమాత్రానికే భయపడిపోతావేమిట్రా? సమయానుకూలంగా కథల్లడం, మన చేతుల్లోవుంది.

రామ : ఔన్రా! మనవాడు చెప్పింది కరక్టే!

విజ : మనం చెప్తామనుకో, మా నాన్న నమ్మొద్దూ?

రామ : నమ్మినట్టే చెప్తాంలేరా! ఇంతకీ ఆ M. O. యివ్వాళ వస్తే చాలా బావుణ్ణు.

విజ : నేనూ దానికోసమే యెదురు చూస్తున్నా, చంద్రునికోసం యెదురుచూసే చకోరపక్షిలా. ఆ ఫ్యాన్సీస్టోర్సువాడికి ఓ పది రూపాయిలు యివ్వాలి. ఆ ప్రాంతాలకి వెళ్ళడానికే మొహం చెల్లకుండావుంది. మణియార్డరు వచ్చిన తక్షణం, వాడి బాకీ తీర్చేస్తే, శని విరగడౌతుంది.

దేవ : ఔన్రా! అల్లాంటివాళ్ళ దగ్గర బాకీలు అట్టేపెట్టకూడదు. నేనూ వాడికో అయిదురూపాయిల్లు యివ్వాలి. నీ డబ్బు వచ్చాక, అంతా కలిపి యిచ్చేస్తే, మనలో మనం తర్వాత చూసుకోవచ్చు.

విజ : ఒరేయ్! ప్రస్తుతానికి మాత్రం నా డబ్బులో ఒక్క చిల్లికానీ కోసంకూడా ఆశపెట్టుకోకండి. నేనే చాలామందికి యివ్వవల్సివుంది.

రామ : అయితేనేంరా? మీ నాన్నగారు యెప్పుడు పంపినా, నూరుకి తక్కువ కాకుండా పంపుతారు. అందులోనే సర్దుకుందాం.... మరేం చెయ్యడం? కొండంత స్నేహితుడివి నువ్వున్నావనే కదా, మా ధైర్యమంతాను! అన్నట్టు యిప్పుడేం సాకురాశావు?

దేవ : అదేంవిట్రా తెలీనట్టు అడుగుతావు? మనమంతా ఆలోచించుకునేగా ఓ నిర్ణయానికి వచ్చాం. వాడికే ఒంట్లో బాగులేదనీ, మందులకోసం, డాక్టరుకోసం డబ్బు అవసరముంటుందని కదూ రాయమన్నాం...?

విజ : అక్షరాలా నేనూ అలానే రాశాను. ఇంక మరోమార్గంకూడా నాకు అగుపించలేదు. ఉన్నమార్గాలన్నీ యింతకుముందే వినియోగించుకున్నాంగా!

రామ : (సాలోచనగా) ఔను సుమా! మర్చిపోయాను. కాని, ఒరేయ్ విజయ్, మనం తొందరపడి నిర్ణయించామేమో!

విజ : ఏమిటి?

రామ : అదే! నీకు అస్వస్థతగా వుందనికదూ రాశావు!

విజ : ఔను. యిందులో తొందరపాటు యేముంది?

రామ : మనం దూరాలోచన చెయ్యలేదేమో నన్పిస్తుంది....

దేవ : (విసుగ్గా) ఏమిట్రా నువ్వంటున్నదీ?

విజ : సూటిగా చెప్పరా!

రామ : మనం, యేదో తెలివిగా రాశామని అనుకుంటున్నాంగాని, మీ నాన్నగారు స్వయంగా తనే వస్తేనో? కన్నకొడుక్కి అస్వస్థతగా వుందని తెలిస్తే, యే తండ్రికైనా యెలావుంటుందో ఆలోచించు. చూడ్డానికి తప్పకుండా వస్తారేమో!

విజ : (అదిరిపడి) వస్తారంటావా? చచ్చాంరా; ఇప్పుడేం చెయ్యడంరా! (కొంత గాభరాపడుతూవుంటాడు)

దేవ : (నిట్టూర్చి) అనవసరంగా వాణ్ణి గాభరా పెట్టించేస్తున్నావురా రామం! ఆ ముసలాయన వున్నపాటున వస్తాడని నాకు నమ్మకం లేదు. ఆయనకి బోలెడు వ్యవహారాలు! వెంటనే డబ్బు పంపిస్తాడు చూడు!

విజ : అలాగనకురా దేవ్! రామం చెప్పిందికూడా జరగొచ్చు. మా నాన్నకి నే నంటే యెంతో ప్రేమ. కాస్తంత రొంపచేస్తే చాలు — డాక్టర్ని రప్పించేసే వారు. ప్రతీవుత్తరంలోనూ నా ఆరోగ్యం కాపాడుకోమనే పదేపది రాస్తుంటారు. అందుకే, వస్తారేమోనని నాకూ భయంగానేవుంది. మనం అనాలోచితంగా, అలా రాయడం, కోరి ముప్పుతెచ్చుకున్నట్టయ్యింది. ఇప్పుడేం చెయ్యడం? (ఇటూ అటూ పచారుచేస్తాడు)

[సైకిలు గంట విన్పిస్తుంది.... 'టెలిగ్రామ్ సార్' అన్న కేక రెండుసార్లు విన్పిస్తుంది]

విజ : (షాక్ తిని) టెలిగ్రామ్! ఏమిటో అది.

దేవ : టెలిగ్రామ్ కాదురా! టెలిగ్రామ్ మణియార్డరు... నే నన్నానుకదూ...మీ నాన్నగారు డబ్బుపంపడంలో వుద్దండులు. నువ్వెక్కడ చికాకులు పడతావో అని అతనిభయం. తండ్రి అంటే. అలా వుండాలి. వెళ్ళరా....వెళ్ళు....

(విజయ్ తాపీగా బైటికి నడుస్తాడు)

రామ : వస్తున్నట్టు, ముసలాయన టెలిగ్రామ్ యిచ్చాడేమిటీ?

దేవ : (అయిష్టంగా) ఊరుకుందూ! శకునపక్షిలా ముందుగానే అశుభం పలుకుతావు; డబ్బు నీకూ అవసరమేకదా, T. M. O వచ్చివుంటుందనే అనుకోకూడదూ?

విజ : (విసురుగా చేతిలో టెలిగ్రామ్ పట్టుకునివస్తూ) కొంప మునిగిపోయిందిరా! అనుకున్నంతా అయింది.

దేవ : (దిగాలుపడి) వచ్చింది T. M. O. కాదూ?

రామ : (వెటకారంగా) ఆ! వచ్చింది. వాడి చేతిలో చూస్తున్నావుగా! నేను వూహించిందే నిజమయ్యింది చివరికి.

విజ : అక్షరాలా నిజమయ్యిందిరా. మా నాన్న యివ్వాళ మెయిల్లోనే వస్తున్నారు. వెధవ టెలిగ్రామ్ కాస్త ముందుగానైనా అందిందికాదు? పేరుకి టెలిగ్రామ్ గాని, దీనికంటె మామూలు వుత్తరమే నయం. మెయిలువచ్చే వేళకూడా అయింది. ఇక ఆయన వస్తూవుండాలి. ఇప్పుడేం చెయ్యడం? (గాభరాగా పచారు చేస్తుంటాడు.)

దేవ : కొంపమునిగి పోయినట్టు, యీ రోజే ఆయన వూడిపడాలా! ముందు డబ్బు పంపేసి రెండురోజులు పోయాక వస్తేకాదూ?

రామ : ఎంత తేలిగ్గా అనేశావురా? కన్నతండ్రి ఆవేదన, ఆత్రుత నీకేం తెలుస్తుంది?

దేవ : (వుడుకుమోత్తనంగా) మహాగొప్ప నీకు తెలిసినట్టు కబుర్లు చెబుతున్నా వేమిట్రోయ్?

విజ : (ప్రాధేయపూర్వకంగా) ఫర్ గాడ్స్ సేక్, మీరిద్దరూ తగువులు పడకండిరా! ప్రస్తుత కర్తవ్యం ఆలోచించండి. మా నాన్న మామూలుగా యెంత మంచివారో, కోపం వచ్చినపుడు అంత చెడ్డవారు. మరి వుండరు లోకంలో.

రామ : ఏమిటాలోచించేది?

విజ : ఏదో ఒహ మార్గం ఆలోచించకపోతే, మన గుట్టు బైట పడుతుంది. గుట్టు బైటపడిందా, మా నాన్న ఆగ్రహానికి గురి కావల్సి వస్తుంది.

రామ : అదీ నిజమేలే! కాని, యేంచెయ్యడమా అని?

విజ : (విసుగ్గా) సమయానుకూలంగా కథలల్లుతా మన్నాట్రా? ఏమిరా దేవరాజ్, నువ్వు?

దేవ : (వేలమొహంవేసి) ఏమీ తోచడం లేదురా....

విజ : మరెలా అవుతే?

రామ : ఒక్కటే మార్గం....

విజ : (ఆసక్తితో) ఏమిట్రా?

దేవ : (రెట్టించిన ఆసక్తితో) చెప్పరా వేగిరం....

రామ : ఒరేయ్ విజయ్, నువ్విప్పుడు రోగిగా మారిపోవాలిరా. అంతకంటె గత్యంతరం లేదు.

విజ : అంతేనంటావా?

దేవ : బొన్రా! అదే మంచి అయిడియాలా తోస్తుంది. ప్రాబ్లమ్సు సాల్వు చెయ్యడంలో మనవాడు అఖండుడు.

రామ : పంపు కొట్టడం చాలించరా బాబూ యిక.

విజ : రోగిలా మంచమ్మీద వుంటాననుకో! కాని, మా నాన్న వచ్చాక యెవర్నయినా డాక్టర్ని పిలిపించి పరీక్ష చేయిస్తే? మనకేమీ రోగం లేదని ఆ డాక్టరు చెప్పేస్తే? మా నాన్న వుగ్రనరసింహ రూపం దాలుస్తే?

రామ : నీ సందేహాలుకూడా కొట్టిపారేయలేంరా? వాటికి యేదో పరిష్కారమార్గం యోచించాలి.

దేవ : మనలోనే ఒహరం డాక్టరుగా నటిస్తే?

రామ : (మందహాసంతో) భేష్! బావుంది నీ ఆలోచన. నీ బుర్ర మాత్రం తక్కువదా! నాకు తెలీదూ?.... సమయానికి మంచి

సలహా యిచ్చావు. ఎవరో ఎందుకు ? నువ్వే వేసెయ్ ఆవేషం.

దేవ : (తత్తరపడి) అమ్మబాబోయ్ నేనా ? అంత ధైర్యంగా నిలబడి, చాకచక్యంతో నటించేయోగ్యత నాకు లేదురా ! ఆయన కంటబడేసరికే వణుకుపుట్టుకొస్తుందేమో ! బాబ్బాబూ ! నన్నుమాత్రం యిందులో యిరికించకు. అన్నింటికీ సమర్థుడవు నువ్వే !

రాము : (గుటకమ్రింగుతూ) నేనా ?

విజ : ఔన్రా రామం ! నువ్వే సమర్థుడవు. తగిన పర్సనాలిటీ కూడావుంది. నిన్నుచూసి డాక్టరనుకుందుకు అవకాశంవుంది. ఎలాగో ఓ మెడిసిన్‌బేగ్ సంపాదించు. ఈ రోడ్డు మలుపులోనే ఆ కాంపౌండరు కామేశంగారు వుంటున్నారుగా ! అతణ్ణి యెలాగో నచ్చచెప్తే తప్పకండా యిస్తారు. స్టెతిస్కోపుకూడా అతనిదగ్గర వుండకపోదు. కావాలంటే, అతనికి యేమైనా లంచం యిచ్చుకుంటామని హామీ యివ్వు.

రాము : చివరికి యీ బాధ్యతంతా నా నెత్తిమీదే వేస్తున్నావన్న మాట !

విజ : మరేంచెయ్యన్రా ! సమయం అల్లాంటిది. సమర్థుడవునువ్వే ! కాదనకు, ఇట్లాంటి విషమపరిస్థితిలో ఆదుకోపోతేఎట్లారా ?

రామ : కాని, మీ నాన్నగారు నన్ను గుర్తు పట్టేస్తారేమో ?

విజ : ఫరవాలేదురా ! చత్వరం కళ్ళద్దాలు మన గోపాలం దగ్గరున్నాయికదూ ? అవిపుచ్చుకుని తగిలించుకో !

రామ : సరే, మరేంచేస్తాం ?

దేవ : హమ్మయ్య ! ఇక భయంలేదురా విజయ్.

విజ : (ఆత్రంగా) రామం, నువ్వికవెళ్ళి. నేను చెప్పినవన్నీ తెచ్చుకోరా ! ఆ జిడ్డుమొహాన్ని కాస్తసబ్బుతో కడుక్కో.... డాక్టరు ఠీవిలో రావాలిసుమా ! మా నాన్నగారు వచ్చేసరికి, నువ్వు యిక్కడేవుండటం శ్రేయస్కరం, ఆయన వచ్చేవేళ కూడా అవుతోంది. వేగిరం వెళ్ళిరారా బాబూ !

రామ : మంచిచిక్కే వచ్చిపడిందిరా ! నేరక అలా రాశావు.... వస్తామరి. (నిష్క్రమిస్తాడు)

విజ : ఒరేయ్ దేవ్, మనం పక్క సర్దుదాం రారా ! (ఇద్దరూ కలిసి పక్కమీద దుప్పటి సర్దుతారు—)

దేవ : నువ్విక మంచమ్మీద పడుకోరా !

విజ : ఇప్పట్నుంచే యెందుకురా ? ఆయన రానీయ్—

దేవ : అసలు నువ్వు యే మాత్రం నీరసంగానూ అగుపించడం లేదురా; నువ్వు అనారోగ్యంగా వున్నావంటే, మీ నాన్నగారు నమ్ముతారా అన్న అనుమానం స్ఫురిస్తుంది.

విజ : ఔను, అదీనిజమే. మరేంచేద్దామంటావు ? (గడ్డం తడుముకుంటూ) గడ్డమైన మాయలేదు....

దేవ : లేనిగడ్డం యిప్పుడు యెలావస్తుంది గాని, ముందు ఆ జుత్తంతా చిందరవందరగా చెయ్యి. (అభినయించినట్టు పౌడరు యిచ్చి) ఆఁ....కళ్లు గట్టిగా నులుముకో. కమీజు కాలరు ఓ ప్రక్క లోపలికి మడిచేసెయ్. అప్పుడు కాస్తంత వాస్తవానికి సమీపంగావచ్చి రోగిలా అగుపిస్తావేమో !

విజ : ఔన్రోయ్ ! మంచిసలహాయే ! నీ బుర్రలో యింతసరుకు వుంటుందని అనుకోలేదు. (నవ్వుతాడు)

దేవ : ఎలా అనుకుంటావులే ! నన్నసలు వెర్రిబాగులవాడిక్రింద జమకట్టేశారు.... సరుకుయేమీ లేకండానే గామోసు, యీ సలహాలన్నీ యిస్తున్నారు; ఏమిటో ! (నిట్టూర్చి) సరేగాని, నేను చెప్పినట్టు చెయ్యరా !

విజ : (దేవరాజు చెప్పినట్టుగానే చేసి) ఇప్పుడెలా అగుపిస్తున్నానోరి ? కాస్తయినా నీరసంగావున్నట్లు అగుపిస్తున్నానా ?

దేవ : కాస్త ఖర్మమేంరా ! పదహారణాల పచ్చిరోగివిగా అగుపించకపోయినా, పదణాల రోగిలామాత్రం ఖచ్చితంగా కన్పిస్తున్నావు. ఫరవాలేదులే యిక.

విజ : ఏమిటో యివన్నీను ! ఇన్నీ చేశాక, మా నాన్న అసలు రహస్యం పసిగడితే, యిక పో— మరి మనల్ని యీ జన్మలో నమ్మడు. అంతేకాదు—తెగతెంపులు చేసుకునేంతటి దురుసు మనిషి.

దేవ : (తేలిగ్గా) పసిగట్టడం, అతనితరం కాదులేరా ! మనం మాంచి పకడ్‌బందీగా ప్రయత్నాలు చేస్తున్నాం. ఎల్లాంటి కొమ్ములు తిరిగిన డిటెక్టివ్ వచ్చినాసరే, మన రహస్యాన్ని ఛేదించలేడు.

విజ : అలా అనకురోయ్ ! మా నాన్నముందు యే డిటెక్టివు పనికిరాడు. ఇప్పు డమ్ముతుండే, యీ అర్ధరూపాయి డిటెక్టివ్ నవలలు కాకపోయినా, పాతకాలంనాటి డిటెక్టివు నవలలు తెగ చదువుతుంటారు. అందులోనూ ప్లీడరాయె. ఇంక అడిగేదేమిటి ?

దేవ : నువ్వు వూరికనే గాభరాపడుతున్నావురా !

విజ : నిజమే ! ఏమిటో నాకు అదోలాంటి భయం ఆవరించింది.

అన్నట్టు మన శశిభూషణ్ యేడీ? ఈ రోజు అగుపించడమే లేదే!

దేవ : వాడికి ఒక వ్యాపకం కాదురా! ఆ మధ్య యెవరో ప్రచురణకర్త ఓ నవలకి త్రివర్ణముఖచిత్రం వెయ్యమన్నాట్ట. అయిదు రూపాయిలు అడ్వాన్సుకూడా యిచ్చాడటలే! ఆ బొమ్మ నిన్ననే పూర్తిచేశాడు. అది తీసుకుని ప్రచురణకర్తదగ్గరికి వెళ్ళాడు. ఎంత బాగా వేశాడనుకున్నావు?

విజ : మనందరి కంటె, వాడే నయంలేరా! మనతో చేతులు కలిపి తిరుగుతున్నా, మనలా కాలాన్ని పూర్తిగా వృధాచెయ్యడం లేదు. ఏదో విధంగా సద్వినియోగం చేస్తున్నాడు.

దేవ : అదీ నిజమేలే! మంచి తెలివైన వాడు. అసలు, వాడికి సరస్వతీ కటాక్షముందిరా.

విజ : దురదృష్టవశాత్తూ, గత సంవత్సరం పరీక్ష పోయిందిగాని, పాసవ్వవల్సిన వాడే!

దేవ : ఇదిగో, బొమ్మలు రాయడంలో పడి, పోగొట్టుకున్నాడు గాని, లేకపోతే పాసయ్యేవాడే! ఈ సంవత్సరం శ్రమపడుతున్నాడులే.

(బయట జోడు చప్పుడు విన్పిస్తుంది.)

విజ : (ఆత్రంగా) ఎవరో వస్తున్నట్టుంది చూడరా! మా నాన్నగారేమో!

దేవ : (నాలుక తడుపుకుంటూ) నన్నే చూడమంటావా? మీ నాన్నగారి యెదుటపడ్డానికి యెందుకో భయం భయంగా వుందిరా.

విజ : (విసుగ్గా) ఏం భయమూ లేదు. వెళ్ళి చూడరా బాబూ!

దేవ : సరే! నువ్వు మంచమ్మీద పడుకొందుకు రెడీగా వుండు.

విజ : (మంచం దగ్గరికిపోయి నుంచుని ఆసక్తిగా చూస్తుంటాడు.)

దేవ : (ద్వారం వరకూ వెళ్ళివచ్చి) మన రామమేన్రా! భేషుగ్గా తయారై వస్తున్నాడు.

రామ : (వస్తూనే నిట్టూర్చి) ఆ కాంపౌండర్ని నచ్చజెప్పేసరికి నా తలప్రాణం తోక కొచ్చిందిరా విజయ్. (మెడిసిన్ బేగ్‌ని టేబిలు మీద పెడతాడు.)

దేవ : (రామచంద్రని చూస్తూ) అచ్చంగా డాక్టరులానే వున్నావురా! ఆ కళ్ళద్దాలు యేకంగా రూపాన్నే మార్చేశాయి సుమా!

విజ : మరి, స్టెతస్‌కోపు యివ్వలేదేమిట్రా?

రామ : ఇచ్చాడ్రా బాబూ, యిచ్చాడు. ఇదిగో! (అంటూ పేంటు జేబునుండి తీస్తాడు.)

దేవ : జేబులో యెందుకు పెట్టావురా? మెళ్ళో వేసుకోలేక పోయ్యావూ?

రామ : (మందహాసంతో) మంచిమాటే చెప్పావురా! ఎవరన్నా నన్ను డాక్టరే అనుకొని పిలుస్తే, యింకేమన్నా వుందా? పరుగు లంకించుకోవల్సి వస్తుంది.

విజ : పోనీరా, యెలాగో సంపాదించావు....అంతే చాలు. ఈ ఒక్కక్షణం మన అవసరం తీరిందంటే, యిచ్చేయొచ్చు.

రామ : అన్నట్టు, ఒక్క సందేహంరా?

విజ : (బెదురుగా) ఏమిటి?

రామ : మీ నాన్నగారు నీకు యేం జబ్బని అడిగారే అనుకో. అప్పుడేం చెప్పడం? టైఫాయిడ్ అని చెప్పడమా? మలేరియా అని చెప్పడమా? ఇంకేమని చెప్పడం?

దేవ : (విసుగ్గా) సమస్యలకి అంతులేకుండా వుందిరా?

రామ : మరేమిటనుకున్నావు? ఒక అబద్ధం కప్పిపుచ్చాలంటే, యెన్ని అబద్ధాలాడాలి? యెన్ని సమస్యల్ని పరిష్కరించాలి?

విజ : అయితే, యిప్పుడేం చెపుదామని నీ వుద్దేశం?

రామ : అదే నే నడుగుతున్నది...?

దేవ : దీనికీ ఓ ఆలోచనేన్రా? ఈ రోజుల్లో తరచూ వచ్చేరోగం ఒకటుందిగా?

విజ : ఏమిటి?

దేవ : ఇన్‌ఫ్లూయంజా...

రామ : (నవ్వుతూ) భేష్! సమయానికి మంచిసలహా యిచ్చావురా...

విజ : (మందహాసంతో) ఈ వేళ మనవాడిబుర్ర అమోఘంగా పనిచేస్తుందిరా రామం.

రామ : నిజమేమరి!....అయితే విజయ్, డాక్టరుగా వచ్చినందుకు నాకు ఫీజు యిస్తావుగా? (నవ్వుతాడు మెల్లగా)

విజ : (నవ్వి) బిల్లు పంపితే యిస్తా.

రామ : ఇంత శ్రమపడుతున్నా, ప్రస్తుతానికి ఫలితం లేదన్నమాట?

విజ : ఈ ఘోరవిపత్తు నుండి బైటపడనీ! నాలుగు యిడ్లీ, ఓ కాఫీ సేంక్షను చేస్తాను.

దేవ : మరి, నా మాటేమి?

రామ : నువ్వేవిధంగా కష్టపడుతున్నావురా?

దేవ : బావుంది....బావుంది. ముఖ్యంగా, సలహాలిచ్చింది నేను. మన యీ నాటకం సవ్యంగా అంతమయ్యిందీ అంటే, దానికి కారకుణ్ణి నేను....కాదూ, కూడదూ అంటారా, అసలు విషయం బైటపెట్టేస్తాను.

విజ : (రెండుచేతులు (విసుగ్గా) జోడించి) బాబ్బాబూ! నీకూ యిచ్చుకుంటాన్రా! నా దగ్గర యెప్పుడూ తిననట్టు చెప్తారేం?

దేవ : అబ్బే! పూరికనే అంటున్నారా విజయ్. మరేమీ అనుకోకు.

విజ : సరేగాని, మనం యిక రెడీగా వుండాలి. మా నాన్నగారు వచ్చేస్తారేమో!

రామ : నువ్వు పంచమ్మీద చేరబడరా!

విజ : ఇప్పట్నుంచేనా?

రామ : ఔను. ఆక్షణంలో తడబడిపోతావేమిటి! ఒరేయ్ దేవా....

దేవ : ఏమిట్రా?

రామ : ఏదీ, ఆ కుర్చీ యిలా తెచ్చి యిక్కడ వెయ్యి, నేను కూచుందుకు వీలవుతుంది. ఆ స్టూలుకూడా తెచ్చిపెట్టు. నా మెడిసిన్ బేగ్ దానిమీద పెట్టాలి.

దేవ : నిజమైన డాక్టరులానే అథారిటీ చెలాయిస్తున్నావేమిట్రోయ్?

రామ : క్షణికమైన యీ అవకాశాన్ని వినియోగించుకోనీ మరి. (నవ్వుతాడు)

దేవ : సరే....తప్పుతుందా మాకు? నువ్వేం చెప్పినా ప్రస్తుతం చెయ్యాల్సిందే! (కుర్చీ, స్టూలు తెచ్చివేస్తాడు.)

రామ : (మెడిసిన్ బేగ్ స్టూలుమీదపెట్టి, ఠీవిగా కుర్చీలో కూచుంటూ) ఆ! బావుంది.

దేవ : (అసూయగా) ఏమి దర్జారా?

రామ : ఇప్పుడీ యేడుపెందుకురా! నిన్ను వెయ్యమంటే యీ వేషం వేశావు?

విజ : (విసుగ్గా) అబ్బబ్బ! యీ ఆర్గ్యుమెంట్సు కట్టిపెట్టండిరా బాబూ! (మామూలుగా) ఒరేయ్ దేవ్....

దేవ : ఏఁరా?

విజ : మా నాన్న వస్తే, కూచుందుకు మరో కుర్చీకూడా లేదురా.... ఏం చేస్తాం?

దేవ : నా రూమ్నుండి తెస్తానుండురా.

విజ : వేగిరం వెళ్ళయితే.

దేవ : ఇప్పుడొచ్చేయనూ. (బైటికి చరచరా నిష్క్రమిస్తాడు.)

రామ : ఓ సిగరెట్ వుంటే యిలాయివ్వరా విజయ్....

విజ : ఇప్పుడేమీ వద్దురా, మా నాన్న వచ్చే వేళయ్యింది. ఏ క్షణంలోనైనా రావచ్చు. సిగరెట్ నువ్వు కాలుస్తుంటే చూస్తూ చూస్తూ, నే నూరుకోలేను. ఆ వెధవ ఆకర్షణ అల్లాంటిది. అంతలోగాని, ఆయన అడుగు పెట్టారంటే, యింకేమన్నా వుందా?

రామ : వస్తున్నారనగానే బూటుతో నలిపేస్తాంగా?

విజ : పోనీ అలాగేఅనుకుందాం. మరి, కాల్చిపారేసిన పీకలు మాయంచేస్తావా? ఎందుకురా ఆ గొడవంతాను. కాస్సేపు ఓపికపట్టకూడదూ?

రామ : ఖర్మ! అలాగేమరి. ..యేంచేస్తాం?

(బైట జోడు చప్పుడు విన్పిస్తుంది)

విజ : (గాభరాగా) ఎవరో వస్తున్నట్టుంది....మా నాన్నగారేమో!

రామ : దేవరాజు, అయివుంటాడ్రా!

విజ : ఏమోన్రా! మా నాన్నగారే యెందుకై వుండకూడదూ? మంచిసమయానికి, యీ దేవగాడు బైటికివెళ్ళాడు మనల్ని సస్పెన్సులో ముంచేయడానికి. వెళ్ళి కాస్త చూడరా!

రామ : (విసుగ్గా) మంచిఅవస్థే! (తలమాత్రం ముందుకివంచి చూస్తూ) దేవరాజేనార్రి!

విజ : (తృప్తిగా) అయితే, ఫరవాలేదు.

దేవ : (కుర్చీ తీసుకునివస్తూ) అబ్బ! ఎంతబరువుందిరా, ఇది మనల్ని రోజూ మోస్తుందిగాని, ఒక్కసారి దాన్ని మనం మోసేసరికి, జబ్బలు అల్లల్లాడుతున్నాయి. (కుర్చీవేసి చేతులు ఝూడిస్తాడు)

విజ : మామూలుకుర్చీ మోశావో లేదోగాని, మణుగుబరువు మోసినట్టుగా బాధపడిపోతున్నావేమిట్రా?

దేవ : మోసినవాడికే తెలుస్తుంది, ఆ బరువేమిటో; కూర్చున్నవాళ్ళకేం తెలుసు?

విజ : (నవుతూ) సరేగాని, దేవ్, నువ్వుమాత్రం నాకు వుపచర్య చేస్తున్నట్టుగా నటించాలి. పొరపాటునైనా సరే, వీణ్ణి చనువుగా పలుకరించడంగాని, మాట్లాడ్డంగాని, పరిహాసమాడ్డంగాని, జరక్కూడదు.

దేవ : జీ! అలాగే! మనకిదో అగ్నిపరీక్షలా వుంది. మరేం చేస్తాం?

రామ : ఏమిట్రా విజయ్, మీ నాన్నగారు యింతవరకూ వచ్చారు కాదేం? మెయిలు లేటుగావచ్చిందా యేమిటి?

విజ : ఏమోమరి! మనం ముందుగానే తెలుసుకుని వుండాల్సింది.

దేవ : (వింటున్నట్టు పోజుపెట్టి) ఏదో రిక్షా మనగదిముందు ఆగినట్టుందిరా?

విజ : చూడరా....చూడరా యెవరో!

దేవ : (గాభరాపడి) ఏమిటోన్రా, నాకు కాళ్లు వణుకుతున్నాయి.

(పైడు కర్టెనులోంచి తొంగిచూసి) ఒరేయ్.... మీ నాన్న గారేనా?! చచ్చాం.... ఎలారా....?

రామ : అప్పుడే నువ్వు చెమట్లుపోస్తున్నావేమిట్రా దేవ్? ముందుంది ముసళ్ళపండగ....వచ్చి వీడిమంచందగ్గర నుంచో! ఒరేయ్ విజయ్, నువ్వు పడుండరా బాబూ! (విజయ్‌కుమార్ మంచమ్మీద ఆత్రంగా ఒరుగుతాడు. రామచంద్ర స్టెతస్కోపుతో విజయ గుండెల్ని పరీక్షిస్తుంటాడు ..)

[బైటనుండి యాభై పైబడిన వ్యక్తివస్తాడు. తెల్లని పంచె, షర్టు, దానిపై కోటువేసుకుని వుంటాడు. చేతిలో చిన్నబేగ్ మాత్రం వుంటుంది]

వెంక : (వస్తూ) ఎట్లావుందండీ డాక్టరుగారూ? (ఆత్రంగా కొడుకువేపు, డాక్టరువేపూ చూస్తాడు)

రామ : (పరీక్ష కట్టిపెట్టి) గట్టిగా మాట్లాడకండి.... (ఖాళీకుర్చీ చూపుతూ) అలా కుర్చీలో కూచోండి.

వెంక : (ఉస్సురనుకుని కుర్చీలో కూచుంటూ) ఎలావుందండీ? ప్రమాదమేమీ లేదుకదా?

రామ : అబ్బే! మీ రేం గాభరాపడకండి. ఇన్‌ఫ్లూయంజా! అంతే, మరేమీకాదు. ఇప్పుడీ జ్వరాలు విరివిగా వస్తున్నాయిలెండి.

వెంక : (కాస్తతాపిపడి) అంతేఅంటారా? సరిగ్గా పరీక్షచెయ్యండీ! చూడండి, యేదైనా కాంప్లికేటెడ్ కేసయితే, యెవర్నయినా మంచిడాక్టర్ని రప్పిద్దాం.

రామ : (కాస్తంత కోపాన్ని అభినయిస్తూ) పెద్దలు, మీరలా అనడం భావ్యంగాలేదండీ! నేను యం. బి. బి. యస్. మెరిట్స్‌తో పాసైనవాణ్ణిగాని, లాకాయి లూకాయి డాక్టర్నికాదు. నా ప్రతిభనే మీరు శంకిస్తున్నపుడు, ట్రీట్‌మెంటు చెయ్యడం నాకుతగదు. ఆ మంచిడాక్టర్నే తెచ్చుకోండి. (బేగ్ సర్దుకుని చేతబట్టుకుని వెళ్ళిపోవడానికి వుద్యుక్తుడౌతాడు)

వెంక : (గాభరాగాలేచి, ప్రాధేయపూర్వకంగా) బాబ్బాబూ! నేరక అన్నాను. తప్పయ్యింది. ఏదో ఆతృతకొద్దీ అలాఅన్నాను. అంతేగాని, మీ ప్రతిభను శంకించికాదు. మరేమీ అనుకోకండి.

రామ : (మెడిసిన్ బేగ్‌ని స్టూలుమీదపెట్టి) మీ మాట కొట్టిపారేయ లేకపోతున్నాను యెందుకో! ప్రస్తుతానికి మందిస్తాను. మూడు మోతాదులతో తకీమని కట్టేస్తుంది.

వెంక : అంతకంటె కావల్సిందేమిటండీ! అసలు, వీడికి ప్రతీ పుత్తరంలోనూ రాస్తుంటాను ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడు కోరాఅని. డబ్బుకూ లోటుచెయ్యడంలేదు. వాడు రాసిందే తడవుగా పంపుతుంటాను. ఏంలాభం? రాత్రనక, పగలనక తిరుగుళ్ళ హెచ్చయ్యాయిగా మోసు, యిలా తెచ్చిపెట్టుకున్నాడు.

దేవ : అబ్బే! ఇన్నాళ్ళలా యిప్పుడు తిరగడంకూడా మానుకున్నాడండీ! ఎంతసేపూ, చదువు చదువంటూ, గదిలో కూచుంటున్నాడు.

వెంక : అసలు, ఆదేపనిగా చదవడంమాత్రం యేమంత మంచిదా యేమిటి? మొదట్నుంచీ వాడిఆరోగ్యం అంతంతగానే వుంది. అందుకే జాగ్రత్తగా వుండమని చెప్తుంటాను. (నిట్టూర్చి) వాడి భవిష్యత్తుపై నేనెన్ని ఆశలు పెట్టుకున్నానో, అన్ని ఆటంకాలూ, అవరోధాలూ, వస్తున్నాయి. ఏంచెయ్యను? ఇదంతా నా దురదృష్టం.... ఓ సంవత్సరం అనవసరంగా చదువు పోగొట్టుకున్నాడు....ఈ సరికి ఫైనలియర్‌కి వచ్చేసే వాడేగా!

దేవ : ఈ సంవత్సరం ప్యాసవడం ష్యూరండీ! బ్రహ్మ రుద్రాదులు అడ్డుపడినా, ప్యాసయితీరుతాడు. వాడి చదువుకి మేమంతా ఆశ్చర్యపోతున్నామంటే నమ్మండి!

వెంక : (తృప్తిగా) పోనీలే నాయనా! ఇప్పటికైనా వాడికి ఆమాత్రం శ్రద్ధరావడం మా అదృష్టమే; వాళ్ళమ్మకూడా బైలుదేరింది రావడానికి; నేను ముందుపోయి చూసి వస్తా ననుకుని వున్నపాటున వచ్చేశాను.

రామ : మీ అబ్బాయి విషయంలో మీ రేమీ కంగారు పడనవసరం లేదండీ; రెండుమూడు రోజుల్లో నయమైపోతుంది.

వెంక : మా క్కావల్సింది అదేకదా డాక్టరుగారూ!

రామ : నాతో యెవరైనా వస్తే, మందిస్తాను.

దేవ : నేను వస్తాను పదండి.

వెంక : వెళ్లు నాయనా, వెళ్లు....మీ స్నేహితులే, యీ సమయంలో ఆదుకోవాలి.

దేవ : ఎంతమాటన్నారు....?

[రామచంద్ర మెడిసిన్ బేగ్ సర్దుకుంటుండగా బైట్నుంచి వుత్సాహంతో, విసురుగా శశిభూషణ్ వస్తాడు. చురుగ్గా అగుపిస్తాడు. వస్తూనే వెంకట్రామయ్యని చూడడు....చేతిలో రెండు అయిదురూపాయిలనోట్లు పట్టుకుని చూపిస్తాడు]

శశి : (వస్తూ) ఒరేయ్ ఫ్రెండ్సూ! చూశారా యివేమిటో. నా బొమ్మకి ప్రతిఫలం....తెలుసా? ఈవేళ అందరంకలిసి సినిమాకి చెక్కేద్దాం....సెలవుపూట కూడాను. (రామచంద్రం దగ్గరికివచ్చి అతని వేషంచూసి) ఇదేమిట్రోయ్! డాక్టరు

పయ్యావెప్పుడూ ! (కళ్ళు నులుముకుంటూ) నేనేమీ కల గనటం లేదు కదా ! ఏంరా దేవా ? (దేవరాజువేపు మొహం తిప్పేసరికి వెంకట్రామయ్య అగుపిస్తాడు) నమస్కారమండీ. ఎప్పుడొచ్చారు ?

రామ : (కోపం అణచుకొంటూ) ఉష్ ! కాస్త మీ వాగ్ధాటి తగ్గిస్తారా ?

శశి : (వింతగా రామచంద్రవేపు చూస్తూ) ఏమిటిది ? బహు వచనంతో సంబోధిస్తున్నా వేమిట్రోయ్ రామం....? (మంచం వేపు చూసి) విజయ్.... పడున్నాడేం ? ఏమయ్యింది ? గంట క్రితం బావున్నాడే.

దేవ : (విసుగూ, కోపంతో) అబ్బబ్బ పూరుకోరా బాబూ. స్పుత్నిక్‌లా యెప్పుడూ 'రయ్యి రయ్యి' నుంటేనే సరి పోతుంది. నిదానమన్నది యెప్పుడూ లేదు. ఆయన నువ్వను కున్నట్లు మనరామం కాదు.

శశి : (చంద్రంవేపు పరిశీలనగా చూసి) కాదూ ?....మరి...? (దేవరాజువేపు చూస్తాడు.)

దేవ : (వెంకట్రామయ్య చూడకుండా సౌంజ్ఞచేసి) డాక్టరుగారు.

శశి : (తమాయించుకొని) డాక్టరు గారా...ఓ ! అచ్చంగా రామం లానే వున్నారు సుమా ! (డాక్టరువేపు చూసి ప్రాధేయంగా) క్షమించండి డాక్టరుగారూ ! మా రామం కూడా మీలానే వుంటాడులెండి. అందుకే పొరపాటు జరిగింది. మరేమీ అనుకోకండి.

రామ : (మందహాసంతో)ఫరవాలేదు లెండి. పొరపాటు మానవ సహజం. మనిషిని పోలిన మనిషిని చూసి పొరపడ్డంలో అసహజం యేమీ లేదు. అం....నాతో యెవరైనా రాకూడదూ, మందిస్తాను.

శశి : నేను వస్తాను పదండి....ఒరేయ్ దేవా, నువ్వు కాస్త మన వాడిని కనిపెట్టుకుని వుండరా.

దేవ : అలాగేన్రా.

[వెంకట్రామయ్యకి వాళ్ళప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా గోచరించింది. కొడుకువేపు ఓసారి చూశాడు. విజయ్, అసలు ప్రక్కకి తిరగడంగాని, అవయవాలు కదపడంగాని యేమీలేదు. సాలోచనగా తల పంకించుకున్నాడు.]

వెంక : డాక్టరుగారూ ?

రామ : ఏమండీ ?

వెంక : మావాణ్ణి నాతోపాటు తీసుకుపోవా లనుకుంటున్నాను. ఏమంటారు ? ఏం ప్రమాదముండదు కదా ?

రామ : (తుళ్ళిపడినట్టయ్యి) మంచిమాటే చెప్పారండీ ! ఆయన ప్రస్తుతం ఒక్క అంగుళం కదలడానికి వీల్లేదు. జ్వరతీవ్రత యింకావుంది చూడండి.

వెంక : (ఆలోచనలోపడి) మంచి చిక్కే వచ్చిందండీ. నాకో అర్జంటు వాయిదాకేసు వుంది. రేపు అక్కడ వుండకపోతే, నా క్లయింటుకి ప్రమాదం.

రామ : పోనీ, మీరు వెళ్ళండి....మేమందరం వున్నాంగా ! (వెంకట్రామయ్య చూడకుండా పక్కకి మొహం తిప్పి నాలుక కర్చుకుంటాడు.)

వెంక : మీరు డాక్టర్లు. పిల్చినప్పుడే వస్తారు....ఇకవీణ్ణి చూసే వాళ్ళెవరు ? మా యింటికి తీసుకుపోతే ఫరవాలేదు.

రామ : (సర్దుకుని) ఆయన స్నేహితులున్నారు కదండీ ! ఆ మాత్రం సహాయసంపత్తి దొరక్కపోవడానికి, యిదేం యెడారి అనుకున్నారా ? అటుపైన డాక్టర్ని నేనెలాగూ వున్నాను కదా ! ఫరవాలేదు లెండి.

శశి : ఔనండీ ! మేమంతా వున్నాం కదండీ ! వాడి కష్టమొకటీ మా దొకటీనా ? మీకు అంత జరూరుపని వున్నప్పుడు నిశ్చిం తగా వెళ్ళండి.

వెంక : (బాధగా) వెళ్ళడానికీ కాళ్ళు రాకుండా వున్నాయి. హరి భగవంతుడా ! ఎల్లాంటి విషమపరిస్థితి సమకూర్చావయ్యా. అబ్బ ! అబ్బ (గుండెమీద చెయ్యివేసి కుర్చీలో చేరబడి, అదోలా కళ్లు తేలవేస్తాడు.)

రామ : (గాభరాపడి) ఏవండీ, ఏవండీ, ఏమిటండీ అలా కళ్లు తేలవేస్తున్నారు ? ఒరేయ్ విజయ్....మీ నాన్నగారు....

[విజయ్ షాక్‌తిన్నవాడిలా మంచంమీంచి చెంగునదిగి తండ్రిని సమీపిస్తాడు.]

విజ : (రుద్ధకంఠంతో) నాన్నా ! నాన్నా ! ఏమయింది నాన్నా ? కొంచెం నీళ్ళు తీసుకురారా దేవా.

[దేవరాజు కూజాతోపాటు నీళ్ళుతెచ్చి విజయ్ చేతిలో పోస్తాడు. విజయ్ తండ్రిమొహమ్మీద నీళ్లు జల్లుతాడు.]

విజ : (రుద్ధస్వరంతో) నాన్నా ! నాన్నా ! ఏమయింది నాన్నా ? నేను బాగానే వున్నాన్నాన్నా.

శశి : మంచిచిక్కే తెచ్చిపెట్టుకున్నాంరా ? డాక్టర్ని పిలిస్తే బావుంటుందేమో.

దేవ : ఔన్రా. వెళ్ళేదా ?

రామ : వెళ్ళరా. వేగిరం వెళ్ళు.

విజ : ఉన్నపాటునరమ్మను. రిక్షాచేయించి మరీ తీసుకురారా. వెళ్లు.

దేవ : నిమిషంలో వస్తాను. (వెళ్ళబోతాడు)

వెంక : (కళ్ళు తెరిచి, గర్జించేట్టు) ఆగు!

[అంతా తెల్లమొహాలు వేసి, గుటకలు మింగుతారు. విజయకుమార్ కంపించి పోతుంటాడు.]

రామ : (తడబడుతూ) ఏమండీ, కాస్తనయంగావుందా?

వెంక : (లేచినించుంటూ) ఏం? నువ్వు వైద్యం చెయ్యాలనుకుంటున్నావేమిటోయ్? నా కళ్ళు కప్పడానికి యెంత నాటకమాడారు? ఏంరా, విజయ్ (కొడుకువేపు తిరిగి) నువ్విలా తయారవుతావని నే నెప్పుడూ అనుకోలేదు. లేనిరోగం తెచ్చిపెట్టుకుంటావెందుకు? డబ్బు పంపమంటే పంపనూ? (కోపంగా) పలకవేంరా?

విజ : (మాట్లాడలేక తడబడతాడు)

[దేవరాజు, శశిభూషణ్ అక్కణ్ణించి పారిపోడానికి ప్రయత్నిస్తారు. రెండడుగులు వేశారోలేదో]

వెంక : (కటువుగా) ఆగండోయ్! ఎందుకు జారిపోతారు? మీరంతా తోడుదొంగలేకదూ? అందరూకలిసి నాకే టోకరా యివ్వాలనుకున్నారా! ఎంత మోసం! ఈ ముసలివాణ్ణి మోసగించాలని మీకెలా బుద్ధిపుట్టిందోయ్? అసలు, యెలా మనసొప్పిందీ అంటాను! మీరు చదువుతున్న చదువులకు, యిదేనా సార్థకత? ఏం? చెప్పరేం? జట్టుగా నలుగురున్నారు. ఒకరికి కాకపోతే, ఒకరికైనా బుద్ధి లేకపోయిందా?

రామ : (తడబడుతూ) అదికాదండీ...

విజ : (మొహం దించుకుని) క్షమించండి నాన్నా! పొరపాటయింది.

రామ : (మొహం దించుకుని) బుద్ధి వచ్చిందండీ! అనుభవంలేక కుర్రతరహాగా ప్రవర్తించాం. మరెప్పుడూ యిల్లాంటి పొరపాటు జరగదండీ!

దేవ : చదువుకోసం, యెన్నోమైళ్ళ దూరంవచ్చి, చదువుకోకండా, యీ వేషాలన్నీ వెయ్యడం, నిజంగా క్షమించరాని తప్పు. మా తప్పు యిప్పుడు తెల్సుకున్నాం. తప్పుకి ప్రాయశ్చిత్తంగా చెవులు నులుపుకుంటున్నాం. (చెవులు మెలిపెట్టుకుంటాడు.)

శశి : అసలు, నాకు వీళ్ళ ప్లానేమిటో తెలీనే తెలీదండీ! నేను రావడంవల్లనే రసభంగం జరిగింది. ఒకందుకు అది మంచిదే అయ్యిందనుకోండి. లేకపోతే, యింకా మీరు ఓ విధమైన మాయలో కొట్టుకుని వుందురు...దాంతోపాటు మనోవేదన....

వెంక : నిజమే నబ్బాయ్. నువ్వు చేసిన సహాయాన్ని నే నెప్పుడూ మర్చిపోలేను, కాని....

శశి : (అందుకుని) అదే నేనూ చెప్పాలనుకుంటున్నానండీ! వాళ్ళతోపాటు నేనూ యీ నాటకంలో కలియడం తప్పే! కాని, మాకుమాకు వున్న అనుబంధం అలా చేయించింది. నిజంగా మేం చేసింది క్షమించరాని తప్పు. లెంపలు వేసుకుంటున్నాం....(లెంపలు వేసుకుంటాడు.)

వెంక : (గంభీరంగా) మీలో అందరికీ కనువిప్పు కల్గడం, సంతోషదాయకం. పశ్చాత్తాపం, కలుషహృదయాల్ని పునీతం చేస్తుంది. కాని, నిజంగా మీలో మార్పువచ్చిందా, అన్న సంశయం నన్ను వొదిలిపెట్టడంలేదు. ఒకసారి నటనకి దాసులమైతే, యిక ఆ బానిసత్వం మనల్ని జీవితాంతం విడువదు.

విజ : (ప్రాధేయంగా) నాన్నా! మా మాటలమీద నమ్మకముంచండి నాన్నా! జరిగిందేదో జరిగింది. మాలో ఒక నూతనజ్ఞానాన్ని కలిగించారు మీరు. ఇది మా భవిష్యత్తుకే ఒక బాట.

రామ : ఔనండీ! మీ విజయ్ చెప్పింది అక్షరాలా నిజం. మా సంగతి మీకు తెలీదు. మనుషులం నలుగురమే అయినా, మా మనసులుమాత్రం ఒకటే అనుకోండి. మాలో, ఆ నైతిక బలం వుంది.

వెంక : ఊఁ....

శశి : ఇంకా మీరు నమ్మకపోతే యెలా చెప్పండి సార్? చిన్నవాళ్ళం .... తప్పుచేశాం .... పెద్దలు మీరు ... ఈ సారికి క్షమించండి.

దేవ : (సవినయంగా) నమ్మండీ! మీరలా గంభీరంగా, మౌనం వహిస్తే, మా హృదయాల్లో యేదో తెలియని బాధరగుల్తోంది. క్షమించానని చెప్పండి, అంతవరకూ మాకు తృప్తి కలుగదు.

వెంక : (మందస్మితంగా) ఊఁ....సరే! మీరునలుగురూ యేకకంఠంతో చెప్తుంటే, నేను నమ్మక చేసేదేముంది? అయినా, నేను చెపుతున్నది మీ మంచికోసమే కదా! బాగుపడినా, చెడినా, మీరే బాధ్యులు. (నవ్వి) ఎలాగయితేనేం — జీవితంలో యెప్పుడూ మరువలేని ఓ ఘట్టాన్ని చక్కగా ప్రదర్శించారు.

శశి : (అందుకుని) మధ్య రాహువులా నేను రాకపోతే, రక్తికట్టి వుండేవండీ!

వెంక : అయినా, యిప్పుడుమాత్రం రక్తికట్టలేదూ? అందుకే, మీ ప్రజ్ఞకి పారితోషికం వుండాలి ఇవ్వాళ మీ అందరికీ హోటల్లో భోజనం పెట్టిస్తా పదండి...

[అందరి మొహాలూ వికసిస్తాయి]

(తెర)

★

ధన్యజీవి శ్రీకృష్ణమూర్తి శాస్త్రి

గిడుగు వేంకట సీతాపతి

శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారివంటి శతాధిక గ్రంథకర్తలు బహు అరుదు. శాస్త్రిగారు రెండువందల పైచిలుక గ్రంథాలు రచించారు. పద్యం, గద్యం, నాటకం, జీవితచరిత్ర ఇత్యాది సాహితీ ప్రక్రియ లన్నింటిలోనూ వారు రచనలు చేశారు. వారి గ్రంథావళిలో పద్యకావ్యాలు ఎక్కువ. నూరు పద్యాలుగల చిరుకావ్యాలు మొదలు కొన్నివేల పద్యాలతో కూడుకున్న బృహత్తర గ్రంథాలవరకు వాటిలో వున్నాయి. శాస్త్రిగారి కవితాశైలి సర్వోత్కృష్టమైనది. భావ శబలతతో, భాషాపటిమతో వీరిపద్యాలు ఒప్పారుతుంటాయి. శతవృద్ధులై యుండికూడా శాస్త్రిగారు ఇటీవలివరకు గంటకు నూరు పద్యాలు చెప్పి పండితోత్తములను రంజింపజేయగలిగారు. భగవంతు డొసంగిన మేధాశక్తిని నిరంతర సాధనద్వారా, అకుంఠిత దీక్షద్వారా సుసంపన్నం చేసి సరస్వతీ సమారాధనకు అర్పితంచేసిన ధన్యజీవి శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారు. ఆరు దశాబ్దాలకు పైగా సాహితీ సమారాధనలో గడిపి ప్రజలచేత, ప్రభుత్వంచేత, సారస్వత పోషకులచేత, ఆంధ్ర విశ్వవిద్యాలయం చేత ఘనంగా కీర్తింపబడిన మహానుభావు డాయన. కవిరాజ, కవిబ్రహ్మ, విశ్వకవి, వేదవిద్యా విశారద, కవిసార్వభౌమ, కళాప్రపూర్ణ, మహామహోపాధ్యాయ, ప్రసన్న వాల్మీకి, ఆంధ్రవ్యాస, అభినవ శ్రీనాథ ఇత్యాది బిరుదులను పదింటిని శాస్త్రిగారు పొందారు.

ఈ కవిశేఖరుడు తూర్పుగోదావరి జిల్లాలోని దేవరపల్లి అనే చిన్న గ్రామంలో సదాచార సంపన్నమైన ఆంధ్ర బ్రాహ్మణ కుటుంబంలో 1866 అక్టోబరు 29 వ తేదీన జన్మించారు. వారి జనకుడు శ్రీ వెంకట శాస్త్రిగారు యజ్ఞమాచరించి సోమయాజి అయినారు. జనని శ్రీమతి సుబ్బసోమిదమ్మగారు.

శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారు సనాతన ధర్మాన్ననుసరించి సంప్రదాయకమైన విద్య నార్జించారు. వారు కడు లేత ప్రాయంలోనే సంస్కృతాంధ్ర భాషలలో మంచి ప్రావీణ్యత సంపాదించారు. సంస్కృతంలో నిధి. చతుర్వేదాలకు వ్యాఖ్యానాలుచెప్పి, సంస్కృత శ్లోకాలు అనర్గళంగా చెప్పగలిగిన ఉద్దండుడు. సాహితీక్షేత్రంలో కృషి సాగించిన మొదటి రోజులలో శ్రీకృష్ణమూర్తి శాస్త్రిగారు 'అష్టావధానాలు', 'శతావధానాలు' చేసి అందరి మన్ననలు పొందారు. ఒక పర్యాయం వారు మయూర్‌భంజ్ రాజాస్థానంలో సంస్కృతంలో శతావధానం చేసి సదస్యులను ఆనందపరవశుల జేశారు. తరువాతికాలంలో వారికి అవధానాలపై విశ్వాసం సడలి, వాటికి వినియోగించే అమూల్యసమయాన్ని, శక్తిని శాశ్వతకీర్తిని తెచ్చిపెట్టగల సద్గ్రంథ రచనకు వెచ్చించడం యుక్తమని వారు భావించారు.

శాస్త్రిగారి గ్రంథా లన్నింటిలోకి సంస్కృతానువాదాలు వారికి గొప్ప కీర్తినార్జించాయి. అవి అనువాదాలుగా కాక అన్నివిధాలా మౌలిక రచనలుగా వుంటాయి.

శాస్త్రిగారి "శ్రీకృష్ణ మహాభారతం", వారి గ్రంథాలలో తలమానికం. ప్రసిద్ధ పురాణమైన మహాభారతానువాదాన్ని ఆది ఆంధ్రకవి నన్నయ భట్టారకుడు ప్రథమంగా చేపట్టాడు. కాని మూడు పర్వాలైన పూర్తి చేయకుండానే నన్నయ అకాల మృత్యువు వాతబడ్డాడు. తరువాత తిక్కన, ఎఱ్ఱాప్రగడ దానిని పూర్తిచేశారు.

శ్రీకృష్ణమూర్తి శాస్త్రిగారు ఒక్క మహాభారతాన్నే గాకుండా, రామాయణాన్ని, శ్రీమద్భగవద్గీతను కూడా ఒక్కరే పూర్తిగా అనువదించారు. ముప్పది సంవత్సరాల స్వల్పకాలంలోనే వారీ యావత్తుపనిని ముగించగలిగారు. కవిత్రయం సంస్కృత మూలానికి న్యాయం చేకూర్చలేదనే అభిప్రాయంతోనే వారు మహాభారతానువాదానికి పూనుకున్నారు. ఇదేకారణం వల్ల రామాయణాన్ని తెనిగించారు. పోతనామాత్యుడు శ్రీకృష్ణపరమాత్మునిని ఒకింత స్త్రీలోలుడుగానూ,

చోరలక్షణాలు గలవాడుగాను చిత్రించినాడనే అసంతృప్తితో వారు మహాభాగవతాన్ని తెనిగించారు.

శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారి స్వతంత్ర రచనలలో "మధుకర విజయము" ప్రసిద్ధమైనది. ఇదొక పద్యాత్మకమైన నవల. 16వ శతాబ్ది చివరిభాగంలో ప్రవర్ధిల్లిన పింగళి సూరన రచించిన విఖ్యాతనవల "కళాపూర్ణోదయా"న్ని పెక్కుచోట్ల ఈ నవలారాజం మైమరిపిస్తుంటుంది.

సంస్కృత "తత్సమము''లతో మిశ్రితం కాకుండా, తెలుగు వర్ణమాలలోని కేవలం పదకొండు అక్షరాలతో వారు ఒక చిన్న పద్యం రచించారు. దానిని 1936వ సంవత్సరంలో మద్రాసు గవర్నరుగా వ్యవహరించిన సర్ కె. వి. రెడ్డిగారికి అంకిత మిచ్చారు.

"గౌతమి" అనే తొలితొలుత తెలుగు దినపత్రికను వారు 1908వ సంవత్సరంలో రాజమండ్రి నుంచి వెలువరించారు. మరో మూడు తెలుగు మాసపత్రికలకు సంపాదకత్వం వహించారు.

శాస్త్రిగారు "వ్యవహారిక భాషావాదా"న్ని ప్రతిఘటించారు అందుకు వారు "వజ్రాయుధం" అనే పత్రికను కూడా నడిపారు. తరువాత వారు ప్రఖ్యాత కవుల "ప్రయోగాల"ను అవి వ్యాకరణసూత్రాలకు భిన్నంగా వున్నప్పటికీ అంగీకరించారు. దినపత్రికలు వ్యవహారిక భాషను ఉపయోగించాలని కోరుతూ వారు ఆంధ్రప్రభకు లేఖకూడా వ్రాశారు.

రాజమహేంద్రవరంలో ప్రప్రథమ ఆంధ్ర ఆస్థానకవి శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి అధ్యక్షతన వైభవోపేతంగా జరిగిన ఉత్సవంలో శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి "కవిసార్వభౌమ" బిరుదప్రదానం చేయబడినది. శ్రీ వెంకటశాస్త్రిగారు, గురువరేణ్యులైన శ్రీ కృష్ణమూర్తిగారి ఎడమపాదానికి స్వహస్తాలతో గండపెండేరము తొడిగారు. అదొక చిరస్మరణీయమైన ఉత్సవం. ఆ సందర్భంలో శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారు ఇలా ప్రకటించారు :

నాకిచ్చిన గండపెండెర మిలన్ నాస్వత్వమే నాటికుం
గాకుండు న్వినుఁడేను ప్రాణములతోఁ గన్పట్టునందాఁక నా
డాకాలన్విలసిల్లు నెప్పు చెడకుండన్ దీని నాంధ్రావనీ
ప్రాకామ్యంబగు"యూనివెర్శిటి"వహింపన్ జెల్లు స్వత్వంబుగన్.

శాస్త్రిగారి ఔదార్యాన్ని, ఘనతను చాటడానికి ఈ సంఘటనొక చిన్న ఉదాహరణమాత్రమే. భగవంతుడు శ్రీవారి ఆత్మకు శాంతి ప్రసాదించుగాక !

— (ఆంగ్లవ్యాసానికి అనువాదం)

మానవుడు, పరిస్థితులకు, కేవలం బానిస అని తన ప్రవర్తనను తాను నిర్ణయించుకోలేని నిస్సహాయుడని అనుకోవడం పొరపాటు శారీరక మానసిక ధర్మమును నిర్ణయించడంలో అనువంశిక పరిసరాల ప్రభావాలు అధికంగా వున్నా, వాటిని మానవుని మేధాశక్తి సరిదిద్దగలుగుతుంది. మానవునికి కావలసినది సంకల్పబలం.

—గురజాడ

* * * *

ప్రజాస్వామ్యంలో స్త్రీ, పురుషుడనే భేదం లేకుండా ప్రతి ఒక్కరూ తమబాధ్యతను గుర్తెరగాలి. పంచాయతీ రాజ్యానికి అర్థం అదే.

—గాంధీజీ

జనాభా గణనము

యస్. శ్రీనివాసాచార్య

భారతీయ వాస్తవికత
ప్రతిబింబిత మొనరించే
ఘనాదృశ్యమనదగు నీ
జనాభాల పరిగణనం.

పందొమ్మిదివందల, యర
వై యొక్కటి, ఫిబ్రవరిని
పదవ తేదినాటినుండి
ప్రారంభంబగు నియ్యది.

నాటిమొదలు నెలయాఖరు
నాటి వఱకు దీనిలోన
మార్చియైదు ముగియులోన
చేర్చవలయు ప్రతి వానిని.

అబ్ధివలయితామల భర-
తావని ప్రతి యంగుళమును
నధివసించు ప్రతి మనుజుడు
అంకితమగు నిందులోన.

వ్యవసాయం చేయువారు
వ్యవసాయపు కూలీలును
లఘుగురు పారిశ్రామికు
లందరు వత్తురు దీననె.

ఉద్యోగులు మరియు, ని
రుద్యోగులు, అక్షరాస్యు
లధిక విద్యగల వారలు
అసలు చదువులేనివారు,

పనిచేయగ గలవారలు
పనిదొరకని పనివారలు
పనివచ్చియు చేయకుండ
అనిశము తిని పండువారు,

స్వయంపోషకత్వ రీతి
సంపాదించెడి వారలు
పరసంపాదిత భుక్తము
హరాయించి బ్రతుకువారు,

కుంటివారు, గూనివారు,
గ్రుడ్డివారలాదియైన
యాచకులును, అడిగికొనుచు
అలవాటై తిరుగువారు

వేయేటికి మానవులను
పేరుగల్గు ప్రతివారలు
జనాభాల గణనములో
'వినా' యనక చేరగలరు.

రానున్న ప్రణాళికలకు
రాచబాట యీ గణనము
సువిశాల మహావృద్ధికి
సూర్యోదయ మీ గణనము.

పరిపూర్ణ సుశిక్షితులై
పరిజ్ఞానులైన వారు
పదిలక్షలమంది, దీని
పనిచేయగ నున్నవారు.

ఇది పవిత్రమగు కార్యము
ఇది పవిత్రమగు సవనము
జనములకును, గణకులకును
సమ్యక్ సౌహార్దం వలయును.

జాతీయత సంస్మరించి,
నీతిమార్గ మనుసరించి,
పనిచేసేవారు, మరియు
జనులు కృషియొనర్చవలయు

ఏ యొక్కరి పనిగాదిది
ఏ యొక్కరి కొరకుగాదు,
భరతభూమి మృత్తికలో
ప్రభవించిన ప్రతివానిది.

ప్రతివారి రహస్యంబును
పరిరక్షించెడి బాధ్యత
ప్రభుత్వాని దనుహామీ
ప్రతివారలు నమ్మదగును.

అడవిదహించునట్టి సమయమ్మున నగ్నికి వాయువాప్తమి
త్రుడుగ నటించి దీపమయి తోచినయంతన యార్పివేయఁ జూ
చెడిని మహోద్ధతుండయిన స్నేహితుడున్ గ్రహియించిపోవ శ
త్రుడుగద వాయువగ్ని కిదె రూపింకో యొక్కరి కొక్కరీ భువిన్.

—మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి

* * * *

ప్రజాస్వామిక జీవన విధానాన్ని ఎన్నుకున్న దేశాలు తమ ప్రజలలో అధిక సంఖ్యాకులను నిరక్షరాస్యులు, అజ్ఞానవంతులుగా వుంచి లాభం లేదు. దేశం పరిస్థితి, గౌరవం, భవిష్యత్తు కడకు మానవుని శక్తి యొక్క విలువను బట్టి నిర్ణయ మౌతుంది.

—మౌలానా అబుల్ కలాం ఆజాద్

విక్రమోర్వశీయము

'పిపాసి'

కాళిదాసు రచించిన రెండవనాటకము విక్రమోర్వశీయము.

దీని ఇతివృత్తము ప్రఖ్యాతమైనదే. దీని ప్రసక్తి ఋగ్వేదమందు, మహాభారతమునందు, శతపథబ్రాహ్మణమునందును కలదు. ఇతివృత్తము పౌరాణికమైనను కాళిదాసు కవనమున నవ్యస్వరూపము దాల్చినది. మహాభారతమునగల ఈ గాథలో ఊర్వశీపురూరవుల కార్గురుకుమారులు కలిగిరని ఉన్నదేకాని వారి సంయోగ వియోగముల ప్రసక్తిలేదు. "సంగమే విప్రయోగాంతశ్చ" అను నానుడి సార్థక మాపాదించుటకే కాబోలు, రసనిష్పత్తికై నాయికా నాయకులకు సంయోగవియోగములు కల్పించెననితోచును. పూర్వకవుల నాటకములను సభాసదులు తిలకించిరనియు, విక్రమోర్వశీయమను అపూర్వనాటకమును ప్రదర్శింతునని సూత్రధారుడు పలికినాడు. ఈ నాటకమందలి ప్రథమ చతుర్థాంకములు అత్యున్నతస్థాయి నందుకొన్నవి. ప్రథమాంకమునందలి సన్నివేశములు చక్కని కళానైపుణ్యముతో నిర్వహింపబడినవి. ఊర్వశీవిక్రముల వియోగము వారి పరస్పర పరిదేవనములు సహృదయహృదయంగమములుగా ఉన్నవి. చతుర్థాంకమునందు సభాసదులు విక్రముని దుఃఖమునుపాల్గొని సుఖాంతము కావలెనని ఆశింతురు. ఈ ఘట్టమును కాళిదాసు, వాల్మీకి రచించిన సీతావిరహముల మనసునందుంచుకొని వ్రాసియుండునని తోచును. ఈ నాటకమందు 29 ఆర్యావృత్తములు, 30 శ్లోకములు, 12 వసంతతిలకావృత్తములు, 11 శార్దూలవిక్రీడితములును కలవు. ప్రథమాంకము హేమకూట శిఖరములపై ప్రారంభమగును. దీనివలన కాళిదాసునకు ప్రకృతిసౌందర్యము పైగల మక్కువ అందును విశేషించి హిమాలయ నిర్ఝరకందరములపై కల మోజు వ్యక్తమగుచున్నది.

కథాసారము

పురూరవుడు సూర్యదేవుని ఆరాధించి తిరిగి వచ్చుచుండగా అప్సరసల ఆక్రందనమువినెను. వారివలన కేశియను రాక్షసుడూర్వశిని బందిగా గొనిపోయెనని విని వారిని హేమకూట పర్వతమున నిరీక్షించుమనిచెప్పి త్రుటిలో కేశిని సంహరించి ఊర్వశిని రక్షించి రంభాద్యప్సరల కప్పగించెను. ఊర్వశి మూర్ఛనుండి తేరుకుని తనను రక్షించినవానిని పురూరవచక్రవర్తిగా తెలుసుకొని ఆతనియందాసక్తహృదయ అయ్యెను. చిత్రరథుడను గంధర్వరాజు దేవేంద్రునిపంపున ఊర్వశిని రక్షించుటకు నియుక్తుడై హేమకూటమునకువచ్చి పురూరవునికూడ స్వర్గమునకురమ్మని ఆహ్వానించెను. పురూరవుడేదో కారణమును పేర్కొని ప్రస్తుతము స్వర్గమునకు రాలేననిచెప్పెను. పురూరవుడు తన నగరికి తిరిగివచ్చినను, అతనిమనసు ఊర్వశియందే లగ్నమై ఉండెను. పురూరవుని పట్టమహిషి అతనియందలి మార్పును గమనించి తత్కారణమును తెలుసుకొనవలసినదని చెలులను నియోగించెను. విదూషకునితో రాజు తన విరహస్థితిని తెలుపుచున్నసమయయమున ఊర్వశి చిత్రలేఖతోకూడ తిరస్కరిణీ విద్యాప్రభావమున అచ్చటికివచ్చి నిల్చెను. కాని ఇంతలో దేవ సభనుండి పిలుపురాగానే తాను (ఊర్వశి) వ్రాసిన శ్లోకద్వయము గల వ్రానిపట్టను అచటనే వదలిపోయెను. పట్టమహిషి రాజు పరిస్థితి స్వయముగా తెలుసుకొనుటకు రాగా ఆ శ్లోకద్వయముకల వ్రానిపట్ట ఆమెచేతికి చిక్కెను. అమె వాటిని చదివి రాజుతో మాట్లాడకయే అంతఃపురమునకు వెళ్ళెను. ఇది యిట్లుండగా భరతుని ఆశ్రమమున లక్ష్మిపాత్ర అభినయించుచు నృత్యము చేయుచున్న ఊర్వశి పురుషోత్తముడని పలుకుటకుబదులు పురూరవుడని పల్కెను. దానికి భరతముని కినిసి ఆమెను భూలోకమునకువెళ్ళమని శపించెను. కాని ఇంద్రుని అనుగ్రహమువలన ఒకకుమారుడు కలుగువరకు ఉండవచ్చునని ప్రతిష్ఠాననగరమునకు వచ్చెను. రాణి తనప్రవర్తనకు సిగ్గువడి "ప్రియానుప్రసాదనము" అను వ్రతము చేయుటకుగాను, రాజును ఒకపున్నమినాటి రాత్రి ప్రాసాదోపరిభాగమునకు దోడ్కొనివచ్చెను. తన వ్రత సమాప్తి

యైనపిదప పురూరవుడు ఊర్వశిని పెండ్లియాడవచ్చునని అనుజ్ఞ ఇచ్చెను. ఇతఃపూర్వమే వచ్చి ఈ పరిస్థితిని చూచుచున్న ఊర్వశి చక్రవర్తి వశమయ్యెను.

కొన్ని సంవత్సరములు గడచిన పిదప ఒకనాడు పురూరవుని వెంట వినోదార్థము, ఊర్వశీసమేతుడై గంధమాదనమునకు పోయెను. అచ్చట రాజు (పురూరవుడు) విద్యాధర కన్యనుచూచుచుండ ఊర్వశి ఈర్ష్యతో రాజు పిలదనుచున్నను వెళ్ళి కార్తికేయుని గుహలోనికి వెళ్ళి లతగా మారిపోయెను. ఈ విషయ మెరుంగక ఊర్వశికై అన్వేషించుచున్న పురూరవుడు "సంగమనీయము" అను మణినికాంచి దానితో ఒక తీగెను కౌగిలింపగానే ఆ లత ఊర్వశిగా మారిపోయెను. సంగమనీయమను మణి ఊర్వశి కొప్పున ఉండెడిది. వారిరువురు ప్రతిష్ఠాన నగరమునకు వెళ్ళిరి. కొంతకాలమీ విధముగ గడచుచుండ ఒకినాడు "సంగనీయమణి"ని ఒక గ్రద్ద మాంసఖండమని తలంచి తన్నుకొని పోయెను. రాజు దానిని సంహరింప వలెనని ప్రయత్నించెను కాని అది తప్పించుకొనిపోవు లోపలవేరొక బాణప్రయోగము వలన అది మరణించెను. బాణమును మణిని చూడగనే ఆ బాణ ప్రయోగము చేసినవాడు తన కుమారుడగు ఆయువనియే తేలినది. పురూరవుడు తనకు కుమారుడెప్పుడు కల్గెనాయని చింతపడి నైమిశారణ్యమున తాను యజ్ఞము చేయుచున్నప్పుడు ఊర్వశి కుమారుని కనియుండునని మాత్రము తలంచెను. ఇంతలో చ్యవనుడు ఆయువును పురూరవుని దర్శనమునకు తెచ్చెను. ఊర్వశి పురూరవునకు ఆయువును సమర్పించి కానలకేగవలెనని నిశ్చయించుకొనెను. ఏలయన పురూరవు డూర్వశియందు గాంచిన కొడుకును చూడగనే మరల యామె స్వర్గమునకు రావలెనని దేవేంద్రుని ఆజ్ఞ. ప్రియా వియోగమును భరింపజాలక తానుకూడ అడవులకేగ పురూరవుడు నిశ్చయించుకొనెను. ఇంతలో దేవముని నారదుడు వచ్చి ఊర్వశి పురూరవునికి జీవితాంతము సాహచర్యము నెరవుచునేయుండగలదని అది దేవపతియాజ్ఞ యనిచెప్పి కథను సుఖాంతముచేయును. అంతేగాక నారదుని సమక్షముననే ఆయువునకు పట్టాభిషేకముకూడ జరిగినది.

ఈ నాటకమునందుకూడ గద్యపద్య సుభాషితములు దాదాపు ఏబదికిపైన కలవు. విక్రమోర్వశీయము ప్రధానముగా వినోదకరమైన నాటకము. ఆర్తరక్షణ, మర్త్యభూపాలులకు దేవపతితో మైత్రి నుద్బోధించుటయే పరమాశయములుగాగల నాటకము. కాళిదాసు శైలి ప్రాచీనమయ్యును దీర్ఘ పదసమాస పదఘటితముకాక, మృదుమధుర కోమలకాన్త పదావళీవిలసితము. శైలివై దర్భీరీతి. అయినను అర్థగాంభీర్యమువలన వ్యాఖ్యానసహాయము లేనిదే చదువ వలనుపడదు. నాయకుడు ధీరోదాత్తుడనుటకన్న ధీరదక్షిణుడనుట సమంజసము. నాయిక దేవవేశ్య. చతుర్థాంకమున ఊర్వశి నన్వేషించు పురూరవుని ముఖతః కాళిదాసు నలుబది శ్లోకముల గుప్పించినాడు. ఇవియన్నియు రాముడు సీతనన్వేషించు ఘట్టమును, భాగవతమున గోపికలు కృష్ణుని అన్వేషించుటను జ్ఞప్తికి తెచ్చును. ఈ నలుబది శ్లోకములు వివిధ లతానికుంజముల నుద్దేశించి వ్రాయబడినవి. ఇందు ప్రకృతి రామణీయకత చక్కగా వర్ణించబడినది.

ఉదాహరణకు కొన్ని శ్లోకములు

సరసి నలినపత్రేణాపి త్వమావృతవిగ్రహాం
నను సహచరీం దూరే మత్వా విరౌషి సముత్సుకః
ఇతి చ భవతో జాయాస్నేహాత్పృథక్స్థితిభీరుతః
మయి చ విధురే భావఃకాంతాప్రవృత్తిపరాఙ్ముఖః. (5-20)

పురూరవుడు చక్రవాకము నుద్దేశించి పల్కిన శ్లోకము. "నీ ప్రియురాలు సరస్సులో పద్మపత్రావృతమైనంతనే, నీ కెంతో దూరమైనటుల పరితపింతువు. ప్రియా విరహమువలని భయమింతగా నున్నది. కాని నా శితప్రియతముడనైన నాపై దాక్షిణ్యము జూపుటకే నిరాకరించుచున్నావు. ఊర్వశి ఉనికిని తెలుపు సమాచారమైనను చెప్పకున్నావు.''

మామాహుః పృథివీభృతా మధిపతిం నాగాధి రాజోభవా
నవ్యుచ్ఛిన్న పృథుప్రవృత్తి భవతో దానం మమాప్యర్థిషు
స్త్రీ రత్నేషు మమోర్వశీ ప్రియతమాయూధేతవేయవశా
సర్వం మామనుతే ప్రియావిరహజం త్వంతువ్యథాం
మాఽనుభూః. (5-25)

ఇది గంధసింధురము నుద్దేశించిన శ్లోకము. నన్ను రారాజు అందురు. నీవుకూడ గజరాజువు. నీవు నిరతము మదజలమును విసర్జింతువు. నా దానముకూడ నిరంతరమైనదే. అన్ని రత్నములలోను, నీకు కరేణు యూథమువలె ప్రియతమము. ఈ విధముగ మనకు సాదృశ్యము కలదు. కాని నావలె నీకు వియోగమనునదేలేదు.''

తన్వీమేఘ జలార్ద్రపల్లవతయా ధౌతాధరే వాశ్రుభిః
శూన్యేవాభరణైః స్వకాల విరహాద్విశాన్తపుష్పోద్గమా
చింతామౌనమివా స్థితామధులిహాం శబ్దైర్వినాలక్ష్యతే
చండీ మామవధూయపాదపతితం జాతానుతాపేవసా. (5-38)

''ఈ లత బాష్పములచే గడుగబడిన అధరములుగల లతాంగివలె ఉన్నది. ఏలన ఈ తీగె ఆకులు వర్షబిందువులచే తడిసి ఉన్నవి. ఈ తీగెకు ఆభరణములులేవు. ఏలయన పూలుపూయు కాలము కానందున ఆభరణ విహీనమైయున్నది. అంతేగాక ఈ లత భృంగీరవమువలన మౌనమావహించి ఉన్నది. నీ వియోగమనుభవించుచు, నీ పాదములపైబడిన నన్ను కరుణింపకున్న చండివి (ఊర్వశి) నీవే కానోపు.'' ఈ లత చెంతకు రాగానే ఈమె ఊర్వశియను భావమేర్పడినది. వాస్తవముగ అంతేయైనది. ఈ విధముగ విక్రమోర్వశీయము చదువ జదువ చవులూరించుచుండును.

★

ప్రశ్నోత్తరావళి

ప్రశ్న : 140 శ్రీ బి. శేషగిరిరావు, మధిర

మన రాష్ట్రంలో పండ్లతోటల విస్తీర్ణం ఎంత వుంటుంది?

సమాధానం : ఆంధ్రప్రదేశ్‌లో పండ్లతోటలక్రింద 2,55,120 ఎకరాల విస్తీర్ణం వుంది.

ప్రశ్న : 141 శ్రీ జె. ఆర్. కె. ఎస్. రావు, క్రోసూరు (గుంటూరు జిల్లా)

నయాపైసల రేట్లలో ప్రామిసరీనోట్లపై ప్రస్తుతం స్టాంపు డ్యూటీ ఎంత విధింపబడుతున్నది?

ప్రభుత్వం విడుదలచేసిన, 5, 10, 15, 25 నయాపైసల రెవెన్యూ స్టాంపులు దేనికి ఉపయోగించాలి?

సమాధానం : భారత స్టాంపు చట్టం 1 వ షెడ్యూలులోని 49 వ నిబంధనక్రింద ప్రామిసరీ నోట్లపై డ్యూటీ విధింపు వుంటుంది. చట్టంలోని అంశాలు దిగువ ఉటంకించబడినవి :-

పత్రం వివరణ	సరైన స్టాంపు డ్యూటీ
49. ప్రామిసరీనోటు (2(22) వ సెక్షనులో నిర్వచించిన విధంగా)	
(అ) డిమాండుపై చెల్లించవలసినదైతే:-	
(i) రు. 250 లకు లోపు అయినట్లయితే	ఒక అణా
(ii) రు. 250 లకు మించి రు. 1,000 లకు లోపు అయినట్లయితే	రెండణాలు
(iii) మరేదైనా సందర్భంలో	నాలుగు అణాలు

ప్రభుత్వం విడుదలచేసిన విడిస్టాంపులకు సంబంధించి, భారత స్టాంపు నియమావళి, 13, 13A, 16 వ నిబంధనలు ఈ క్రింద ఉటంకించబడినవి :-

పత్రాలపై విడిస్టాంపుల వాడకం.	13. దిగువ పేర్కొన్న పత్రాలపై విడి స్టాంపులను ఉపయోగించ వచ్చును :-

(అ) సెట్టులలో డ్రా చేయడానికి అవకాశం వుండి, డిమాండుపై చెల్లింప నవసరంలేని ఎక్స్ఛేంజి బిల్లులు. ప్రతి సెట్టు ఒక్కొక్క భాగంపై స్టాంపు డ్యూటీ ఒక అణాకంటే ఎక్కువ చెల్లింప నవసరం లేకుంటే.

(ఆ) పబ్లిక్ కంపెనీలు, అసోసియేషన్ల డిబెంచర్ల మార్పిడి.

(ఇ) మ్యాపులు, ప్లానులు, ముద్రిత ప్రతులు, ముద్రిత ఫారములపై ఇవ్వబడే రిజిస్టర్లలోని కొన్నిభాగాలు లేదా ప్రతులు. షెడ్యూలు 1-A, లోని 20 వ నిబంధన క్రింద డ్యూటీ విధింపు జరిగినట్లయితే.

(ది. 14-9-1935 గల భారత ప్రభుత్వ ప్రకటన నెం. 13 స్టాంపులు బి. ఏ. 594- ఆర్. మిస్. 4 అక్టోబరు 1935)

(ఈ) షెడ్యూలు 1-ఎ, లోని 4 (అ) (అ), 36 వ నిబంధనల క్రింద డ్యూటీ విధింపబడే దస్తావేజులు.

(జి. ఒ. 3197 రెవెన్యూ. 17 డిశెంబరు 1939; బి. పి. 96 ప్రెస్, 16 అక్టోబరు 1939)

(ఉ) షెడ్యూలు 1 లోని 47 వ నిబంధనక్రింద స్టాంపు డ్యూటీ విధింపబడే దస్తావేజులు.

(ఊ) షెడ్యూలు 1 లోని 37, 49 (అ) (ii), (iii), 52 వ నిబంధనలు, షెడ్యూలు 1-అ లోని 16-అ, 30-అ నిబంధనల క్రింద స్టాంపు డ్యూటీ విధింపబడే దస్తావేజులు.

(జి. ఒ. 3116, రెవెన్యూ, 15 డిశెంబరు 1943; బి. పి. మిస్. 1716, 29 డిశెంబరు 1943)

(ఎ) పబ్లిక్ కంపెనీలు, అసోసియేషన్ల వాటాలమార్పిడి దస్తావేజులు.

(ఏ) కేంద్ర ఎక్సైజు డ్యూటీకి సంబంధించిన ఏదైనా నిబంధన లేదా వాటిక్రింద రూపొందించిన నియమావళి ననుసరించి వ్రాసిన బాండులు.

(జి. ఓ. ఎంఎస్. 2629, 28 సెప్టెంబరు, 1943. బి. పి. మిస్. 3727, 6 అక్టోబరు 1943)

(i) మద్రాసు స్మాల్ కాజెస్ కోర్టులో కాపీలకొరకు దాఖలుచేసే దరఖాస్తులు, వకాలతులు.

(జి. ఓ. ఎంఎస్. 335, రెవెన్యూ, 19 ఫిబ్రవరి 1944, బి. పి. మిస్. 315, 26 ఫిబ్రవరి 1944.)

13-ఎ. ఈ నిబంధనలలో వున్నదానికి భిన్నమయినప్పటికీ, అవసరమయిన స్టాంపులు చెలామణిలో లేని కారణంగా చట్టంక్రింద దస్తావేజు నిమిత్తమయినా చెల్లించవలసిన స్టాంపు డ్యూటీ చెల్లించటం సాధ్యపడనప్పుడు, అలాంటి స్టాంపులకు బదులు కోర్టు రుసుం స్టాంపులు అంటించవచ్చని ప్రభుత్వం ఆదేశిస్తే తప్ప ఆ పద్దుకు చెల్లించవలసిన శేషాన్ని 16 వ నిబంధనలో వివరించినటువంటి ఒక అణా, అర్ధఅణా విడి స్టాంపులు అంటించావి.

16. ఈ నిబంధనలలో మరోవిధంగా తెలిపితే తప్ప, డ్యూటీ విలువకై వినియోగించి విడి స్టాంపులలో "ఇండియా రివెన్యూ" అనే అక్షరాలు, "నాలుగు అణాలు" లేక "రెండు అణాలు", లేక "ఒక అణా" లేక "అర్ధ అణా" అనే అక్షరాలు వుంటాయి.

(జి. ఓ. 3197. రివెన్యూ, 1938 డిసెంబరు 17; బి. పి. 96, ప్రెస్, 1939 అక్టోబరు 16.)

ప్రశ్న : 142. శ్రీ బి. శేషగిరిరావు, మధిర

ఐదు రూపాయల విలువగల బహుమతిబాండ్లకు ఎన్ని బహుమతులు వున్నవి ?

సమా : మూడు మాసాల కొకసారి వేసే డ్రాలో రు. 5 ల విలువగల 10 లక్షల బాండ్లకు మొత్తం రు. 46,000 ల విలువయ్యే 278 బహుమతులు వుంటాయి. ఇలా ప్రతి 10 లక్షల బాండ్ల క్రమానికి వుంటాయి.

ప్రశ్న : 143. శ్రీ బొందలపాటి కోటేశ్వరరావు, దాలిపర్రు, దివి తాలూకా, కృష్ణా జిల్లా

బి. సి. జి. టీకాలు జిల్లా ఆసుపత్రులలో కూడ వేస్తున్నారా? లేకపోతే ఎక్కడ ?

5 నెలల వయస్సుగల చేబిలకు కూడా వేస్తారా ? ఈ టీకా వేయటానికి పిల్లలకు ఎంత వయసు వుండాలి ?

సమా : సిబ్బంది, నిధుల కొరత మూలంగా బి. సి. జి. టీకాలు ప్రస్తుతం జిల్లా ఆసుపత్రు లన్నింటిలోనూ వేయటం లేదు. కొరవడిన రెండూ సమకూరినట్లయితే తృతీయ ప్రణాళికా కాలంలో ప్రతి జిల్లా ముఖ్యపట్టణంలోని ఆసుపత్రిలోనూ బి. సి. జి. కార్యాలయం యేర్పరచాలని ప్రతిపాదన వున్నది. ప్రాంతీయ కార్యాలయాలు గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, వరంగల్, హైదరాబాదులలో వున్నాయి. ప్రస్తుతానికి పై కేంద్రాలలోని బి. సి. జి. యూనిట్లలో పనిచేసే బి. సి. జి అధికారులనుగాని లేక బి. సి. జి. దళాలు ఎక్కడ పనిచేస్తుంటే అక్కడ వారిని సంప్రతించవలసిందిగా పాఠకునికి సలహా ఇవ్వట మయింది.

బి. సి జి. టీకా శిశువు జన్మించిన తేదీనుండి ఇవ్వవచ్చు. ఈ పైలట్ పరిశీలక ప్రాజెక్టు హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాలలో ఆచరణలో వున్నది. వసతులు సమకూరగానే ఈ ప్రాజెక్టు ఇతర అన్ని జిల్లా ఆసుపత్రులకు విస్తరింప జేయ బడుతుంది.

ప్రస్తుతానికి భారీఎత్తున జరుగుతున్న టీకాల ఉద్యమంలో గ్రామాలలో ఒక సంవత్సరం యీడుకు పైనవున్న పిల్లలను మాత్రమే పరీక్షించి టీకాలు వేయటం జరుగుతోంది.

ఇతరులకు హాని కలిగించే పనులు మనంచేసినపుడు, వాటిని మనం సమర్థించుకుంటాము మనకు హానికలిగించే పనులు యితరులు చేసినపుడు, వాటినిమనం ఖండిస్తాము. ఇదేనా మనిషి యోగ్యత ?

—గురజాడ

* * * *

మనస్సుకు విశ్రాంతి ఇవ్వటమంటే మనస్సును కోల్పోవటమే.

—ముసోలినీ

జాతీయ పొదుపు పథకం

"పొదుపు పాఠశాల"

విశాఖపట్నంలోని హెల్త్ విజిటర్ల శిక్షణ పాఠశాల, 1960 డిశెంబరు 3 వ తేదీన "పొదుపు పాఠశాల"గా ప్రకటింపబడినది. ఈ సందర్భంలో జరిగిన సభకు జిల్లా కలెక్టరు అధ్యక్షత వహించారు. రాష్ట్ర శాసన సభాధ్యక్షుడు శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావు "పొదుపు పాఠశాల"గా ఈ సంస్థను ప్రకటించారు.

విశాఖపట్నం అసిస్టెంట్ నేషనల్ సేవింగ్స్ ఆఫీసరు ఈ సందర్భంలో మాట్లాడుతూ, ఈ పాఠశాలలోని 140 మందిలో ప్రతిఒక్కరుకూడా ప్రతినెలా తమ స్టయిపండ్లనుంచీ, జీతాల నుంచి రు. 5/– లు మొదలు రు. 100/– ల వరకు, పొదుపు సర్టిఫికెట్లు, క్యుమ్యులేటివ్ టైమ్ డిపాజిటు పథకం, బహుమతి బాండ్లకు పెట్టుబడి పెడుతున్నారనీ, కాబట్టి ఈ సంస్థ "పొదుపు పాఠశాల"గా ప్రకటింపబడినదని అన్నారు.

ఈ విషయంలో ఎంతో శ్రద్ధ కనబరిచిన పాఠశాల సూపరింటెండెంటును ఆయన అభినందించారు.

శ్రీ కాళేశ్వరరావు ప్రసంగిస్తూ శిక్షితుల సత్సంకల్పాన్ని కొనియాడారు. విద్యార్జన చేస్తూనే, జాతీయ పొదుపు పథకాలకు పెట్టుబడి పెడుతూ తద్వారా పంచవర్ష ప్రణాళికల నిర్వహణకు శాయశక్తులా తోడ్పడుతున్నందుకు ఆయన వారిని అభినందించారు. శిక్షణను ముగించి కార్యరంగంలో ప్రవేశించినతరువాత కూడా వారు అదేప్రకారం పొదుపరితనం అలవర్చుకొని గ్రామీణ ప్రజలలో ఇటువంటి అలవాట్లను ప్రోత్సాహపరచాలని ఆయన శిక్షితులను కోరారు. తరువాత వారికి సర్టిఫికెట్లను, బహుమతి పత్రాలను, ప్యాస్‌బుక్కులను అందజేశారు.

ఈ పాఠశాలలో పొదుపు పథకాన్ని విజయవంతంగా అమలు పరిచినందుకు జాతీయ పొదుపుసంస్థవారిని కలెక్టరు అభినందించారు.

ఆరోగ్యాధికారిణి కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు.

నిజామాబాదులో

శక్కర్‌నగర్‌లోని నిజాం చక్కెరఫ్యాక్టరీ మేనేజిమెంటు పోషకత్వంక్రింద 1943 వ సంవత్సరంలో ఫ్యాక్టరీ స్త్రీలక్లబ్బు నెలకొల్పబడింది. దరిమిలా శక్కర్‌నగర్ మహిళాసమితి అనే పేరుతో ఇది రిజిస్టరైంది. ఈ సమితి సేవాభావంతో చిన్న మొత్తాల పొదుపు పథకానికి ఏజెన్సీవహించి, సాంఘిక సంక్షేమ బోర్డునుంచి గ్రాంటును పొంది, అప్పటినుంచి రు. 10,41,035 ల మొత్తాన్ని సేకరించగలిగింది. 1957 జూలై లగాయతు 1960 ఆగష్టువరకు వీరికి కమీషనుక్రింద రు. 2,993–28 న. పై. లు లభించాయి. సమితి పక్షాన ఒక మాంటుసోరీ పాఠశాలను నడపడానికి, ఆ ప్రాంతం స్త్రీల ప్రయోజనార్థం అల్లికం, కుట్టు పనులను నేర్పే తరగతులను, వయోజన విద్యా తరగతులను నిర్వహించడానికీ, శిశు సంక్షేమ కేంద్రంలోని పిల్లలకొరకు బల్వాడి తరగతిని నడపడానికి ఈ మొత్తాన్ని వెచ్చిస్తున్నారు.

వేతనాల చెల్లింపుచట్టం నిబంధనలువర్తించే ప్రభుత్వేతర సంస్థలలో పేరోల్ సేవింగ్స్ పథకాన్ని ప్రవేశపెట్టవచ్చు. ఈ పథకం శక్కర్‌నగర్‌లోని నిజాం చక్కెర ఫ్యాక్టరీలో జాతీయ పొదుపు పథకానికి పెట్టుబడులు సేకరించడానికి ప్రవేశపెట్టబడింది. ఈ ఫ్యాక్టరీకి చెందిన 104 మంది ఉద్యోగులు తమ పేర్లు చేర్పించి, క్యుమ్యులేటివ్ టైమ్ డిపాజిటు పథకానికి పెట్టుబడిగా తమ వేతనాలలోనుంచి మొత్తాలను తీసేసుకోవడానికి మేనేజిమెంటుకు తమ సమ్మతిని తెలియజేశారు. పేరోల్ పొదుపు పథకంక్రింద నెలవారి పెట్టుబడిగా 1960 సెప్టెంబరులో రు. 1,220 ల మొత్తం లభించింది. ఈ పథకంలో చేరుతున్న సభ్యులసంఖ్య, వారిద్వారా లభిస్తున్న పెట్టుబడిమొత్తం నెల నెలకూ పెరుగుతున్నది.

పారిశ్రామిక విశేషాలు

(డిసెంబరు 1960)

(రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. వాటిని గూర్చి తెలుసుకోవడం పారిశ్రామిక వేత్తలకు, ప్రజలకు ముఖ్యం కాబట్టి ముఖ్య పారిశ్రామిక విశేషాలు ఈ శీర్షిక క్రింద ఇవ్వబడ్డవి.)

పరిశ్రమల అభివృద్ధికి సౌకర్యాలు

రాష్ట్రంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి వీలుగా, ఇక్కడ పరిశ్రమలు స్థాపించదలిచిన వారికి లభింపచేయడానికై పెద్ద పెద్ద నివేశన స్థలాలను సేకరించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. విద్యుచ్ఛక్తి, నీటిపన్ను రేట్ల విషయంలోనూ, అమ్మకంపన్ను విషయంలోను వారికి రాయితీలను ఇవ్వడానికి గల అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

పారిశ్రామిక మేనేజిమెంటు సర్వీసు

రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలోని పరిశ్రమల నిర్వహణలో కొందరు ఐ. ఏ. ఎస్. అధికార్లకు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

సనత్‌నగర్ పారిశ్రామిక ఎస్టేటు విస్తరణ

సనత్‌నగర్‌లోని పారిశ్రామిక ఎస్టేటును విస్తరించడానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. లఘుపరిశ్రమల అవసరాలను తీర్చడానికి అనువుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 18 ఫ్యాక్టరీ భవనాలను రు. 13 లక్షల వ్యయంతో నిర్మించడానికి తలపెట్టబడింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎస్టేటువద్ద అదనంగా ఫ్యాక్టరీ భవనాల నిర్మాణానికి మరో ఆరు లక్షల రూపాయల కేటాయింపుకూడా ఆమోదింప బడింది.

ఔషధాల ఫ్యాక్టరీ

హైదరాబాదులో రష్యా సహాయంతో ఔషధాల ఫ్యాక్టరీ ఒకదానిని స్థాపించడానికి అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేంద్రం అధ్వర్యాన స్థాపించే ఫ్యాక్టరీగా ఇది నెలకొల్పబడుతుంది.

భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీ

భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీ స్థాపన విషయంలో కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన నిపుణుల సంఘంవారు 1961 జనవరి 1 వ తేదీన హైదరాబాదుకు వచ్చి తమకు సూచించిన స్థలాలను పరిశీలించారు. దేశంలో భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థలం నిర్ణయంచేసే సందర్భంలో వీరు దక్షిణరాష్ట్రాలలో ఇదివరకే పర్యటించారు.

కాగితం పరిశ్రమ

రాష్ట్రంలో కాగితం, రేయాన్‌గుజ్జు ఫ్యాక్టరీలను నెలకొల్పడానికి కొందరు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు కాబట్టి ఈ పరిశ్రమల స్థాపనావకాశాలను పరిశీలించేనిమిత్తం అటవీశాఖ వెదురు తదితర అటవీసంపద వనరులను సర్వే చేస్తున్నది.

ఎరువుల ఫ్యాక్టరీ

కొత్తగూడెంలో స్థాపించబడే ఎరువుల ఫ్యాక్టరీకి యంత్ర పరికరాలు మొదలైన సామగ్రిని సరఫరా చేయడానికి టెండర్లు పంపుకునే గడువు 1960 నవంబరు 30 న ముగిసింది. అప్పటి వరకు చేరిన టెండర్లు ప్రస్తుతం పరిశీలించబడుతున్నాయి.

ఆల్విన్ మెటల్ వర్క్స్ లిమిటెడ్

ఇండ్లలో వాడుకునే రెఫ్రిజిరేటర్ల ఉత్పత్తిని సంవత్సరానికి 4600 యూనిట్లనుంచి 10,000 యూనిట్లకు పెంచుకోవడానికి ఆల్విన్ మెటల్స్‌వారికి అనుమతి ఇవ్వబడింది.

ప్రాగాటూల్స్ కార్పొరేషన్ లిమిటెడ్

వివిధ కొత్తరకం పరికరాలు, యంత్రాల ఉత్పత్తికి, ఒక విదేశకంపెనీతో సికింద్రాబాదులోని ప్రాగాటూల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వారు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సంస్థ విస్తరణ కార్యక్రమంక్రింద ఇది జరిగింది.

హైద్రాబాదు కెమికల్స్, ఫెర్టిలైజర్స్ లిమిటెడ్

రు 23.22 లక్షల వ్యయంతో మౌలాలీలో సూపర్ ఫాస్ఫేటు కర్మాగారాన్నొకదానిని స్థాపించడానికి ఈ కంపెనీవారు తలపెట్టారు.

పారిశ్రామిక సహకారసంస్థలు

చీరాలలోని సహకార నూలు మిల్లులలో ఇప్పుడు పని చురుకుగా కొనసాగుతున్నది. రాష్ట్ర ధర్మాదాయాలు, సహకారశాఖలమంత్రి 1960 డిసెంబరు 14 వ తేదీన ఇక్కడ పవర్ హౌస్‌కు శంకుస్థాపన చేశారు.

పారిశ్రామిక సహకార సంస్థలకు వాటాధనం పెట్టుబడుల క్రింద 1960-61 వ సంవత్సరంలో ప్రభుత్వం రు. 3.28 లక్షలు ఇచ్చింది.

సహకార చక్కెర ఫ్యాక్టరీ

రాష్ట్రంలో అయిదు సహకార చక్కెరఫ్యాక్టరీల స్థాపనకు లైసెన్సులు ఇవ్వబడినవి. వీటిలో ఆముదాలవలస, చోడవరం, చిత్తూరు, పాలకొల్లు సంఘాలు చురుగ్గా పని సాగిస్తున్నవి. ఒక్క పాలకొల్లులో తప్ప మిగతా చోట్లలో బహుశా 1961-62 ఋతువునాటికి ఉత్పత్తి మొదలవుతుంది. ఏటికొప్పాక చక్కెర ఫ్యాక్టరీ విస్తరణ పనులుకూడా బహుశా అప్పటికి పూర్తవుతాయి. ఈ ఫ్యాక్టరీ లన్నీకూడా వాటివాటి శక్తికి సరిపడ ఉత్పత్తిని సాధించినట్లయితే అదనంగా 50,000 టన్నుల చక్కెర ఉత్పత్తి అవుతుంది.

ఈ ఫ్యాక్టరీలకు ఒక్కొక్కదానికి రు. 20 లక్షలు పెట్టుబడి పెట్టడంతోపాటు, వాటికి పారిశ్రామిక ఆర్థిక కార్పొరేషను రు. 300 లక్షల మేరకు మంజూరుచేసిన ఋణాలకు ప్రభుత్వం హామీగావుంది.

నిజామాబాదులో మరో సహకార చక్కెర ఫ్యాక్టరీ స్థాపనకు ఇదివరకే లైసెన్సు ఇవ్వబడినది. విశాఖపట్నం జిల్లా తుని, భీమసింగిలలో ఫ్యాక్టరీలను స్థాపించే విషయం పరిశీలనలోవుంది.

నూతన పరిశ్రమలకు లైసెన్సుల మంజూరీ

5 హెచ్. పి. కిరోసిన్ ఇంజనుల ఉత్పత్తికి మెస్సర్స్ క్రిషి ఇంజన్ వర్క్స్ లిమిటెడ్‌కు భారత ప్రభుత్వం లైసెన్సు ఇచ్చింది.

హైద్రాబాదులో వైరింగ్ కేబుల్స్ ఉత్పత్తికి మరో కొత్త ఫ్యాక్టరీని తెరవడానికి కుందారాలోని మెస్సర్స్ అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు లైసెన్సు ఇవ్వబడింది.

డెక్స్ట్రన్ ఇంజక్షన్లు, క్లోరల్ హైడ్రేట్ మొదలైన వాటిని ఉత్పత్తి చేయడానికి హైద్రాబాదులోని బయోలాజికల్ ప్రొడక్ట్స (ప్రైవేట్) లిమిటెడ్‌కు అనుమతి ఇవ్వబడినది. మెస్సర్స్ బయోకెమికల్, సింథెటిక్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు ఉత్పాదక శక్తిని పెంచడానికి అనుమతి ఇవ్వడమైనది. ఈ సంస్థ ఉత్పత్తి చేసే పి. ఏ. ఎస్ నూ, దాని లవణాలను క్షయవ్యాధి నివారణకు ఉపయోగిస్తారు.

మెస్సర్స్ పాణ్యం సిమెంట్స్ లిమిటెడ్‌కు ఏడాదికి 1.34 లక్షల టన్నుల చొప్పున పోర్ట్‌లాండ్ సిమెంటు ఉత్పత్తి చేయడానికి వీలుగా ఫ్యాక్టరీని విస్తృత పరచడానికి లైసెన్సు ఇవ్వబడినది.

ప్రియము నప్రియంబుఁ బెల్లగు సౌఖ్య దుః
ఖములు భూతభావి కార్యములును
నెవ్వనికి సమంబు లిల సర్వధనియనఁ
బరఁగుఁ జువ్వె యట్టి భవ్యుఁ డనఘ !

— -మహాభారతము

గ్రంథసమీక్ష

—దివాకర్ల వేంకటావధాని.

శ్రీ గోవింద రామాయణము - సీతారామమ్ (బాలకాండము)

రచయిత:— శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

ప్రాప్తిస్థానము :— రచయిత, ఖైరతాబాదు, హైద్రాబాదు,

మూల్యము:— 3 రూపాయలు

శ్రీ గోవిందాచార్యులుగారు దేశభక్తులును, రాజనీతివేత్తలును మాత్రమే కాక కవివరేణ్యులుకూడ నగుట విస్మయమాపాదించును. దేశభక్తి రాజనీతులలోపాటు కవిత్వమునుగూడ నారాధింపఁజాలుట వారి ప్రతిభామహత్త్వమునకుఁ దార్కాణము. ఈ కావ్యము వారి గోవిందరామాయణమునందలి బాలకాండము. ఇంతకుముందే యాచార్యులవారుత్తరకాండమును రచించి ప్రకటించియుండిరి. విషాదాంతమైన యా భాగమును ముందువ్రాసి, తరువాత మొదటికి వచ్చుట యమంగళ పరిహారికమై యౌచిత్యమును బోషించుచున్నది. అందు రాముఁ డాదర్శ భూపాలుఁడుగా గోచరించును; ఇందు భగవంతుఁడుగాఁ జూపట్టును. ఆచార్యులవా రందు రాజనీతివేత్తగను, ఇందు కవిసత్తములుగను, భక్తవరేణ్యులుగనుజూపట్టుదురు.

ఈ బాలకాండమున మూఁడాశ్వాసము లున్నవి. మొదటిది లీలాకృపాశ్వాసము. ఇందు వాల్మీకి క్రౌంచద్వంద్వ వియోగోత్థ శోకప్రేరితుఁడై వ్యాధుని శపించుటయు, వాల్మీకి శిష్యులు 'మా నిషాద' శ్లోకమును బహువిధముల వ్యాఖ్యానించుటయు, వర్ణింపఁబడినది. ఆ శ్లోకమున కాచార్యులవా రొసంగిన వ్యాఖ్యానము జీవాత్మ పరమాత్మల సంబంధము సూచించుచు ప్రతిభాస్ఫోరకమై నూతనముగా నున్నది. సీతారూప జీవాత్మ, శ్రీరామరూప పరమాత్మచే నుద్ధరింపఁబడుటయే రామాయణ సారమని కవి యభిప్రాయము. ఆ పరమాత్ముని లీలాకృపచేతనే వాల్మీకి ముని కవియైనాఁడు. అందుచే దీనికి లీలాకృపాశ్వాస మను పేరు సార్థక మగుచున్నది.

రెండవది యవతారాశ్వాసము. ఇందు శ్రీరామచంద్రుని దివ్యావతారము వర్ణింపఁబడినది. అశ్వినీదేవతలును, విష్ణు ద్వారపాలకులును, అన్యోన్య శాపహతులైన వృత్తాంతము, వసిష్ఠ రామాయణమునుండి గ్రహింపఁ బడినది. ఇట్లే శ్రీరామ జననమునకు ముందు కౌసల్యకు విష్ణువు కలలో కనిపించుట, వాల్మీకి రామాయణమునఁ గానరాదు. ఈ ఆశ్వాసమున దేవతలు విష్ణుని సందర్శించి రావణునిచేఁ దాము పడిన పాట్లు వర్ణించుట సూక్ష్మాతిసూక్ష్మ వివరణముతోఁగూడి హృద్యముగా నున్నవి. ఇందుఁ గౌసల్య ప్రపత్తి వర్ణింపఁబడినది. భక్తిభేదములలో నొకటియైన వాత్సల భక్తికిఁ బట్టుఁగొమ్మయై యీయాశ్వాసము మరలమరలఁ జదువ నుత్సాహము పుట్టించుచున్నది.

మూఁడవది శరణాగతాశ్వాసము. ఇందు దశరథుఁడు. విశ్వామిత్రుఁడు, అహల్య, జనకుఁడు, పరశురాముఁడు మున్నగువారి శరణాగతి వర్ణింపఁబడినది. ఆచార్యులవారు విశ్వామిత్ర పాత్రమును వర్ణించుటలో నపూర్వ కౌశలమును ప్రదర్శించినారు. ఇందాతఁడు శ్రీరామునికి గురువైన మునిచంద్రుఁడు మాత్రము కాదు. మహాభక్తుఁడు. విశ్వామిత్రునికి రాముఁడు విష్ణువుగా సాక్షాత్కరించుట యీకారణముచేతనే. 'పూర్వాసంధ్యా ప్రవర్తతే' అనుదానికి 'భూమి నవతార

పోయెనో పూర్వసంధ్య తీర్పఁగా' నని ప్రతిజ్ఞార్థమును స్ఫురింపఁజేసి ఆచార్యులవారు చక్కని వ్యాఖ్యానము కావించినారు. విశ్వామిత్రుఁడు శ్రీరాముని విడిచి మరల నాశ్రమమున కరుగు ఘట్టమున నాతని భక్తిభావము సుస్పష్టముగా గోచరించుచున్నది. ఇట్లే శ్రీరామ, పరశురాముల సంవాదములుకూడ పరశురాముని శరణాగతిని జక్కగా వ్యక్తము చేయుచున్నవి. 'బాహో బాహో రణంబుఁ జేల' అను పద్యమును, 'ఓహో రామ రఘూద్భవా! శరణమోహో సర్వలోకేశ్వరా!' అని యాతఁడు పల్కుటయు నా శరణాగతికిఁ బరమావధి. అహల్య శాప విముక్తురాలై పాహియని దాసివలె నిలువఁబడి షోడశోపచారములు గావించి "దానికి నాకుఁ జూపిన యుదారత యెవ్వరికబ్బె మున్నిటుల్" అని పల్కి తన ప్రసన్నతను బ్రదర్శించినది.

సీతా వివాహవర్ణనము సహజమై దేశీయ సంప్రదాయమును సూచించుచున్నది. 'ఇయ్యదియ మదీయ పుత్రికసుమా గ్రహియింపుము పాణిఁ బాణిచే' అను మకుటములుగల పద్యములును, దశరథ, జనకుల వంశాబ్ధి వర్ణనములును ఆ వివాహ దృశ్యమును గన్నులకు గట్టుచున్నవి.

ఆచార్యులవారి శైలి సులభసుందరమై పదాడంబరములేక, సర్వసుబోధముగా నున్నది. వారు రసపోషణమునకే కాని పాండిత్య ప్రదర్శనమునకై యెచ్చటను బ్రయత్నించియుండ లేదు. నడుమ నడుమ భక్తి, వేదాంతము, జ్యోతిషము, మున్నగు విషయములను సందర్భానుగుణముగా వివరించి వారు వానియందు తమకుఁగల గాఢపరిచయమును వ్యక్తము చేసియున్నారు. వర్ణనలు నాతి దీర్ఘములై కథాసంబద్ధములై రమణీయములుగా నున్నవి. 'ధాత్రిజా వక్త్రి మ్మల్ల విధాత్రి పదము' పుట 116, 117 మున్నగు సీతావర్ణన పద్యములలో చమత్కారయుక్తమైన శ్లేష గోచరించుచున్నది. ఆచార్యుల వారి భాష నిర్దుష్టమై లాక్షణికముగా నున్నది. ముద్రణ స్ఖాలిత్యములు పెక్కు దొరలుట శోచనీయము.

ఆశ్వాసాంత పద్యములలో నాచార్యులవారు నూత్న మార్గము నవలంబించిరి. ఆ పద్యములు వారి భక్తి విశేషమునకు నిధానములై యున్నవి. శ్రీరామునికిని, వారికిని నడుమఁగల సన్నిహిత సంబంధమును వ్యక్తము చేయుచు, నాత్మాశ్రయములై, అవి చక్కని భావావేశమును సూచించుచున్నవి. కొన్ని పద్యములలో సఖ్య భక్తిజాడలు స్ఫురించుచున్నవి. పద ప్రయోగమునందును, భక్తిరసమహత్త్వము నందును, ఈ పద్యములు దాశరథి శతకము నందలి పద్యములను దలపించుచున్నవి. సాధారణముగా నాశ్వాసాంతములయందు మూఁడు పద్యములుమాత్రమే వ్రాయఁబడుచుండును. ఆచార్యులవారు వానిసంఖ్యను భావానుగుణముగాఁ బెంచి కొంత స్వాతంత్ర్యము ప్రకటించిరి. వా రచిరకాలముననే యితర కాండములనుగూడ పూర్తిచేసి యాంధ్రభాషాయోష నలంకరింతురుగాక.

మధూదయము – (పద్యకావ్యము)

రచయిత:— శ్రీ ఉప్పాడ రాజారావు

ప్రతులకు:— హనుమంతు మోహనరావు, తలగాం, శ్రీకాకుళం జిల్లా

మూల్యము:— రూ. **12–50** న. పై.

ఇటీవల రచింపబడిన ప్రశస్తములైన బృహత్కావ్యములలో ఈ మధూదయ మొకటి. కథానిర్మాణము, వర్ణనౌచిత్యము, రసపోషణము, భాషాప్రయోగములను నన్ని విషయములయందును గొంత విశిష్టతగల ఉత్తమ ప్రబంధమిది. ఇందలి కథావస్తువు సాంఘికమైనది. కవి కల్పితము. పూర్వ ప్రబంధ కవులు ప్రాయికముగాఁ బ్రఖ్యాత వస్తువునే గ్రహించి కావ్యనిర్మాణము కావించిరి. పింగళి సూర్యనార్యుని కళాపూర్ణోదయ మొక్కటే యందు కపవాదమని చెప్పఁదగినది. తరువాతఁ గల్పిత కథావస్తుకములై వెలసిన కావ్యములలో నుత్తమ శ్రేణికిఁ జెంది, రసానంద సంధాన దక్షమై, సహృదయుల ప్రశంసల నందజాలిన పెద్ద కావ్య మిదియే యని చెప్పుటలో నతిశయోక్తి యుండదు. దీనిని బద్యరూపమైన నవల యని చెప్పవచ్చును. కథ యాంధ్ర దేశమునకు సంబంధించినది. పాత్రల ఆచార సంప్రదాయములు ఆంధ్రదేశీయములైనవి. ఈ విధముగా నిందు దేశీయత సర్వతోముఖముగా నొప్పారుచున్నది. 'అనువాదంబులు కొల్లలై వెలయఁగా నాంధ్రత్వమున్ గోలుపోవును నా ముద్దులతేనె వాక

సుడిపువ్వులంబోఁడి' యని కవిగారి అభిప్రాయము. అందుచేతనే వారు ప్రాతక్రొత్తల మేలుకలయిక నలరు గ్రామజీవితేతివృత్తమును అందును మాతృమండల సంబంధి యైనదానిని గ్రహించి యీ ప్రబంధమును నిర్మించినారు. కథ చాల రమణీయముగా నున్నది. సన్నివేశము లౌచిత్యభాసురములై చదువునప్పుడు పఠితల యొడళ్ళు పులకింపఁజేయును. మాధవుని తండ్రిఁజూచి మాలతి హైదరాబాదున కరుదెంచి మధుకుమారిని దర్శించుట, మధుకుమారి తన లోకోద్ధరణ కార్యముల యారంభోత్సవమునకు మాధవాదుల నాహ్వానించుటకై స్వయముగా పుష్పపురమున కరుగుట మాలతీ మాధవుల వివాహమును, ఆ యారంభోత్సవమును నొక్కదినముననే యగుట, జలములఁబడిన రాధ నానందుఁడు బయటికిఁదీసి బ్రతికించుట, వృషభము మాలతిని ద్రొక్కి వెడలుట, మరణమునకు ముందు మాలతి మధుకుమారిని మాధవున కర్పించుట, అట్టి సన్నివేశములలోఁ గొన్ని. కథ మాలతిమరణముతో ముగియుటచే విషాదాంతమై యొప్పారినది. ఇది ప్రాచ్య సాంప్రదాయమునకు నూతనమే యైనను నిచ్చట గావ్యరక్తి కెన్నోవిధముల నుత్కర్ష చేకూర్చుచున్నది. మాలతి యుత్తమ గుణశీలములకు నిధానము; నిర్మల ప్రేమ కాటపట్టు; సౌందర్యమునకు సేవధి. అట్టి యామె మరణము — అందును నాకస్మికాపతితమైనది — విధి బలీయస్త్వమును నిరూపించుచుఁ గేవలమైన కరుణరసమునకుఁ దావలమై ఉన్నది.

కవి కథలో సంస్కరణాభిలాషను గూడఁ బ్రదర్శించెను. కాళింగులలోనున్న యంతర్భేదములను దొలఁగించుటకై కవి చేసిన ప్రయత్న మిందలి కథానిర్మాణమునఁ గానవచ్చుచున్నది. రాధానందుల వివాహ మిందుకుఁ దార్కాణము.

ఇందలి కథలో మిక్కిలి ప్రశంసింపఁదగిన విషయము మాలతికిఁ బుట్టిన కుమారుఁడు మధుకుమారి యాకారమును గలిగియుండుట. నిజమునకు మధుకుమారికిని, అతనికిని నెట్టి సంబంధమును లేదు. ఐనను మాలతి నిరంతరము మధుకుమారినే తలంచుచుండుటచే నామె భావ మామెయందు సంక్రమించి, పుట్టిన కుమారునికి భావనాగత మధుకుమారీరూపసామ్యము చేకూర్చెను. మనుచరిత్రలోకూడ నిట్టి భావనా మహత్త్వము చక్కగాఁ బ్రకటింపఁబడినది. మాలతికిఁబుట్టిన మధుకుమారుని నామమును బట్టియే దీనికి మధూదయమని పేరు పెట్టఁబడినది.

కవి రసపోషణమునఁ జాల కౌశలము ప్రదర్శించెను. ఇందు వీర, కరుణ, శృంగారములు చక్కగాఁ బోషింపఁబడినవి. మాలతీ మాధవులయందు ధర్మవీరము సర్వతోముఖముగా గోచరించును. రాధానందుల ప్రణయము శృంగారమునకుఁ బట్టుఁగొమ్మ. మాలతీ మరణసంఘటనము కరుణరస సముద్రము. ఇంకను గథయందాయా సందర్భములలో నద్భుతాది రసములు కూడ నేర్పుతో పోషింపఁబడినవి.

ఈ కావ్యమునందుఁ గ్రొత్త ప్రాతల మేలు కలయిక వర్ణనలలో గోచరించును. ఇందు మహాకావ్యోచితములైన యష్టాదశ వర్ణనములలోఁ బెక్కుచిత సందర్భములయందు గోచరించును. పురవర్ణన, ఋతువర్ణన, ప్రకృతివర్ణన, ప్రణయవర్ణన, విలాసవర్ణన, పూర్వవైభవ వర్ణనములును, అన్నిటికన్న మిన్నగా శ్రీకాకుళ మండలము నందలి వివిధ దృశ్యముల వర్ణనమును, సహజసంగీతభావపూరితములై, యౌచిత్య శోభితములై, ఇంపు నింపుచున్నవి. సాగరకాసారనదీవర్ణనములు సహజసుందరములు. కవి సాగరతీరవాసి యౌటచే మత్స్యములను దద్భేదములను నెంతో సూక్ష్మ పరిశీలనముతో వర్ణించి యున్నాఁడు. కొన్ని వర్ణనములు సరిగాఁ బ్రబంధ వర్ణనముల వలెనే యున్నవి. కవి దేశాభిమాన ప్రేరితుఁడై కొన్ని వర్ణనములను దీర్ఘతరములు గావించిన చోట్లును గలవు. ఇన్ని వర్ణనములున్నను గథలో నెచ్చటను శైథిల్యము కాని యైక్యభంగము కాని కానిపింపదు.

కవి పాత్రపోషణమునఁ బ్రత్యేక శ్రద్ధ ప్రదర్శించెను. మాలతి, మధుకుమారి, మాధవుఁడు, నరసింహవర్మ మున్నగువారి శీలములను బరికించినచో నీ విషయము తేటతెల్లమగును. మాధవుఁడు మధుకుమారిని ప్రేమించిన రీతి యద్వితీయమైనది. అది కామకలుషితము కాదు. దివ్యమైనది. మధుకుమారి ప్రదర్శించిన సహన మతిలోకమైనది. "అబలా లోకమునందుఁ బ్రాణపతి యన్యస్త్రీని మెచ్చాడుచోఁ బ్రబలంబౌను నసూయ" అను సుభద్రా వాక్య మిందుకు నిదర్శనము. ఆమెయు నత్మియు పరోపకార పరాయణలై సంఘసేవకై జీవితములను ధారవోసిరి. మాలతి మాయ యెఱుఁగని యుత్తమ కన్యాశిరోమణి. ఆమె పాతివ్రత్యము, పరహితానురక్తి, సౌజన్యము దివ్యములని చెప్పఁదగినవి. వీరు వా రననేల, యీ కావ్యము నందలి వ్యక్తులందఱు నుత్తమగుణ శోభితులై కథారామణీయమునకుఁ దోడ్పడుచునే యున్నారు.

వివాహము కాకముందే రాధానందులు కలసికొన్న సందర్భ

మునఁ గొంత యనౌచిత్యము స్ఫురించుచున్నది. తరువాత జరిగిన కథావిశేషములను దృష్టియందిడుకొని చూచినచో నదియు నొకవిధముగా సమర్థనీయమే యగును.

కవిగారి శైలి యాలంకారికమై, ధారాళమై, సమాస భూయిష్ఠమయ్యు నెడనెడ దేనియలొల్కు తెలుఁగు మాటల కిరవై, ముద్దులొల్కుచున్నది. "స్వస్థానజాతి భాషాసంస్కృతులు" అను పద్యము చూచినచో వారి కావ్యరచనా దర్శనములు తేటతెల్లమగును. కావ్యమంతయు లోకోక్తులకును, జాతీయములకును, వ్యవహారసన్నిహితపద ప్రయోగములకును నెలవై యున్నవి. వీరు వాడిన మాండలికములు వింతకల్గించును. ఆబోరు, బొత్తె, బరస. మంచాట, జారామాసి, కక్కు, తిర్రి, జల్తలు, గుంటడు, మొదలగునవి వీరు వాడిన మాండలికములకు కొన్ని నిదర్శనములు. మాండలికప్రయోగ మధిక మైనచో కావ్యము కొందఱికి దుర్బోధమగుట సంభవించును. అట్టిలోప మీ కావ్యమునఁ గానరాదు. ఇంతమంచి కావ్యములో కొన్ని వ్యాకరణ స్ఖాలిత్యములు దొరలినవి. తొడగిరేని కి. మాతాపిత దేశికులు, సాహృదయుఁడు, లాగుమాత్ర వసనుండై, చతుద్వయి, మున్నగు ప్రయోగము లిందు కుదాహరణములు. కావ్యమున నెడ నెడ నాంగ్లపదములుకూడఁ బ్రయోగింపఁ బడినవి. మొత్తముమీఁదఁ గావ్య మాద్యంత సుందరమై, రమ్య కథాశోభితమై, రసదోహలమై, శబ్దప్రయోగ చమత్కారముతోఁగూడి బహువిధములఁ బ్రశంసింపఁ దగియున్నది.

శబరి

రచయితలు:— శతావధానులు, శ్రీనివాససోదరులు

ప్రాప్తిస్థానము:—— అజంతా పబ్లికేషన్స్, సికింద్రాబాదు

మూల్యము:— ఒక రూపాయి

ఈ కావ్యమున ఉపాసనము, నివేదనము, ఫల శ్రుతి అను మూఁడు భాగములు ఉన్నవి. శ్రీరాముఁడు లక్ష్మణ సమేతుఁడై శబరిని దర్శింప నేగుటతో కావ్యమారంభించి శబరి మోక్షమును బొందుటతో ముగియుచున్నది. శబరి ప్రపత్తి స్వరూప మిందు మిక్కిలి హృద్యముగా వర్ణింపఁబడినది. ఆమె శ్రీరామునియెడ చూపిన భక్తి యనన్య సామాన్యమైనది. రామ లక్ష్మణులు చాలదూరము నడచి వచ్చుటచే నలసిపోయిరని విచారించుట యందును, రావణుఁడు సీతనెత్తుకొని పోయి రామునికి విరహవేదన కల్గించెనని వ్యధనొందుట యందును, రామ లక్ష్మణులకుఁ దగిన మధురాహారము సమకూర్పలేక పోతిఁగదా యని పరితపించుట యందును, ఆమె భక్తి గోచరించును. ఆమె పంపా జలముచే రామలక్ష్మణుల పాద పంకజములు కడిగెను. వారి కంఠములఁ బూలమాల లలంకరించెను. శ్రీరాముఁడు శబరిపైఁ బ్రదర్శించిన దయ యమేయమైనది. ఆమె యాశ్రమమున సమస్తము నతనికి మధుర మధులహరీ సమేతముగాఁ గన్పట్టెను. అచ్చట నపేశలము, నసార్ద్రము. నైన దొక్కటియు నతనికిఁ గన్పించలేదు. శబరి తల్లివలె పండు పండును, దుంప దుంపయును దీసి తినిపించుచుండ నతఁడు తత్త్రదసోత్కర్ష నుతించుచు నాప్యాయముగ భుజించెను. ఆమె యిచ్చిన తేనె యాభక్తపరాధీనునకు 'హృదయాబ్జమున నూరిన యనుపమ భక్తిరసము పోలెఁ' బొడగట్టెను. 'అమ్మరో, ఈ పదునాలుగేండ్లకున్ కను పడెనేఁడు నా జనని కన్నులు చల్లగ' నని యతఁడు పల్కుటలో నతని యాదరము పుంజీభవించి ఉన్నది.

రెండవ భాగము నివేదనము. మతంగముని శబరికి శ్రీరాముని దర్శనమగునని ముందే యెఱింగించెను. అతఁడు శ్రీరాముని దివ్య మూర్తిని వర్ణించుచుఁ జెప్పిన సీసములు దృశ్యమును బఠితలకు సాక్షాత్కరింపఁ జేయుచు నన్య సామాన్య సౌందర్యముతోఁగూడి యున్నవి. అప్పటి నుండియు నా భక్తురాలు రామచంద్రుని యాగమనమునకై ప్రతీక్షించుచుఁ గాలము పుచ్చుచుండెను. ఆమెకు సర్వము రామ మయముగాఁ గనిపించెను. 'అణువు నణువును నీకోసమునియె బ్రతుకు, అణువు నణువును నినుఁగాన కటమటించు,' అని ఆమె శ్రీరామునకు నివేదించెను. ఆమె శ్రీరాముని దర్శనమునకై పరితపించిన తీరు, మిక్కిలి రసవంతముగా వర్ణింపఁ బడినది. రామ చంద్రు నెన్నో విధముల సేవించి ప్రార్థించిన వారుండఁగా బికారియైన తనకే యాతని కటాక్షము దక్కెనని యామె మురిసిపోవుట

యందును, గురుకృప తప్ప శ్రీరామ దర్శనమునకు తానే సుకృతము నార్జించుకొనలేదని వాపోవుట యందును, ఆమె శుద్ధహృదయము ప్రకటిత మగుచున్నది. ఆమె 'మేఘరూప! నీ కడగంటి చెలువు మీఁదనిం గమ్యస్థలము చేరనిమ్ము నన్ను' అని తన కోరిక వెల్లడించెను. రామ చంద్రుని దర్శనమగునను నాశయే యామె యంత వఱకును జీవించి యుండుటకుఁ గారణము. 'నాలో గుణ లవమును లేసలేదు మంచగమునులు. నీ భక్తులలో చాలం గిరందిరి, మునిపాలా! తచ్ఛిష్యురాలఁ జాలింపవో కో'' అని యామె యహంకార వర్జితయై యమాయికముగాఁ దన పురాను సవములు వచించి, 'సేవను చించి, వెండి పరను పదము' నీయ వేఁడుకొనెను.

ఆమె కోరినది రామచంద్రుని కధికమనిపింపలేదు. నీకు రాఁదగినది తప్ప "నీవు కోరుకొన్న యెక్కువయేమి — నీకే మోక్షము రాకయుండు నెడ యోగిమండలం వెల్లెడం రాకే యుండు నిఁకెట్టివారికి" నని పలికి యాతఁడామె ననుగ్రహించెను. "బ్రతుకు తొంబది తొమ్మిది పాళ్లు పాప సంకిలంబులఁ గడపిన వారలేని, కడకు శరణాగతిని ముక్తిగాంచఁగలరు. — గట్టి యధ్యవసాయంబు గలిగి మెలఁగ వేదములతోడఁ బనిలేదు, లేదు శాస్త్ర పరిచయావశ్యకత, అట్టివారి కెల్ల కరతలామలకంబు మోక్షంబు సుమ్ము." — ఈ ప్రపత్తిని చేరలేరని వారు చావు పుట్టువులను దాటఁజాల రెపుడు — నన్నే ఏకైక రక్షకుగా వరించు వారలకు నేను సర్వ సంసార బంధనములు విడిపించి యిత్తు మోక్షమును ప్రేమ," అనునది ఇందలి ఫలశ్రుతి.

కావ్య మాకృతిని చిన్నదైనను రస నిర్ఝరత్వమున మిన్నగా నున్నది. కథ లేక పోయినను కవులు ప్రతి పద్యమునందు నుదాత్తములైన భావములు నింపి రసము నెల్లెడ నుద్వేలముగాఁ బ్రవహింపఁ జేసిరి. ఎడ నెడ శబరి భక్తితోపాటు కవుల భక్తియుఁ దొంగి చూచు చున్నది. శైలి రసానుగుణమై, మధుర మంజుల పదోపేతమై, ధారాళమై శబరి శ్రీరామున కిచ్చిన తేనెవలెఁ బఠితల కాస్వాద యోగ్యమై యున్నది. "దశరధ జ్ఞాని తపియించి తపియించి — అతని దేహచ్ఛాయ అలమినంతటి దాఁక — ఒంటి దానను కదా ఒంటేమి చేయుదు" మున్నగు పద్యములు భావ పూరితములై యానందమును జాలిచ్చు చున్నవి. "జలకమాడుచు పంపలో — అని సుడిసిపోదు" పుట 34. మున్నగు పద్యములు ధ్వని గర్భితములై హృద్యములుగా ఉన్నవి. "వాని చేతులు చెక్కలై పోను, ఆరి నా పాడు తెల్వి తెల్లార." మున్నగు ప్రయోగములు వ్యవహార సన్నిహితములై ముద్దులొల్కుచున్నవి. "నడచిరో ఏమె — పుట. 14; పాపిష్టి దాన పుట. 17" అను నొండు రెండు స్వతంత్ర ప్రయోగములున్నవి. "కలచుకొంటిని యెండ్లు — వెడగు ముదివగ్గ ననుచున్" పుట. 46 అను చోట్లఁగల ముద్రణస్ఖాలిత్యములు సవరింపఁదగినవి. వీని కేమిగాని, కావ్యము ప్రపత్తి బోధకమగుట చేతను, మధుర భావ పూరితమగుట చేతను, సరళ సుందర మగుట చేతను రస పిపాసువులందఱు చదువఁ దగినట్లున్నది.

ఇరువురు ప్రాజ్ఞులెప్డు కలహింపరు, మూర్ఖునితోడ వివ్వకుం
ద్వరపడిపోడు పండితుడు వాడొకవేళ బరు స్వభావుడై
పరుషములాడినన్ సహన భావముతో మృదులోక్తులన్ మనో
హరముగ బల్కు వాని హృదయంబున గోపము సన్నగిల్లగన్.

పారసీక కవి సాదీ
(తెలుగు : దువ్వూరి రామిరెడ్డి)

*   *   *   *

విద్యలనే మహావృక్షం యొక్క వ్రేళ్ళు చేదుగాను, అది అందించే ఫలితం మధురంగానూ వుంటాయి.

—అరిస్టాటిల్

సంగ్రహ ప్రకటనలు

1960 ఖనిజరాయతీ నిబంధనావళి అమలు :

1949 వ సం. పు ఖనిజ రాయతీ నిబంధనావళి ననుసరించి, ఆమోదపు సర్టిఫికెట్ల జారీకొరకు దరఖాస్తులు పెట్టుకునేవారికి, వాటిని కొత్తగా జారీచేయడానికయితే రు. 100/—లు, వాటి గడువు పొడిగింపుకైతే రు. 50/—ల చొప్పున దరఖాస్తుఫీజు విధించడం జరుగుతుండేది. ఐతే 1960 వ సం.పు ఖనిజ రాయతీ నిబంధనావళి అమల్లోకి రావడంతో ఫీజు విధింపు రేట్లలో మార్పు వచ్చింది. నూతన నిబంధనావళి 1960 నవంబరు 26 వ తేదీనుంచి అమల్లోనికి వచ్చింది.

నూతన నిబంధనావళి ననుసరించి, ఆమోదపు సర్టిఫికెట్టును కొత్తగా జారీ చేయడానికి పెట్టుకున్న దరఖాస్తుకైతే రు. 500/— లు, సర్టిఫికెటు గడువు పొడిగింపుకు పెట్టుకున్న దరఖాస్తుకైతే రు. 250/—ల చొప్పున ఫీజు తీసుకోబడుతుంది.

1960 వ. సం. పు. ఖనిజ రాయతీ నిబంధనావళి అమల్లోనికి రావడానికి పూర్వం అంటే 1960 నవంబరు 26వ తేదీకి పూర్వం, రాష్ట్ర ప్రభుత్వానికి కొత్తగా ఆమోదపు సర్టిఫికెటు జారీకొరకు దరఖాస్తుపెట్టుకున్న వారు, నూత్న నిబంధనావళి అమల్లోనికి వచ్చిన తేదీ లగాయతు 60 రోజులలోపుగా తాము లోగడ దాఖలుచేసిన ఫీజును వాపసుచేయ గోరుతూ దరఖాస్తు అయినా ఇవ్వాలి లేదా యీగడువులోపుగా పాతనిబంధనావళి ననుసరించి తాము చెల్లించిన మొత్తం, కొత్త నిబంధనావళి ననుసరించి చెల్లించాల్సిన మొత్తం కంటె ఎంత తక్కువైతే అంత మొత్తాన్ని చెల్లించి రాష్ట్రప్రభుత్వంనుంచి ఆమోదపు సర్టిఫికెటునైనా పొందాలి.

ఇదేవిధంగా సర్టిఫికెట్లగడువు పొడిగింపుకు కూడా, కొత్త నిబంధనావళి అమల్లోనికివచ్చిన తేదీనుంచి 30 రోజులలోపుగా నూత్న నిబంధనావళి ననుసరించి చెల్లించాల్సిన పూర్తి మొత్తం దాఖలు చేయాలి. 1960 వ. స. పు. ఖనిజ రాయతీ నిబంధనావళిక్రింద గడువు పొడిగింపు మంజూరుచేయబడ నట్లయితే, పాతనిబంధనావళి ననుసరించి దరఖాస్తుదారుదాఖలు చేసిన ఫీజుమొత్తం అతనికి వాపసు చేయబడుతుంది.

1949 వ. సం. పు. నిబంధనావళి ననుసరించి, సర్టిఫికెట్ల గడువు ముగిసిన తేదీలగాయతు మూడు నెలలలోపుగా గడువు పొడిగింపుకు దరఖాస్తుచేరినట్లయితే గడువు పొడిగింపు మంజూరు చేయబడుతుండేది. ఐతే నూత్న నిబంధనావళి ప్రకారం ఇట్టి గడువేమీ ఉండదు. సర్టిఫికెట్ల గడువు ముగిసే తేదీలోపుగానే గడువు పొడిగింపుకు దరఖాస్తులు దాఖలుచేయాల్సి ఉంటుంది.

1949 నిబంధనావళి ననుసరించి, ప్రాస్పెక్టింగ్ లైసెన్సు దరఖాస్తులకు మొదటి చదరపు మైలుకు రు. 50 లు, అపైన ప్రతి అదనపు చ. మైలుకు లేదా దానిలోకొంత భాగానికి రు. 10 ల చొప్పున ఫీజు తీసుకోబడుతుండేది. ఐతే 1960 నిబంధనావళి ప్రకారం యీఫీజు రేటు మారింది. ఇప్పటి నిబంధనావళి ననుసరించి, ప్రాస్పెక్టింగ్ లైసెన్సు కొరకు మొదటి చదరపు కిలోమీటరు లేదా దానిలోని కొంతభాగానికి రు. 20 లు, అపైన ప్రతి అదనపు చ. కిలోమీటరుకు లేదా దానిలోని కొంతభాగానికి రు. 4 ల చొప్పున దరఖాస్తు ఫీజు విధింపబడుతుంది,

మైనింగ్ లీజుకు పెట్టుకునే దరఖాస్తులకు మాత్రం ఫీజు మార్పు చేయబడలేదు. వీటిపై కొత్త నిబంధనావళి ననుసరించి కూడా లోగడ విధించినట్లుగానే రు. 200 లు విధిస్తారు.

* * *

విద్యా రాయతీలు :

పూర్వహైద్రాబాదు రాష్ట్రంలో 1947—48 లో జరిగిన పోరాటంలో పాల్గొన్న వ్యక్తుల పిల్లలకు, మనుమలకు విద్యా సౌకర్యాలను కల్పించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి హైద్రాబాదు రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కావాలంటూ 1947—48 వ సం. లో జరిపిన పోరాటంలో పాల్గొన్నందువల్ల పూర్తి ఆస్తిని లేదా కొంతభాగాన్ని లేదా

ఉద్యోగాలు కోల్పోయినవారు లేదా ఆరునెలలకు తక్కువ గాకుండా జైలుశిక్ష అనుభవించినవారు లేదా పోరాటంలోగానీ నిర్బంధంలోగాని మరణించినవారు లేక వధింపబడినవారు లేదా కాల్పులు, లాఠీచార్జి మొదలైనవాటిమూలాన శాశ్వతంగా అశక్తులైనవారు లేదా మరణదండన విధింపబడినవారి పిల్లలకూ, వారికొడుకుల సంతానానికి, ఒకవేళ వారి నెలసరి రాబడి రూ. 300/– లకు లోపు అయినట్లయితే ఈ పథకంక్రింద విద్యా సౌకర్యాలు లభింపజేయబడతాయి. ఈ సౌకర్యాలు పొంద గోరేవారు నిర్ణీతఫారాలలో దరఖాస్తులు వ్రాసి సందర్భాన్ని బట్టి హైదరాబాదులోని విద్యాశాఖ డైరెక్టరుకుగాని లేదా ఇతర విద్యా శాఖాధికారికిగాని విద్యార్థులు చదువుతున్న పాఠశాల అధిపతిద్వారా ప్రతిసంవత్సరం ఆగష్టు 31 వ తేదీ లోపుగా అందేటట్లు పంపించాలి.

*　　　　*　　　　*

అంతర్జాతీయ ప్యాస్‌పోర్టులు :

విదేశాలకు వెళ్లేవారు ప్యాస్‌పోర్టులకొరకు పెట్టుకునే దరఖాస్తులను శీఘ్రంగా పరిష్కరించడానికి వీలు కలిగేందుకై, కేంద్రప్రభుత్వం ఈ మధ్య అందుకు అనుసరింపబడే విధానాన్ని సమీక్షించి తగు మార్పులు చేసింది. నూతన్నపద్ధతిప్రకారం ప్రతి దరఖాస్తుదారు తన ఫొటో ప్రతులను రెండింటిని అవసరమైన పత్రాలతోసహా దరఖాస్తుతో జతపరిచి సందర్భాన్నిబట్టి హైదరాబాదు పోలీసు కమీషనరుకుగానీ లేక జిల్లా మెజిస్ట్రేటుకు గాని నేరుగా పంపించాలి. ఇదేప్రకారం మద్రాసులోని ప్రాంతీయ ప్యాస్‌పోర్టు ఆఫీసరుకుకూడా దరఖాస్తు ప్రతిని పంపాలి.

పార్లమెంటు సభ్యులు, ఉభయ శాసనసభ సభ్యుల దరఖాస్తులను, ప్రాంతీయ ప్యాస్‌పోర్ట్ ఆఫీసరే నేరుగా స్వీకరిస్తారు.

*　　　　*　　　　*

ఉద్యోగాలలో కేటాయింపు :

నిష్పత్తి సవరణ

1951 జనాభాలెక్కల ఆధారంగా షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులవారు ఎంతమంది వున్నారో ఆ జనాభా నిష్పత్తినిబట్టి ప్రభుత్వోద్యోగాలకు చేర్చుకునే పద్ధతిని హెచ్చుతగ్గులు లేకుండా ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇంతవరకు వున్న కేటాయింపును సవివరంగా పరిశీలించి, జనాభా నిష్పత్తినిబట్టి ఆ కులాలవారికి న్యాయం చేకూరేటట్లు యీ క్రిందివిధంగా పునర్విభజించింది :

షెడ్యూల్డుకులాలు, తెగలు	నూటికి 17
వెనుకబడిన తరగతులు	నూటికి 38
బహిరంగపోటీ	నూటికి 45

ఈ కేటాయింపును మార్చటం దృష్ట్యా, ఉద్యోగాల నియామకం ఏ క్రమంలో జరుగవలసిందీ, క్రింద పేర్కొనబడింది. 25 ఖాళీలలో యీ విధంగా వరుసనుబట్టి తీసుకోవాలి.

1. వెనుకబడిన తరగతులు
2. షెడ్యూల్డు కులాలు, తెగలు
3. బహిరంగపోటీ
4. వెనుకబడిన తరగతులు
5. బహిరంగపోటీ
6. బహిరంగపోటీ
7. వెనుకబడిన తరగతులు
8. బహిరంగపోటీ
9. షెడ్యూల్డుకులాలు, తెగలు
10. వెనుకబడిన తరగతులు
11. బహిరంగపోటీ
12. వెనుకబడిన తరగతులు
13. బహిరంగపోటీ
14. వెనుకబడిన తరగతులు
15. బహిరంగపోటీ
16. షెడ్యూల్డు కులాలు, తెగలు
17. వెనుకబడిన తరగతులు
18. బహిరంగపోటీ
19. వెనుకబడిన తరగతులు
20. బహిరంగపోటీ
21. వెనుకబడిన తరగతులు
22. షెడ్యూల్డు కులాలు, తెగలు
23. బహిరంగపోటీ
24. వెనుకబడిన తరగతులు
25. బహిరంగపోటీ

ఇలా 25 ఖాళీలక్రమం నాలుగవసారి తిరిగి వచ్చినపుడు తొలిఅవకాశం బహిరంగపోటీకి 24 వ అవకాశం షెడ్యూల్డు కులాలు, తెగలవారికి కేటాయించటం జరుగుతుంది.

ఈ ఉత్తర్వులు 1960 డిసెంబరు 19నుండి అమలులో వుంటాయి. ముందుముందు అంటే యీ తేదీతర్వాత కొత్తగా చేర్చుకునే ఉద్యోగాలకు వరుసక్రమం నూతన కేటాయింపునుబట్టి ప్రారంభ మవుతుంది. అంటే తొలి అవకాశం వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థికి ఇవ్వబడుతుంది.

*　　　*　　　*

నాణ్యమైన సిల్కు ఉత్పత్తి :

నాణ్యమైన సిల్కు ఉత్పత్తిని ప్రోత్సాహపరిచే ఉద్దేశంతో పట్టుపురుగులలో ఉత్తమమైన జాతులను ఉత్పత్తి జేసినవారికీ, పట్టుదారంతీసే యంత్రాల నమూనాలను కనిపెట్టినవారికి నగదు బహుమతులు, పతకాలు బహూకరించాలని కేంద్ర సిల్కుబోర్డు నిర్ణయించింది. ఒక్కొక్కటి రు. 2500లు విలువ చేసే 7 నగదు బహుమతులూ, ఒక్కొక్కటి రు. 200లు విలువ చేసే కొన్నిపతకాలు ఉత్తమమైన ఎంట్రీలకు ఇవ్వబడతాయి,

ఎవరైతే పట్టుపురుగులను పోషిస్తారో, పరిశోధనచేస్తారో వారికీ, సాంకేతిక నిపుణులకు మాత్రమే బహుమతులు ఇస్తారు. పోటీకి ఎంటీలు ఆయారాష్ట్ర ప్రభుత్వాలద్వారా రావాలి. దరఖాస్తులు చేరటానికి అఖరుతేదీ 1961 ఫిబ్రవరి 28. ఈ పథకాన్ని గురించిన ఇతర వివరాలు ఆయారాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక శాఖ (పట్టు పరిశ్రమ) నుంచిగాని లేక నేరుగా కేంద్ర సిల్కుబోర్డు, 'మేఘదూత్' 95-బి, మెరీన్ డ్రైవ్. బొంబాయి నుండిగాని తెలుసుకోవచ్చు.

*　　　*　　　*

ఠాగూరు శతవార్షిక జయంత్యుత్సవాలు :

రవీంద్రనాథ్‌టాగూరు శతవార్షిక జయంత్యుత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రప్రభుత్వం హైద్రాబాదు నగరంలో ఒక థియేటరును నిర్మిస్తున్నది. ఈ మే ఆరంభంలో బహుశా నిర్మాణం పూర్తవుతుంది. ఉత్సవాలను ఘనంగా జరపడానికి కార్యక్రమాలను రూపొందించే నిమిత్తం ఒక కమిటీనికూడా ప్రభుత్వం నియమించింది. "చిత్రాంగద", "బసంత్" అనే రెండు నృత్యనాటకాల ప్రదర్శనలో స్థానిక నటీనటులకు శిక్షణ ఇచ్చేందుకు, ఉత్సవాల సాంస్కృతిక ఉపసంఘం, కలకత్తాలోని టాగూరు నృత్య, నాటక, సంగీత అకాడమీకి చెందిన ఇద్దరు కళాకారులకు ఆహ్వానించింది. "రవీంద్ర భారతి"అనే పేరుతో నిర్మింపబడుతున్న ఈ థియేటరులో ప్రారంభ కార్యక్రమంగా ఈ రెండు నృత్యనాటకాలను ప్రదర్శిస్తారు.

*　　　*　　　*

సిద్దిపేట, నిజామాబాదు కళాశాలలు :

సిద్దిపేటలోని ఆర్ట్స్, సైన్స్‌కళాశాలా, నిజామాబాదులోని గిరిరాజ్ కళాశాల నిర్వహణ బాధ్యతను తక్షణమే స్వీకరించడానికి రాష్ట్రప్రభుత్వం నిశ్చయించింది. ఇకమీదట సిద్దిపేటలోని కళాశాల "ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల, సిద్దిపేట" అనీ, నిజామాబాదులోని కళాశాల "గిరిరాజ్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, నిజామాబాదు" అని పిలువబడతాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో వీటి నిర్వహణ వ్యయం క్రింద ప్రభుత్వం రు. 61,600 ల మొత్తాన్నికూడా మంజూరుచేసింది.

*　　　*　　　*

ఎన్. జి. వోల సంఘం గుర్తింపు పునరుద్ధరణ :

1959 నవంబరు 30వ తేదీన ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘానికి ఉపసంహరించిన గుర్తింపును పునరుద్ధరించడానికి రాష్ట్రప్రభుత్వం నిశ్చయించింది. ప్రభుత్వ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల ఇబ్బందులను గూర్చి పత్రికలలోనూ బహిరంగగాను ప్రకటించే విషయంలోనూ, ప్రభుత్వోద్యోగుల ప్రవర్తన నిబంధనలూ, సంఘం గుర్తింపు షరతుల ఉల్లంఘన విషయంలోను ప్రభుత్వానికి సంఘం హామీ ఇవ్వనందువల్ల అప్పుడు గుర్తింపును రద్దుపరచడం జరిగింది.

ప్రభుత్వం తీసుకున్న చర్యమీద, సంఘంవారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషను దాఖలుచేయగా దానిని హైకోర్టు కొట్టివేసింది. దానిమీదట వారు సుప్రీంకోర్టుకు అపీలు చేశారు.

ప్రభుత్వంకోరిన హామీలు ఇస్తూ, సంఘం 1960 అక్టోబరు 30, డిశెంబరు 25వ తేదీలలో తీర్మానాలుచేసింది. ఇప్పుడు కోర్టులలో నడుస్తున్న కేసులన్నింటినీ ఉపసంహరించుకొనడానికి కూడా సంఘం అంగీకరించింది. సంఘం హామీలను అంగీకరించి, దానికి గుర్తింపును పునరుద్ధరించడానికి ప్రభుత్వంనిశ్చయించింది.

ఈ సందర్భంలో ఇప్పుడు కొందరు ఉద్యోగులపై అమల్లో నున్న క్రమశిక్షణ చర్యలుకూడా ఉపసంహరింప బడతాయి.

ముఖ్యవార్తలు

21—12—1960

రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్ నేడు బెంగుళూరులో పంచాయతీ రాజ్యపథకానికి ప్రారంభోత్సవం చేశారు.

22—12—1960

ఈవేళ రాజ్యసభలో ప్రివెంటివ్ డిటెన్షన్ (పొడిగింపు) బిల్లు పెద్ద మెజారిటీతో ఆమోదింప బడినది.

23—12—1960

రూ. 3 కోట్లు ఖర్చు కాగల ప్యాకేజ్ కార్యక్రమాన్ని ఏలూరులో నేడు ముఖ్యమంత్రి ప్రారంభించారు.

24—12—1960

తిరుపతిలో వ్యవసాయ కళాశాలను స్థాపించే విషయం పరిశీలించే నిమిత్తమై ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది.

25—12—1960

దేశమంతటా అనేకచోట్లలో పండిత మదనమోహన మాలవ్య 99వ జయంత్యుత్సవాలు జరిగాయి.

26—12—1960

నేపాలు మంత్రివర్గం రద్దుపరచబడిన 11 రోజుల తరువాత, రాజు మహేంద్ర అధ్యక్షతన ఏర్పడిన తొమ్మండుగురు సభ్యులు గల మంత్రి మండలి నేడు ప్రమాణ స్వీకారంచేసింది.

27—12—1960

యూనియన్ అహార ఉపమంత్రి ఈ రోజు త్రివెండ్రంలో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ కేంద్రం వద్ద మున్నెన్నడూ లేనంతగా బియ్యం, గోధుమ నిలువలు వున్నాయని అన్నారు.

రాష్ట్ర సమాచార, పౌరసంబంధముల శాఖ అధ్వర్యాన జరిగిన టూరిస్ట్ గైడ్ల శిక్షణకోర్సును విజయవంతంగా ముగించిన అభ్యర్థులకు ప్రణాళికా, సమాచార శాఖలమంత్రి నేడు సర్టిఫికెట్లు పంచారు.

28—12—1960

35వ అఖిలభారత విద్యామహాసభ నేడు కాన్‌పూర్‌లో ఆరంభమైంది.

29—12—1960

ఆంధ్ర ఆస్థానకవి మహామహోపాధ్యాయ శ్రీ శ్రీ పాద కృష్ణమూర్తిశాస్త్రిగారు నేడు రాజమహేంద్రవరంలో దివంగతులైనారు.

30—12—1960

ఆంధ్రప్రదేశ్ ప్రజాపార్టీ అధ్యక్షుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం ఒక పత్రికా ప్రకటన చేస్తూ కృష్ణా, గోదావరినదీ జలాల పంపిణీ విషయంలో మహారాష్ట్ర, మైసూరు ప్రభుత్వాలు తెలుపుతున్న అభ్యంతరాలు, అంతరరాష్ట్ర నదీజలాల పంపిణీ వివాదాల చట్టం క్రింద వివాదగ్రస్తమైన అంశాలుగా పరిగణింప బడవన్నారు.

31—12—1960

భారత జాతీయ శాస్త్రవిజ్ఞాన సంస్థ 26వ వార్షిక సమావేశం కొత్తఢిల్లీలో నేడు ఆరంభమైంది.

రాష్ట్రంలో నీటివనరుల సౌకర్యాల అభివృద్ధికీ, వినియోగానికిగాను రు. 650 కోట్లు ఖర్చు కాగల ఒక బృహత్తర పథకం రూపొందింప బడినట్లు ఈ వేళ హైద్రాబాదులో అధికారికంగా వెల్లడించబడినది.

1—1—1961

యూనియన్ పరిశ్రమల మంత్రి నేడు హైద్రాదాదులో 21వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనాన్ని ప్రారంభించారు.

టాగూరు శతవార్షిక జయంత్యుత్సవాలకు ఈ రోజు బొంబాయిలో ప్రధానమంత్రి ప్రారంభోత్సవం చేసారు.

సనత్‌నగర్ పారిశ్రామిక ఎస్టేటులో సైకిలుచైను ఫ్యాక్టరీని యూనియన్ పరిశ్రమల మంత్రి తెరిచారు.

2—1—1961

ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు, విశ్వవిద్యాలయ గ్రాంటుల సంఘం సభ్యుడుఅయిన డా. వి. ఎస్. కృష్ణ, శ్రీ సి.డి. దేశ్‌ముఖ్ స్థానే విశ్వవిద్యాలయ గ్రాంటుల సంఘ అధ్యక్షుడుగా నియమించ బడినారు.

1959 నవంబరు 30న ఉపసంహరించుకున్న రాష్ట్ర నాన్—గజిటెడ్ ఉద్యోగుల సంఘం గుర్తింపును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నేడు ఒక ప్రకటన చేసి౽ది.

3—1—1961

తృతీయ ప్రణాళికలో విద్యుచ్ఛక్తి పద్దుక్రింద కేటాయించిన మొత్తాన్ని పెంచడానికి ప్రణాళికా సంఘం నిర్ణయించింది.

4—1—1961

అకాలీల నాయకుడు మాస్టర్ తారాసింగ్‌ను యీరోజు విడుదల చేశారు.

ఏ సమావేశంలో నయినా సమర్పించడానికి గాను గోదావరి, కృష్ణానదీ జలాల అంశంపై వివరాలను సేకరించేందుకు ఒక సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరువురు ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లతో ఒక సాంకేతిక సంఘాన్ని యేర్పరచ ప్రభుత్వం నిశ్చయించింది

5—1—1961

ఏజన్సీ ప్రాంతాలందు గిరిజన బాలల నిమిత్తమై తృతీయ ప్రణాళికలో తొమ్మిది "ఆశ్రమ పాఠశాలలు" తెరువాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

6—1—1961

జంటనగరాలు రెండింటినీ కలిపి యేర్పరచిన హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషను తొలిబడ్జెటు నేడు ప్రతిపాదించబడింది.

7—1—1961

సర్దారునగర్‌లో జరుగుతున్న 66వ భారత జాతీయ కాంగ్రెసు బహిరంగ సమావేశంలో పంచాయతీ రాజ్యంపై తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ పండితనెహ్రూ, బహుముఖాభివృద్ధికి పంచాయతీ రాజ్యం శక్తివంతమైన సాధనంగా రూపొందుతున్నదని, అన్నారు.

8—1—1961

తక్షణం దీక్షను విరమించమని మాస్టర్ తారాసింగ్ శాంతఫతే సింగ్‌ను కోరారు.

9—1—1961

రామగుండంలో నూతనంగా ఒక బొగ్గు గనికి యీరోజు ప్రారంభోత్సవం జరిగింది.

23 రోజులుగా ఆమరణ నిరసన దీక్షబూనిన శాంత ఫతేసింగ్ నేడు దీక్షను విరమించు కున్నారు.

10—1—1961

రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడానికై కొత్త పరిశ్రమలకు విద్యుచ్ఛక్తిని చౌక రేట్లకు సప్లయిచేయాలని ప్రభుత్వం నిశ్చయించింది.

11—1—1961

తృతీయ ప్రణాళికలో బహుశా తొలిసంవత్సరంలోనే శ్రీకాకుళం జిల్లాలో ఒక పాలిటెక్నిక్‌ను స్థాపించ ప్రభుత్వం నిర్ణయించిందని పత్రికా విలేఖరులతో ప్రసంగిస్తూ పార్లమెంటు సభ్యులు శ్రీ వి. రాజగోపాలరావు ప్రకటించారు.

12—1—1961

ఇండస్ నదీజలాల ఒప్పందం నేటినుండి అమలులోకి వచ్చింది.

13—1—1961

హైకోర్టు జడ్జీల నియామకానికి తగిన వ్యక్తులను ఎన్నుకునేందుకై అఖిలభారత స్థాయిన ప్రముఖ న్యాయవాదుల జాబితాను తయారు చేయాలని కొత్తఢిల్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశమై ఏకగ్రీవంగా నిర్ణయించారు.

14—1—1961

ప్రభుత్వరంగంలో తృతీయ ప్రణాళిక పెట్టుబడి రు. 8000 కోట్లుండాలని జాతీయాభివృద్ధి మండలి తీర్మానించింది. అయితే ప్రస్తుతానికి రు. 7,500 కోట్లు మాత్రమే ఆర్థిక పరిమితిగా వుంటుంది.

15—1—1961

1960-61 ఆర్థిక సంవత్సరంలో కొలంబో పథకం క్రింద భారతదేశానికి సహాయం చేయడానికై కెనడా ప్రభుత్వం 250 లక్షల డాలర్లు కేటాయించిందని కెనడామంత్రి గార్డన్ చర్చిల్ బొంబాయిలో వెల్లడించారు.

16—1—1961

కెనడా సహాయంతో ట్రాంబేలో నిర్మించిన భారత అణుశక్తి రియాక్టర్‌కు ప్రధాని నెహ్రూ నేడు ప్రారంభోత్సవం జరిపారు.

నదీజలాల వివాదాంశాన్ని గురించి కేంద్ర ఇరిగేషన్ మంత్రి, ఉపమంత్రి నేడు హైదరాబాదులో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించారు.

17—1—1961

భారత సరిహద్దులను చైనా దురాక్రమణ పరుచుకోవటం వల్ల సహజీవన సిద్ధాంతాన్ని గురించే సందేహాలు రావటానికి తావు యేర్పడిందనీ, పైగా అభ్యుదయ నిరోధకులకు అందుమూలంగా బలంచేకూరుతుందని కేంద్ర రక్షణ మంత్రి కొత్తఢిల్లీలోఅన్నారు.

18—1—1961

నేడు ప్రధానమంత్రి నెలసరి పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రసంగిస్తూ, కారాకోరం సరిహద్దు గురించి పాకిస్తాన్ చైనాతో సంప్రదించటం అసంబద్ధమనీ, అసలు కారాకోరంతో పాకిస్తాన్‌కు సంబంధం లేక పోవటమే కాక పైగా ఆప్రాంతాన్ని గురించిన సమాచారంకూడా పాకిస్తాన్‌కు సమగ్రంగా తెలియక పోవటమే అందుకు కారణమనీ అన్నారు.

19—1—1961

తృతీయ ప్రణాళికలో గోదావరిపై పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ఇరిగేషన్ శాఖామంత్రి ఆమోదించినట్లు నేటి దినపత్రికలలో ఒకవార్త వెలువడింది.

20—1—1961

అమెరికా అధ్యక్షుడుగా జాన్‌ఫిట్జరాల్డు కెన్నెడీ ఈరోజే ప్రమాణ స్వీకారం చేశారు.

★

వదాన్యుడు

చిత్తూరు జిల్లా, పుత్తూరు పంచాయతీ సమితిబ్లాకులోని రామచంద్రాపురం గ్రామ కాపురస్థుడు శ్రీ కోలా రామ చంద్రనాయుడు, కేవలం స్వయంకృషితో ఆర్జించిన సుమారు రు. 15,000లు విలువచేసే తన స్థిర, చరాస్తులన్నింటినీ ప్రజోప కారార్థం దానంచేశారు. ఈయన దానం యిచ్చిన నివాస గృహాలలో ఒకటి డాబా, రెండు పూరిండ్లు. ఇతర భూములతో పాటు నీటిపారుదలకు ఉపయోగపడే బావి వసతివున్న ఒక ఎకరం నిమ్మతోటనూ. తన రెండెడ్లబండిని బాడుగకు కట్టటం ద్వారా సంపాదించిన రు. 2,000ల రొక్కాన్నికూడా ఈయన విరాళంగా ఇచ్చారు. ఈ ఆస్తితో తన గ్రామంలో ఒక ప్రసూతి, శిశు సంక్షేమకేంద్రం ఏర్పడాలని ఈయన ధ్యేయం. ఇందుకొరకు తనకు ఏమీ మిగుల్చుకోకుండా పూర్తిఆస్తిని ఇచ్చివేశాడు. ఈయన ఆదర్శసతి అయిన శ్రీమతి కోలా లక్ష్మమ్మగారుకూడా వితరణ శీలయే. భర్త సంకల్పానికి ఆమె ఏమీ అడ్డుచెప్పలేదు. శ్రీమతి లక్ష్మమ్మ నడవలూరు పంచాయతీ సభ్యురాలుకూడా. తమ శేషజీవితాన్ని ఎడ్లబండి బాడుగవల్ల వచ్చే రాబడితోనూ. కాయకష్టంచేసి సంపాదించుకొనే డబ్బు తోను గడపదలిచినట్లు ఈ దంపతులు వెల్లడించారు.

తన పూర్వీకులు సంపాదించిన సుమారు రు. 10,000 లు విలువచేసే ఆస్తిని ఈయన బీదవారైన తన బంధువులకులోగడ ఇచ్చివేశారు. ఇప్పుడు దానం చేసిన ఆస్తి, ఈ దంపతులు తమ స్వయంకృషితో ఆర్జించినది.

శ్రీ రామచంద్రనాయుడు నివసిస్తున్న పేటకు ఆయన పేరిట "రామచంద్రపురం" అని పేరుపెట్టడానికి తలపెట్ట బడినది.

రచయితలు

1. శ్రీ పి. వి. యల్. ప్రసాదరావు (విద్యాదేవకులపతి), తెలుగు లెక్చరరు, హిందూకాలేజి, గుంటూరు.
2. శ్రీ నిడుదవోలు వేంకటరావు, సీనియర్ తెలుగు లెక్చరరు, మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు.
3. శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు, ఆలిండియా రేడియో, హైద్రాబాదు.
4. కీ. శే. శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి (వీరి పుత్రులు బ్రహ్మానందం పొన్నూరులో ఉన్నారు.)
5. శ్రీ మండ సూర్యనారాయణ (మసూనా) విశాఖ రచయితల సంఘం, చల్లకొండవారివీధి. విశాఖపట్నం.
6. శ్రీ యామిజాల పద్మనాభస్వామి. (రామకృష్ణమిషన్ శారదా విలాస్ బాలికల ఉన్నతపాఠశాలలో ప్రధాన తెలుగు పండితులు. మద్రాసు.)
7. శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు (పల్నాటి సోదరకవులు) 'మోర్జంపాడు' గుంటూరు జిల్లా.
8. శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు. ఖర్గపూరు, పశ్చిమ బెంగాలు.
9. శ్రీ పిళ్లా కృష్ణమూర్తి (వీరాజీ) వించ్‌పేట, విజయవాడ - 1.
10. శ్రీ అక్కల బాబురావు, గూడూరు, బందరు తాలూకా, కృష్ణాజిల్లా.
11. శ్రీ సి. వి. సుబ్బన్న శతావధాని, ప్రొద్దుటూరు, కడపజిల్లా.
12. శ్రీ జి. గజపతిరాయవర్మ, జర్నలిస్టు, తాడేపల్లిగూడెం.
13. శ్రీ చిట్టా దామోదరశాస్త్రి, అరండల్‌పేట, గుంటూరు.
14. శ్రీ కల్లూరి భోగేశ్వరసోమయాజులు, సత్యనారాయణపురం, విజయవాడ.
15. డాక్టరు దివాకర్ల వేంకటావధాని, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
16. శ్రీ శ్రీనివాసాచార్య, వెంకటగిరి, తా. నర్సంపేట.
17. 'పిపాసి', హైదరాబాదు.

★

దేశంతోపాటు మీరుకూడా అభ్యుదయం పొందండి!

మీరు మిగుల్చుకున్న డబ్బును

భారత ప్రభుత్వ చిన్న మొత్తాల పొదుపు పథకమునకు పెట్టుబడి పెట్టండి!

భారత దేశం యొక్క

సమాజాభివృద్ధి కార్యక్రమమునకు, గొప్ప నదీలోయ ప్రాజెక్టులకు,

రైలుమార్గములు, రోడ్ల అభివృద్ధికి తోడ్పడండి!

మీ డబ్బును ఈ క్రింది ఆకర్షణీయమైన గ్యారంటీడ్ సెక్యూరిటీలలో దేనిలోనైనా పెట్టుబడి పెట్టండి!

12 సంవత్సరముల జాతీయ ప్రణాళికా పొదుపు పత్రాలు

పరిణతి పొందిన పిమ్మట నూటికి సంవత్సరానికి 5.41 వంతుల చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది. ఇవి రూ. 5 లవి మొదలు రూ. 25,000 లవి వరకు లభిస్తాయి. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ 25,000 ల వరకూ కొనవచ్చు. రు. 25,000 ల విలువ పత్రాలు ప్రావిడెంటు ఫండ్ పెట్టుబడులకు మాత్రమే.

10 సంవత్సరముల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు

ఏటా నూటికి 4 వంతులు వడ్డీ చెల్లించబడుతుంది. ఒక్కొక్కరు రూ. 50 లవి మొదలు రూ. 25,000 ల వరకూ కొనవచ్చు.

15 సంవత్సరాల యాన్యుయిటీ సర్టిఫికెట్లు

జారీ చేయబడు ధరలు: రు. 1,330, రు. 3,325, రు. 6.650, రు. 13,300, రు. 26,600. ఈ సొమ్ము నూటికి యేడాదికి 4.25 వంతున కొంచెం మెక్కువగా యిచ్చే చక్రవడ్డీతోసహా నెలసరి వాయిదాలలో 15 సంవత్సరాలలో తిరిగి చెల్లించబడుతుంది. ఒక్కొక్కరు రు. 26,600 ల వరకూ కొనవచ్చు.

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అక్కౌంట్లు

25 నుంచి 10,000 ల వరకు గల నిల్వలపై నూటికి 2½ చొప్పున, రు. 10,000 లకు మించిన నిల్వలపై నూటికి 2 చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది.

క్యుములేటివ్ టైమ్ డిపాజిట్ పథకం

నెలనెలా రు. 5, 10. 20, 50, 100 లేక 200 వంతున 5 లేక 10 సంవత్సరాలపాటు డిపాజిటు చేస్తే, వడ్డీతోసహా మొత్తం అంతా ఒక్కసారే చేతికి వస్తుంది.

ఐదేండ్ల వడ్డీలేని బహుమతి బాండ్లు, 1965 ఏప్రిల్ 1 న ఎంత విలువ బాండ్లు కొన్నారో అంతమాత్రమే తిరిగి ఇవ్వబడుతుంది.

బాండ్లు రు. 100, రు. 5 ల విలువగలవి వరుసగా జారీచేయబడుతాయి. లాట్లు మూడు నెలల కొకసారి అంటే ప్రతి సంవత్సరం జూన్ 1న, సెప్టెంబరు 1 న, డిసెంబరు 1 న, మార్చి 1 న డ్రా వేయబడుతాయి. డ్రానిబట్టి ప్రతిసారి రు. 100 లు విలువచేసే 1 లక్ష బాండ్లకు 40 బహుమతులు. రు 5 లు విలువచేసే 10 లక్షల బాండ్లకు 278 బహుమతులు ఇవ్వబడుతాయి.

ఆదాయంపన్ను లేకుండా మీకు మంచి ఆదాయం లభిస్తుంది!

భావి భారత సౌభాగ్యానికై పెట్టుబడి పెట్టండి!

ఇతర వివరములకు ఈ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనావళి కొరకు —

నేషనల్ సేవింగ్సు కమీషనర్,
పోస్టుబాక్సు నెం. 96
నాగపూర్
చిరునామాకు

లేదా

రీజనల్ నేషనల్ సేవింగ్సు ఆఫీసర్,
10-2-2, ఎ. సి. గార్డ్సు రోడ్డు,
హైద్రాబాద్-4
చిరునామాకు వ్రాయండి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	....	....	1,06,041 చదరపు మైళ్ళు
జనసంఖ్య	....	....	3,12,60,133
పురుషులు	....	....	1,57,42,912
స్త్రీలు	....	....	1,55,17,221
సగటు వర్షపాతం	....	....	35.65"
అరణ్య ప్రదేశం	....	....	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	....	....	20
తాలూకాలు	....	....	183
రెవిన్యూ సర్కిళ్లు	....	....	1,000
పట్టణాలు	....	....	293
గ్రామాలు	....	....	26,450
పంటలక్రింది ప్రదేశం	....	....	2,93,81,000 ఎకరాలు
కోళ్ళ సంఖ్య	....	....	42.42.655
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం		....	68 లక్షల ఎకరాలు
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు		....	61.56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	....	....	15.5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	....	....	3069.13 మైళ్ళు
జాతీయ రహదార్లు	....	....	1,415 ,,
రాష్ట్ర రహదార్లు	....	....	3593 ,,
జిల్లా పెద్ద రోడ్లు	....	....	8220 ,,
జిల్లా ఇతర రోడ్లు	....	....	2852 ,,
గ్రామాల రోడ్లు	....	....	3442 ,,
పాఠశాలలు	....	...	34,157
కళాశాలలు	....	....	69
వృత్తి విద్యా కళాశాలలు	....	....	36
ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక ప్రమాణం		రూ.	179.89 కోట్లు

1960-61 బడ్జెటు:

ఆదాయం	....	రూ.	82.18 కోట్లు
వ్యయం	....	.... ,,	81.98 ,,
పెట్టుబడి ఖర్చు	....	.... ,,	32.44 ,,

